www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
27-10-2024
సంపుటి : 01 | సంచిక : 175 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






# కారు పార్టీలో మహా నైరాశ్యం!

(పోతుగంటి వెంకటరమణ , విశ్వంభర ప్రత్యేక ప్రతినిధి)

ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన టీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలు వరుసగా రెండు పర్యాయాలు పట్టం కట్టడంతో తమ ప్రాబల్యాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలని, కేంద్రంలో చక్రం తిప్పాలని కేసీఆర్ కలలు కన్నారు. 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి భారత రాష్ట్ర సమితిగా పార్టీగా పేరు మార్చారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, బిహార్ రాష్ట్రాలలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పర్యటించి అక్కడ కూడా పార్టీ శాఖలను ఏర్పాటు చేశారు.ముఖ్యంగా మహారాష్ట్రలో పార్టీ విస్తరణపై బాగా దృష్టి పెట్టారు. 288 అసెంబ్లీ నియోజకవర్గాలలో దాదాపు 20 లక్షల మంది బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారు. నాగ్‌పూర్ లో పార్టీ కార్యాలయాన్ని సైతం ప్రారంభించారు. ఆ హడావుడి, ఆర్భాటం చూసి మహారాష్ట్ర రాజకీయాలలో బీఆర్ఎస్ అత్యంత కీలకం కాబోతున్నదని అంతా ఊహించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడం, ఆతర్వాత పార్లమెంటు ఎన్నికల్లోనూ ఒక్కసీటు కూడా గెలవకపోవడంతో కేసీఆర్ కలలు కల్లలయ్యాయి . మహారాష్ట్ర వైపు చూడటమే కేసీఆర్ బంద్ చేశారు. దీంతో అక్కడ పార్టీలో చేరిన ముఖ్యనేతలు వేరేపార్టీలలోకి మారారు. ఈ దశలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది.ఈ నేపథ్యంలో.. బీఆర్ఎస్ గురించి చర్చ జరుగుతోంది. మహారాష్ట్ర ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీచేస్తుందా? లేదా అనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. కానీ బీఆర్ఎస్ వైపు నుంచి మాత్రం ఎలాంటి సమాధానం రావడం లేదు. అన్నిపార్టీలు చురుగ్గా ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉంటే, బీఆర్ఎస్ కేడర్ మాత్రం నైరాశ్యంలో పడిపోయింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది మాత్రం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.



మహారాష్ట్రలో గులాబీ పార్టీ గుడారం ఎత్తేసినట్లేనా? ప్రత్యేక కథనం.. 10వ పేజీలో..

## రహదారుల నిర్మాణానికి కొత్త విధానం

- మెట్రో రైలు మార్గాల విస్తరణకు కేబినెట్ ఆమోదం
- ఏటూరు నాగారంను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ కేబినెట్ తీర్మానం
- సమ్మక్క సారలమ్మ ట్రైబర్ వర్సిటీకి 211 ఎకరాలు అప్పగిస్తూ తీర్మానం
- 4 గంటల పాటు సాగిన కేబినెట్ సమావేశం..



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ సమావేశం ఏకంగా 4 గంటలపాటూ సాగింది. ఈ సమావేశంలో.. ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. రొటీన్‌గా సంక్షేమ పథకాలపై కాకుండా.. వేరే అంశాలపై ఈసారి ఫోకస్ పెట్టింది. ప్రధానంగా గ్రామీణ రహదారుల నిర్మాణానికి ఇకపై కొత్త విధానం అమల్లోకి రానుంది. రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా హైబ్రీడ్ యాన్యుటీ మోడ్ అమల్లోకి తెస్తున్నారు. అలాగే.. జీహెచ్ ఎంసీ పరిధిలోని రోడ్లు, హైవేలు, ప్రాజెక్టులకు కూడా ఇదే విధానాన్ని తీసుకురావాలని మంత్రివర్గం నిర్ణయించింది. మెట్రో రైలు మార్గాల విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. హయత్‌నగర్ - ఎల్బీనగర్, నాగోల్ - ఎల్బీనగర్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకూ మెట్రో రైలు సర్వీసులను విస్తరించేలా తీసుకున్న నిర్ణయాన్ని కేబినెట్ ఆమోదించింది. రెరాలో 54 ఉద్యోగాల భర్తీకి సంబంధించి టీజీపీఎస్సీకి ఆదేశాలు ఇస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే ములుగులో సమ్మక్క సారలమ్మ గిరిజన యూనివర్శిటీకి ఎకరా రూ.250 చొప్పున 211 ఎకరాల భూమి కేటాయింపులు జరుపుతూ మిగతా2లో...



# స్కిల్ వర్సిటీకి మేఘా ₹200 కోట్లు

## సీఎస్ఆర్ నిధులతో భవనాల నిర్మాణం

నిర్మించే బాధ్యతనూ స్వీకరిస్తున్నాం

కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి వెల్లడి

అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి

ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తాం: రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:**

రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణానికి మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్స్ లిమిటెడ్ ముందుకొచ్చింది. సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సంస్థ ఎండీ కృష్ణారెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సంప్రదింపులు జరిపింది. మొత్తం యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి కంపెనీ తమ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి రూ.200 కోట్లు కేటాయించింది. వీటితో యూనివర్సిటీ క్యాంపస్‌లో అవసరమైన భవనాలన్నింటినీ నిర్మించే బాధ్యతలను స్వీకరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, యూనివర్సిటీ మిగతా2లో...

## ఉక్రెయిన్‌కు జీ7 దేశాల సాయం

- పునర్నిర్మాణానికి చేయూత
- రష్యా ఆస్తులను అమ్మి లాభాలతో రుణం
- రుణాల్లో ఎక్కువ మొత్తం అమెరికాదే


2

రాష్ట్ర ఆదాయం తగ్గుతోంది..

## నేతల ఆదాయం పెరుగుతోంది

- కమీషన్ల కోసమే కొడంగల్ ఎత్తిపోతల పథకం
- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మాసిటీని వ్యతిరేకించారు..
- అధికారంలో రాగానే ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు
- సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ విమర్శలు

2

## లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్

- ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభానికి తుదిదశకు ఏర్పాట్లు
- పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి...


2

## హైడ్రాపై దుష్ప్రచారం

- ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు..
- అనుమతి ఉన్న నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు
- మూసీ నిర్వాసితులకు అద్భుతమైన జీవితం ఇవ్వాలని కృతనిశ్చయంతో ఉన్నాం: భట్టి


2



## బంగ్లాదేశ్‌లో హిందువుల భారీ ర్యాలీ

### జనసంద్రమైన రహదారులు

మైనార్టీల హక్కుల పరిరక్షణకు వేలాదిమంది వీధుల్లోకి

తాత్కాలిక ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు

**ఢాకా:** రాజకీయ అనిశ్చితి కొనసాగుతున్న బంగ్లాదేశ్ లో హిందువులు భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం వేలాదిమంది వీధుల్లోకి వచ్చారు. చటోగ్రామ్‌లో సనాతన జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. మహ్మద్ యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం పలు మిగతా2లో...

## పాక్‌లో ఆత్మాహుతి దాడి

- ఆరుగురు పోలీసులు సహా 8మంది మృతి!
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

## త్వరలోనే విద్యుత్ ఛార్జీల పెంపు?



ఇటీవలే నివేదిక సమర్పించిన డిస్కంలు.. వీటిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్న ఈఆర్సీ

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో త్వరలోనే విద్యుత్ ఛార్జీలు పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కరెంటు ఛార్జీలు ఎంతమేర ఉన్నాయనే వివరాలతో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టీఎస్ ఈఆర్సీ) కు విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) ఇటీవలే ఒక నివేదికను సమర్పించాయి. ఇందులో విద్యుత్ ఛార్జీల పెంపుపై పలు కీలక ప్రతిపాదనలను డిస్కంలు చేసినట్లు తెలుస్తోంది. వీటిపై ఈఆర్సీ పాలకవర్గం చర్చించి, ఛార్జీల పెంపుపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటుందని సమాచారం. ఈఆర్సీకి డిస్కంల ప్రతిపాదనలివీ..

- ప్రతినెలా 300 యూనిట్ల కంటే ఎక్కువ కరెంటును వాడే వినియోగదారులకు నెలవారీ ఫిక్స్‌డ్ ఛార్జీని రూ.10 నుంచి రూ.50కి పెంచాలని డిస్కంలు ప్రపోజ్ చేశాయి.
- ప్రతినెలా 300 యూనిట్లకుపైగా కరెంటును వినియోగిస్తున్న వారికి నెలవారీ ఫిక్స్‌డ్ ఛార్జీగా అత్యధికంగా మహారాష్ట్రలో రూ.148, కర్ణాటకలో రూ.120 వసూలు చేస్తున్నారు. అయితే ఏపీ, తెలంగాణలో నెలవారీ ఫిక్స్‌డ్ ఛార్జీ ఇప్పటికీ కేవలం 10 రూపాయలు. నెలవారీ ఫిక్స్‌డ్ ఛార్జీ ఉత్తర ప్రదేశ్‌లో రూ.53, గుజరాత్‌లో రూ.45 ఉంది.
- ప్రతినెలా 300 యూనిట్ల కంటే ఎక్కువ కరెంటును వాడే వినియోగదారులకు ఫిక్స్‌డ్ ఛార్జీలను పెంచితే అదనంగా రూ.328 కోట్ల ఆదాయం వస్తుందని మిగతా2లో...



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 120 | ₹ 142 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 206 | ₹ 234 |

విశ్వంభర V3 NEWS

## పంచాంగం

**27-10-2024, ఆదివారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
**తిథి:** ఏకాదశి ఉ.07.50 వరకు తర్వాత ద్వాదశి
**నక్షత్రం:** మఖ మ.12.21 వరకు
**సూర్యోదయం:** ఉ.6.16
**సూర్యాస్తమయం:** సా.5.43
**వర్జ్యం:** రా.09.24 నుంచి రా.11.12వరకు
**దుర్ముహూర్తం:** సా.04.11 నుంచి సా.04.57 వరకు
**రాహుకాలం:** సా.04.17 నుంచి సా.05.43 వరకు
**అమృత ఘడియలు:** ఉ.09.44 నుంచి ఉ.11.30 వరకు

## లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్‌ను రూపొందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం రూపొందించిన యాప్‌ను శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి పరిశీలించారు. ఈ యాప్‌లో ఒకటి రెండు మార్పు చేర్పులను మంత్రి సూచించారు. ఆయన సూచనల మేరకు మార్పులు చేసి వచ్చే వారంలో యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ''కొద్దిరోజుల్లోనే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తాం. ఇందుకు చేయాల్సిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని యాప్‌లో తెలుగు వెర్షన్ ఉండేలా చూడాలని సూచించా. లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల కేటాయింపు వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వీలైనంతవరకు వినియోగించుకోవాలి. పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం'' అని మంత్రి తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు.

## హైడ్రాపై దుష్ప్రచారం

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేని కొందరు వ్యక్తులు కావాలనే విష ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. మూసీ నిర్వాసితులకు అద్భుతమైన జీవితాన్ని ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మూసీ నిర్వాసితులకు వారు ఉండే చోటే అద్భుతమైన టవర్స్ నిర్మించి, వారి పిల్లలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని భట్టి తెలిపారు. మూసీ నిర్వాసిత మహిళలతోపాటు నగరంలోని డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. అనంతరం నరెడ్కో నిర్వహిస్తున్న ప్రాపర్టీ షోను భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా స్థిరాస్తి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బ్యాంకర్లతో చర్చించి స్థిరాస్తి వ్యాపారులకు రుణాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని భట్టి హామీ ఇచ్చారు. హైడ్రాపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఉన్న పార్కులు, చెరువులు, గుట్టలు, ప్రభుత్వ భూములను రక్షించేందుకు మాత్రమే హైడ్రా ఉందని భట్టి తెలిపారు. అనుమతి ఉన్న నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

## రాష్ట్ర ఆదాయం తగ్గుతోంది.. నేతల ఆదాయం పెరుగుతోంది

**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే కాంగ్రెస్ సర్కారుపై తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ దయాకర్ రెడ్డి, బీఎస్పీ తరఫున అసెంబ్లీకి పోటీచేసిన నర్మద, ఇతర నేతలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా సిటీని రేవంత్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారని, అధికారంలోకి వచ్చిన తరువాత కొడంగల్‌లోనే ఫార్మా కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కొడంగల్ నియోజకవర్గాన్ని తక్కువ ఖర్చుతో సస్యశ్యామలం చేసే ప్రణాళికను పక్కన పెట్టారని.. కేవలం కమీషన్ల కోసం కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును చేపట్టారని ఆరోపించారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు పలు వర్గాల ఆందోళనలు, ధర్నాలతో తెలంగాణ అట్టుడుకుతోందని, మంత్రులు మాత్రం విహార యాత్రల్లో ఎంజాయ్ చేస్తున్నారని మండిపడ్డారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు ప్రగతిపథంలో పరుగులు పెట్టిన తెలంగాణ రాష్ట్ర ఆదాయం తగ్గుతోందని, కాంగ్రెస్ నేతల ఆదాయం మాత్రం పెరుగుతోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ హెలికాప్టర్ ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో తరిస్తోందని, ఇది అధికార దుర్వినియోగం కాకపోతే మరేంటని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా కలిసికట్టుగా పనిచేసి కొడంగల్‌లో కాంగ్రెస్‌ను ఓడించాలని నేతలకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

## రహదారుల నిర్మాణానికి కొత్త విధానం

(మొదటి పేజీ తరువాయి)

కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇంకా ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమిని బదలాయించింది.మద్నూర్ మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇంకా హన్మకొండ, వరంగల్ జిల్లాల పరిధిని పెంచే నిర్ణయాన్ని ఆమోదించింది. ఇంకా ఏటూరు నాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. అలాగే సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.తెలంగాణలో మరో రెండు నెలల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతుంది. ఈ సందర్భంలో ఈ మంత్రివర్గ సమావేశం జరిగింది. ఐతే.. కీలక పథకాలపై మాత్రం పెద్దగా చర్చ జరగలేదని తెలిసింది.

## బంగ్లాదేశ్‌లో హిందువుల భారీ ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)



డిమాండ్లు ఉంచారు. ఈ మేరకు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో తాత్కాలిక ప్రభుత్వం ముందు ఎనిమిది డిమాండ్లు ఉంచారు. వాటిని నెరవేర్చేవరకు వీధుల్లో తమ నిరసన కొనసాగుతుందని కొందరు హిందూ ఉద్యమకారులు పేర్కొన్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కొద్దినెలల క్రితం బంగ్లాలో హింసాత్మక ఘర్షణలు జరిగాయి. దాంతో అప్పుడు షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ అధికారాన్ని కోల్పోయింది. హసీనా రాజీనామా చేసి, దేశాన్ని భారత్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఎన్నికల జరిగే వరకు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పాలన కొనసాగిస్తోంది.

# ఉక్రెయిన్‌కు జీ7 దేశాల సాయం



**మాస్కో:** రష్యా దురాక్రమణ చర్యతో తీవ్రంగా నష్టపోయిన ఉక్రెయిన్‌ను ఆదుకునేందుకు జీ7 దేశాలు ముందుకొచ్చాయి. యుద్ధం కారణంగా నష్టపోయిన ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు జీ7 దేశాల నాయకులు ప్రకటించారు. ఆయా దేశాల్లో జప్తు చేసిన రష్యా ఆస్తులను అమ్మగా వచ్చిన లాభాల్లో 50 బిలియన్ల యూఎస్ డాలర్ల రుణం ఉక్రెయిన్‌కు ఇవ్వనున్నట్లు తెలిపాయి. ఇందులో 20 బిలియన్ల డాలర్ల రుణాన్ని ఒక్క అమెరికానే అందించనుంది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం మొదలై దాదాపు రెండేళ్లు దాటుతోంది. రష్యా బలగాలు దాడులతో ఉక్రెయిన్ తీవ్రంగా నష్టం పోయింది. ప్రాణనష్టంతో పాటు ఆర్థికంగా కూడా ఉక్రెయిన్ భారీ నష్టాన్ని చవిచూసింది. కీవ్‌లో కార్యకలాపాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌ను ఆదుకునేందుకు జీ7 దేశాలు ముందుకొచ్చాయి. ఇందులోభాగంగా ఉక్రెయిన్‌కు దాదాపు 50 బిలియన్ల యూఎస్ డాలర్లు (సుమారు రూ.42,000 కోట్లు) అందించనున్నట్లు ఓ ప్రకటనను విడుదల చేశాయి. ఇటీవల అమెరికాలోని వాషింగ్టన్‌లో అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్న జీ7 దేశాల నాయకులు ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశాల్లో ఉక్రెయిన్‌కు అండగా ఉండాలని ఆ దేశ పునర్నిర్మానానికి ఆర్థిక రుణం అందిచాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు.

**రష్యా ఆస్తుల లాభాల నుంచి!**

అయితే ఈ రుణాన్ని జీ7 దేశాల్లో ఆయా దేశాలు జప్తు చేసిన రష్యా ఆస్తులను అమ్మగా వచ్చిన లాభాల్లో నుంచి ఈ ఆర్థిక రుణాన్ని ఇవ్వనున్నట్లు తెలిపాయి. ఉక్రెయిన్‌పై దాడులను ప్రారంభించిన వెంటనే తమ దేశాల్లో ఉన్న రష్యాకు చెందిన ఆస్తులను జీ7 దేశాలు అధీనంలోకి తీసుకొన్నాయి. వీటిపై వచ్చిన లాభాలను ఉక్రెయిన్‌కు రుణంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ నిధుల పంపిణీ ఎలా అందించాలనే దానిపై జీ7 దేశాల నేతలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు వెల్లడించారు. ఈ రుణాన్ని బహుళ మార్గాల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ నిధుల పంపిణీని ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ ఆర్థిక, సైనిక, పునర్నిర్మాణ సాయానికి మద్దతు ఇచ్చేందుకు రుణ ఆదాయాన్ని అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌కు అవసరమైన మద్దతును అందించేందుకు ఎప్పుడు ముందుటామని జీ7 దేశాల నేతలు పునరుద్ఘాటించారు. మాస్కో తన యుద్ధాన్ని ముగించి ఉక్రెయిన్‌కు జరిగిన నష్టాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

**అమెరికా నుంచే ఎక్కువ**

50 బిలియన్ల డాలర్ల రుణాల్లో ఎక్కువ మొత్తం అమెరికా నుంచే ఉక్రెయిన్‌కు అందనున్నాయి. దాదాపు 20 బిలియన్ల డాలర్లను ఉక్రెయిన్‌కు అమెరికా ఇవ్వనున్నట్లు అధ్యక్షుడు జోబైడెన్ పేర్కొన్నారు. ఇందులో పది బిలియన్ల డాలర్లను ఆర్థిక రుణంగా అందించనుండగా మిగిలిన మొత్తాన్ని సైనిక సహాయంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. 50 బిలియన్ డాలర్లలో మిగిలిన 30 బిలియన్ డాలర్ల రుణాలు ఐరోపా, యూకే, కెనడా, జపాన్‌తో సహా జీ7 భాగస్వామ్య దేశాల నుంచి ఉక్రెయిన్‌కు అందుతాయి.

# గాడిన పడుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

- కొంతమేరకు తగ్గిన ద్రవ్యోల్బణం
- కొవిడ్, యుద్ధ వాతావరణ ప్రభావం ఎక్కువ
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**వాషింగ్టన్:** గత కొన్నేళ్లుగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రపంచ ఆర్థికవ్యవస్థ త్వరలోనే గాడిలో పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆర్థిక శాఖ మంత్రి మీడియానుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ దేశాలు, బహుపాక్షిక ఆర్థికసంస్థల మధ్య ఆర్థిక సమన్వయం పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆర్థికవ్యవస్థకు మంచి రోజులు రానున్నాయని ఆమె పేర్కొన్నారు. ''ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్, ప్రపంచబ్యాంకు సంయుక్తంగా నిర్వహించిన చర్చలతో ప్రపంచ ఆర్థికవ్యవస్థ గాడిలో పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. ఫండ్, కేంద్ర బ్యాంకులు, వివిధ సంస్థలు, ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాల వల్ల ద్రవ్యోల్బణం కొంతమేర తగ్గింది. దీనివల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థ తిరిగి పుంజుకుంటుంది. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థల్లోనూ వృద్ధి శాతం పెరుగుతోంది. అయితే ఈ విషయంలో దేశాలన్నీ మరింత జాగ్రత్త వహించాలి. ఎందుకంటే ఆర్థికవ్యవస్థలు స్థిరంగా ఉన్నాయి కానీ, వెంటనే పుంజుకునేలా లేవు'' అని నిర్మలా సీతారామన్ అన్నారు. కొవిడ్ మహమ్మారి, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణ ప్రభావం ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలపై ఎక్కువగా ఉందని ఆమె పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో ప్రపంచదేశాలు అధికంగా రుణాలు తీసుకోవడం వల్ల ద్రవ్యలోటుపై నియంత్రణ కోల్పోయాయని.. దానిని సహేతుకమైన సంఖ్యకు తీసుకురావడానికి సరైన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. భారత్ ప్రపంచదేశాల నుంచి పెద్దమొత్తంలో దిగుమతులు చేసుకోవడం వల్ల దేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో సంప్రదాయ ఉత్పత్తులు పెద్ద మొత్తంలో ఉత్పత్తి కాకపోవడం వల్ల ఎగుమతుల్లో పెరుగుదల కనిపించట్లేదని తెలిపారు. భారత్ అంతర్గత సవాళ్ల కంటే బాహ్య సవాళ్లను అధికంగా ఎదుర్కొంటోందని.. అయినా సాధ్యమైనంత వేగంగా వృద్ధి చెందడానికి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకువస్తే వాణిజ్య నిబంధనలను మరింత సరళీకరించడానికి ప్రయత్నిస్తామన్నారు. ప్రస్తుతం దేశంలో ఆర్థిక సంస్కరణలు జరుగుతున్నాయని, పరిస్థితులకు అనుగుణంగా ఇవి కొనసాగుతూనే ఉంటాయని వెల్లడించారు. పెట్టుబడిదారులకు మరింత ఆకర్షణీయంగా ఉండడానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని నిర్మలా సీతారామన్ తెలిపారు.

# ఆకాశవాణిలో వార్తలు వింటూ పెరిగా..



**ఢిల్లీ:** ఆకాశవాణి లో హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం భాషల్లో వచ్చే వార్తలు వింటూ తాను పెరిగానని అన్నారు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.

- 'వారి గొంతు నేనెప్పటికీ మర్చిపోలేను
- బాల్యంలో చాలాసార్లు ముంబయిలోని స్టూడియోకు వెళ్లా
- పాశ్చాత్య మ్యూజిక్ కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరించా
- ఆకాశవాణితో అనుబంధాన్ని పంచుకున్న సీజేఐ
- ఆల్ ఇండియా రేడియోతో ప్రత్యేకంగా ముచ్చటించిన చంద్రచూడ్

చంద్రచూడ్ సుప్రీంకోర్టు వజ్రోత్సవాల్లో భాగంగా సీజేఐ తాజాగా ఆల్ ఇండియా రేడియోతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈసందర్భంగా ఆకాశవాణిలో ప్రజెంటర్‌గా తన కెరీర్ తొలినాళ్లను గుర్తు చేసుకున్నారు.''ఆల్ ఇండియా రేడియోతో నా అనుబంధం చాలా ఏళ్ల కిందటే మొదలైంది. అప్పట్లో మా అమ్మానాన్నలతో కలిసి ఆకాశవాణిలో వచ్చే వార్తల బులిటెన్‌లను వింటూ నా బాల్యం గడిచింది. 'ఆకాశవాణి.. ఈ రోజు వార్తలు చదువుతున్నది' అంటూ ప్రముఖ న్యూస్ ప్రజెంటర్లు దేవకీ నందన్ పాండే, పమీలా సింగ్, లోతికా రత్నం లాంటి వారు చెబుతుంటే అలా వింటూ ఉండేవాణ్ని. వారి గొంతూ ఎప్పటికీ మర్చిపోలేను'' అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. ''మా అమ్మకు శాస్త్రీయ సంగీతంలో ప్రావీణ్యం ఉంది. ఆమె ఆల్‌ఇండియా రేడియోలో కార్యక్రమాలు చేసేవారు. అలా నేను బాల్యంలో చాలాసార్లు ముంబయిలోని స్టూడియోకు వెళ్లా. 1974లో దిల్లీకి మారిన తర్వాత ఆకాశవాణికి ఆడిషన్ ఇచ్చా. 19 ఏళ్ల వయసులో న్యూస్ ప్రజెంటర్‌గా చేరా. హిందీ, ఇంగ్లీష్‌లో ప్రోగ్రామ్‌లు చేసేవాణ్ని. నా తొలి ప్రోగ్రామ్ నాకు ఇంకా గుర్తుంది. ఆ రోజుల్లో పాశ్చాత్య మ్యూజిక్ కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరించా'' అని ఆకాశవాణితో తనకున్న అనుబంధాన్ని సీజేఐ పంచుకున్నారు. ఈసందర్భంగా సుప్రీంకోర్టులో సాంకేతికపరమైన మార్పులు, న్యాయవ్యవస్థలో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే వారు మరింత రాణిస్తారని అన్నారు.



## మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీతో మహేష్ కుమార్ గౌడ్ భేటీ

**ఢిల్లీ:** ఢిల్లీ లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే తో, ఏఐసీసీ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ భేటి అయ్యారు.



ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఎన్నికయ్యి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే నివాసానికి వెళ్లి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అక్కడే ఉన్న రాహుల్ గాంధీ తో 10 నిమిషాలపాటు సమావేశం అయిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ పరంగా తాను ఎన్నికయిన 50 రోజుల పాటు జరిగిన పలు ముఖ్యమైన రాజకీయ కార్యక్రమాల వివరాలు రాహుల్ గాంధీకి మహేష్ కుమార్ గౌడ్ వివరించారు.

## మూసీ బ్యూటిఫికేషన్ డబ్బు సంచులు నింపుకోవడానికే

- సీఎం రేవంత్‌రెడ్డి దుర్బుద్ధి.. ఆరునెలల్లోనే బయటపడింది
- ఎస్టీపీలను ప్రారంభించే తెలివి సీఎంకు లేదు
- అమలులో కాంగ్రెస్ విఫలం
- మీడియా సమావేశంలో ఎంపీ ఈటల

**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి మూసీ బ్యూటిఫికేషన్ చేస్తాననేది కేవలం డబ్బు సంచులు నింపుకోవడానికేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇప్పటివరకు నిర్మించిన మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ)లను ప్రారంభించే తెలివి సీఎంకు లేదని దుయ్యబట్టారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని టీకేఆర్ కాలనీలో మూసీ పరివాహక ప్రాంతాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పరిశీలించారు. ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న ఈటల.. ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రా, మూసీ పేరుతో కొత్త నాటకాలకు తెర లేపారన్నారు. పేదలకు అన్యాయం చేసి పెట్టుబడిదారులకు వత్తాసు పలకడం సీఎం రేవంత్ రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిజస్వరూపం తెలిసేందుకు ఆరేళ్లు పడితే.., రేవంత్ దుర్బుద్ధి ఆరు నెలల్లోనే బయటపడిందన్నారు. ఇష్టారీతిన వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పాలనకు మంచి రోజులు ముగిశాయన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదన్నారు. మూసీలో విషపదార్థాలు, రసాయనాలు చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## త్వరలోనే విద్యుత్ ఛార్జీల పెంపు?

(మొదటి పేజీ తరువాయి)

డిస్కంలు ఈఆర్‌సీకి తెలిపాయి.

- లోటెన్షన్ వాణిజ్య కేటగిరీ కనెక్షన్లకు తెలంగాణలో ప్రతినెలా ఫిక్స్‌డ్ ఛార్జీగా రూ.70 వసూలు చేస్తున్నారు. అయితే దీన్ని రూ.150కి పెంచాలని డిస్కంలు ప్రపోజ్ చేశాయి. ఈ ఛార్జీ అత్యధికంగా మహారాష్ట్రలో రూ.626, యూపీలో రూ.355, కర్ణాటకలో రూ.255 మేర ఉంది. తమిళనాడులో ఈ ఛార్జీ రూ.107గా ఉంది.
- 11కేవీ కనెక్షన్ స్థాయిలోనే.. 33కేవీ, 132 కేవీ కనెక్షన్లకు కూడా విద్యుత్ ఛార్జీలను పెంచి వసూలు చేస్తామని డిస్కంలు తెలిపాయి.
- ప్రస్తుతం తెలంగాణలో హెచ్‌టీ పరిశ్రమల కనెక్షన్లకు 11కేవీకి యూనిట్‌కు రూ.7.65, 33కేవీకి రూ.7.15, 132కేవీకి రూ.6.65 చొప్పున డిస్కంలు వసూలు చేస్తున్నాయి. ఇకపై ఈ అన్ని కేటగిరీలకు ఒకేవిధంగా యూనిట్‌కు రూ.7.65 చొప్పున ఛార్జీని విధిస్తామని తెలిపాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో ఈ ఛార్జీ ప్రతి యూనిట్‌కు రూ.8.36, కర్ణాటకలో రూ.7.40, గుజరాత్‌లో రూ.6.90, తమిళనాడులో రూ.6.90 చొప్పున ఉందని డిస్కంలు వెల్లడించాయి.
- హెచ్‌టీ వాణిజ్య కనెక్షన్‌కు మన రాష్ట్రంలోప్రతి యూనిట్‌కు రూ.8.80 తీసుకుంటున్నారు. ఈ ఛార్జీ అత్యధికంగా మహారాష్ట్రలో రూ.13.21, కర్ణాటకలో రూ.9.25 మేర వసూలు చేస్తున్నారు. తమిళనాడులో మాత్రం రూ.8.70 మాత్రమే తీసుకుంటున్నారు.
- హెచ్‌టీ వాణిజ్య కేటగిరీలో నెలవారీ ఫిక్స్‌డ్ ఛార్జీని రూ.475 నుంచి రూ .500కి పెంచాలని డిస్కంలు ప్రపోజ్ చేశాయి. ఈ ఛార్జీలు అత్యధికంగా మహారాష్ట్రలో రూ.664, తమిళనాడులో రూ.590, గుజరాత్‌లో రూ.570 వసూలు చేస్తున్నారు.
- హెచ్‌టీ ఛార్జీల పెంపునకు తెలంగాణ ఈఆర్‌సీ ఆమోదం తెలిపితే.. రూ.700 కోట్ల అదనపు ఆదాయం లభిస్తుందని అంచనా.

## స్కిల్ వర్సిటీకి మేఘా రూ.200 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)



వైస్ ఛాన్సలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. ముఖ్యమంత్రితోపాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ శివారు కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సమీపంలో 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీ నిర్మాణానికి ఆగస్టులోనే సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా భూమి పూజ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ అధునాతన బోధన సదుపాయాలతోపాటు విద్యార్థులకు అన్ని వసతులు ఉండేలా క్యాంపస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎస్ఆర్ నిధులతో క్యాంపస్ నిర్మాణానికి మేఘా కంపెనీ ముందుకు రావడం పట్ల ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఆ ప్రాంగణంలో అకడమిక్ బిల్డింగ్, వర్క్‌షాపులు, హాస్టల్ బిల్డింగ్ వంటివి నిర్మిస్తామని కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఇప్పటికే ఆర్కిటెక్ట్ నిపుణులతో తయారు చేయించిన యూనివర్సిటీ భవన నిర్మాణ నమూనాలు, డిజైన్లను ఈ సమావేశంలో ప్రదర్శించారు. వారం రోజుల్లోగా భవన డిజైన్లకు తుది రూపు ఇవ్వాలని సీఎం సూచించారు. నవంబరు 8 నుంచి విశ్వవిద్యాలయం భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరఫున అందుకు అవసరమైన పూర్తి స్థాయి సహకారం అందిస్తామని సీఎం భరోసా ఇచ్చారు

## పాక్‌లో ఆత్మాహుతి దాడి

**కరాచీ:** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంక్వాలో శనివారం జరిగిన ఆత్మాహుతి దాడిలో 8మంది మృతి చెందారు. అనేక మంది గాయపడ్డారు. మరణించిన వారిలో నలుగురు పోలీసులు, ఇద్దరు సైనికులు కాగా, మరో ఇద్దరు పౌరులు ఉన్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఆఫ్ఘానిస్థాన్ సరిహద్దులో ఉన్న నార్త్ వజీరిస్థాన్ జిల్లాలోని అలీ తహసీల్ అస్లాం చెక్ పోస్ట్ వద్ద ఈ ఘటన జరిగింది. శనివారం త్రీ వీలర్ వెహికల్‌పై వచ్చిన నిందితుడు చెక్ పోస్టు, భద్రతా దళాల వాహనాలను ఢీకొట్టి ఆత్మాహుతికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు.

**ఇరాన్ పోలీస్ కాన్వాయ్‌పై దాడి**

ఇరాన్ ఆగ్నేయ ప్రాంతంలో పోలీస్ కాన్వాయ్‌పై భారీ దాడి జరిగింది. ఈ దాడి వల్ల ఆ దేశ జాతీయ పోలీసు దళానికి చెందిన 10 మంది అధికారులు మరణించారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 1200 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోహర్ కుహ్‌లో ఈ దాడి జరిగినట్లు, అధికారిక మీడియా తెలిపింది. అయితే ఈ దాడి ఎవరు చేశారో ఇంకా తెలియరాలేదు. ఇప్పటి వరకు ఏ సంస్థ – ఈ దాడికి బాధ్యత వహిస్తూ ప్రకటన చేయలేదు. శనివారం తెల్లవారు జామున ఇరాన్‌పై ఇజ్రాయెల్ భారీ దాడులకు పాల్పడింది. ఆ తరువాత పోలీస్ కాన్వాయ్‌పై దాడి జరగడం గమనార్హం.

# రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు..



- సోషల్ మీడియా వేదికగా అవాకులు, చెవాకులు పేలుతున్నారు..
- నేను అనని మాటలను అన్నట్లుగా ట్రోలింగ్ చేస్తే లీగల్ నోటీసులు ఇస్తా
- ఖైరతాబాద్ సెంటర్ లో ముక్కు నేలకు రాయిస్తా
- ధైర్యం చేయడంలో రేవంత్,జగ్గారెడ్డి తో కేటీఆర్, హరీష్ పోటీ పడలేరు
- కేటీఆర్, హరీష్ చిన్న పిల్లల చేష్టలు మానుకోండి
- మీ సోషల్ మీడియాను కంట్రోల్ పెట్టుకోండి లేదంటే మిమ్మల్ని నడిరోడ్డు మీద నిలదీస్తాం
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హెచ్చరిక

**విశ్వంభర, హైదరాబాద్:** తాను అనని మాటలను అన్నట్లుగా ట్రోలింగ్ చేస్తే లీగల్ నోటీసులు ఇస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హెచ్చరించారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ తనపై వస్తున్న ట్రోలింగ్ మీద ఘాటుగా స్పందించారు. తనపై ట్రోలింగ్ చేసేవాళ్లు దొరికితే బహిరంగంగానే బట్టలూడదీసి కొడతానంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఇటీవల కొంతమంది సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రుల మీద కూడా సోషల్ మీడియా వేదికగా అవాకులు, చెవాకులు పేలుతున్నారని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుల ప్రసంగాలను ఇష్టారీతిన ఎడిట్ చేసి ట్రోలింగ్ చేస్తున్నారని ఆరోపించారు. తాను ఓ మహిళా కలెక్టర్‌ను బూతులు తిట్టినట్లు సోషల్ మీడియాలో దారుణమైన పోస్టులు పెడుతున్నారన్నారు. కానీ తాను ఏ కలెక్టర్‌నూ దూషించలేదని జగ్గారెడ్డి వివరణ ఇచ్చారు. సోషల్ మీడియాలో తమపై జరుగుతున్న ప్రచారం సరికాదన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఓ దండుపాళ్యం బ్యాచ్‌లా తయారయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావుకు ఈ మధ్య మతి పూర్తిగా భ్రమించిందని జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. అధికారం దూరం అవ్వటంతో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. నిత్యం ఏదో ఓ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని బద్నామ్ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పని మొదలుపెట్టి కేవలం 10 నెలలే అయ్యిందన్న జగ్గారెడ్డి.. ఇప్పటికే తట్టుకోలేకపోతున్నారని.. ఇంకా నాలుగేండ్లు భరించాలన్నారు. ఇంకో ఐదేళ్లు కూడా అధికారంలో ఉండేందుకు ప్లాన్ చేస్తున్నామని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. కేటీఆర్ నీకు కొంచెం గౌరవం ఇస్తా కానీ మీ సోషల్ మీడియాను కంట్రోల్‌లో పెట్టు, లేదంటే మా సంగతి మీకు తెలియదు అని హెచ్చరించారు. కాంగ్రెస్ వాళ్లను కేటీఆర్ లుచ్చాలు అంటున్నాడు.. లుచ్చా లకే లుచ్చా కేటీఆర్. రేవంత్ చిట్టి నాయుడు కాదు గట్టి నాయుడు. రేవంత్ రెడ్డి తొడ కొడితే, కేటీఆర్‌కి కాళ్లు వణుకుతున్నాయి. ధైర్యం చేయడంలో రేవంత్.. జగ్గారెడ్డితో కేటీఆర్, హరీశ్ రావు పోటీ పడలేరు. మీ బావబామ్మర్దులు చిన్న పిల్లల చేష్టలు మానుకోవాలన్నారు. తప్పుడు రాతలు రాయిస్తే ఖైరతాబాద్ సెంటర్‌లో ముక్కు నేలకు రాయిస్తాం. నా మాటలు, సీఎం రేవంత్ రెడ్డి మాటలు మొరటుగా ఉంటాయి కానీ మంచివాళ్లం అంటూ జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త కుమారుడు సాయి కిరణ్ వివాహ నిశ్చితార్థం శ్రావణితో శనివారం జీఎస్ఆర్ కన్వెన్షన్ హస్తినాపురంలో నిర్వహించారు. ఈ వేడుకకు వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ డా.కాచం సత్యనారాయణ, కాచం సుష్మ, కాచం సాయి హాజరై కాబోయే వధూవరులకు శుభకాంక్షలు తెలిపారు. - విశ్వంభర, హైదరాబాద్



# కష్టపడే ప్రతి కార్యకర్తకు అవకాశాలు వస్తాయి

**విశ్వంభర, ఖమ్మం :** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తల సర్వసభ్య సమావేశం ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సయ్యద్ గౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షుడు మంఖాల దాసు, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర సెక్రెటరీ కొదుమూరి దయాకర్ రావు హాజరయ్యారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యుల నియామకాలు, నవంబర్ 20వ తేదీన గాంధీభవన్లో జరగబోయే అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ శాతబ్ది ఉత్సవాల గురించి ఇతర అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ఇంచార్జ్ మంఖాల దాసు, రాష్ట్ర కార్యదర్శి కోడుమూరి దయాకర్ రావుతో కలిసి మాట్లాడారు బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ సేవదళ్‌ను పటిష్టం చేయాలన్నారు.



# గ్రీన్ హిల్స్ కాలనీ సాయిబాబా దేవాలయంలో

**దాతలు, ప్రముఖుల ప్రత్యేక పూజలు**

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం నియోజవర్గం శ్రీ రామకృష్ణా పురం డివిజన్‌లో శనివారం గ్రీన్ హిల్స్ కాలనీలోని సాయిబాబా దేవాలయ స్థల దాత రీతా సంతోష్ దేవాలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలకు చైతన్యపురి ఎస్‌హెచ్ఓ వేంకటేశ్వర రావు, శ్రీ రామకృష్ణా పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్ల రవీంద్ర, భూపాల్ రెడ్డి, తల్లటి రమేష్, జెల్ల జగన్నాథం, దోర్నాల చంద్రమౌళి, విగ్రహ దాత ఎల్లారెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు కృష్ణరావు, దయాకర్ రెడ్డి, పురుషోత్తం, రఘువీర్, రవీందర్ సింగ్, లక్ష్మి పద్మజ, లక్ష్మీనారాయణ, హర్షవర్ధన్, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 'మహా' ఎన్నికలకు ఆప్ దూరం

- కీలక నిర్ణయం తీసుకున్న అధినేత
- మిత్రుల కోసం కేజ్రీవాల్ ప్రచారం

**దిల్లీ:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైన ఆమ్ ఆద్మీ పార్టీ మహారాష్ట్ర ఎన్నికల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించిందని ఆ పార్టీ నేత సంజయ్ సింగ్ తెలిపారు. మహా వికాస్ అఘాఢీ కూటమిలోని పార్టీలకు మద్దతుగా తమ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. మహారాష్ట్రతో పాటు ఝార్ఖండ్ విషయంలోనూ ఆమ్ ఆద్మీ పార్టీ ఇదే వైఖరి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హేమంత్ సోరెన్‌కు మద్దతుగా ఝార్ఖండ్ ముక్తి మోర్చాకు కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. మహరాష్ట్రలోని 288 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరనుండగా.. ఝార్ఖండ్‌లో 13, 20 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. 23న ఫలితాలు వెలువడనున్నాయి. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి పోటీగా విపక్ష పార్టీలన్నీ ఇండియా కూటమి స్థాపించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభ ఎన్నికల్లో దిల్లీ, గుజరాత్, హర్యానా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో కలిసి ఆప్ పోటీ చేసింది. ఒక్క పంజాబ్‌లో మాత్రం ఒంటరిగా బరిలోకి దిగింది. ఇటీవల జరగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం సొంతంగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైంది. తాజాగా మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా నిలిచింది.

# నవంబర్ 30 నుంచి డిసెంబర్ 1వరకు హన్మకొండలో

**ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర ద్వితీయ మహాసభలు : బొమ్మగాని ప్రభాకర్**

**విశ్వంభర, హన్మకొండ:** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 1వ తేదీవరకు హన్మకొండలో నిర్వహించనున్నట్లు ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. శనివారం హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్ అధ్యక్షతన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని సెక్యులరిజాన్ని రక్షించడంలో ప్రజా పోరాటాలలో న్యాయవాదులది కీలక పాత్ర ఉండాలని, ఐఏఎల్ ఆ పాత్రను సమర్ధవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో న్యాయవాదుల మీద దాడులు పెరిగిపోతున్నాయని న్యాయ రక్షణ కోసం వృత్తిపరమైన బాధ్యతలను నిర్వహిస్తున్న న్యాయవాదులకు రక్షణ చట్టం తక్షణమే తీసుకురావాల్సిన అవసరముందన్నారు.




అదేవిధంగా వివిధకోర్టుల్లో నాయవాదులతో పాటు జూనియర్ అడ్వకేట్లు, మహిళా అడ్వకేట్లు సమస్యలను ఐఏఎల్ రాష్ట్ర మహాసభల్లో చర్చించడంతో పాటు సెమినార్ నిర్వహించనున్నామని ఈ సెమినార్ రాష్ట్ర హైకోర్టు జడ్జిలు, ఐఎల్ నాయకులు పాల్గొనున్నారని వెల్లడించారు. దుస్సా జనార్ధన్ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ఐఏఎల్ రాష్ట్ర మహాసభలను ఘనంగా నిర్వహించడానికి భారీ ఏర్పాటు జరుగుతున్నాయని, న్యాయవాదులందరూ పెద్ద ఎత్తున పాల్గొనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఐఏఎల్ నాయకుల ఉదయ భాస్కర్, భీమనపల్లి శ్రీనివాస్, కేవీ ఎల్, శేషగిరిరావు, జయ శ్రీనివాస్, వీ రాములు, లతీఫ్, ప్రభాకర్, బొమ్మగాని శ్రీనివాస్, మురళీ, కారింగుల రాంమూర్తి, లీలా కుమారి, దామోదర్,రముణ, వెంకటరమణారెడ్డి, ఉదయ్ వెంకటరెడ్డి, బరిగిల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.









# జగమెరిగిన దౌత్యవేత్త కె.ఆర్.నారాయణన్

నేడు దివంగత రాష్ట్రపతి జయంతి

పాత్రికేయునిగా, అధ్యాపకునిగా, ఉద్యోగిగా, విదేశాల్లో భారత విదేశాంగ శాఖ ప్రతినిధిగా, భారత రాయబారిగా, అత్యుత్తమ దౌత్యవేత్తగా, విదేశాంగశాఖ సెక్రటరీగా, వైస్ ఛాన్సలర్ గా, మూడుసార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా కె. అర్. నారాయణ్ అందించిన బహుముఖ సేవలు చిరస్మరణీయాలు. కొచెరిల్ రామన్ నారాయణన్ (కె.ఆర్.నారాయణన్) (1920 అక్టోబర్ 27 - 2005 నవంబరు 9) పెరుమథనం, ఉఝవూర్ గ్రామంలో పేద దళిత కుటుంబంలో కొచెరిల్ రామన్ వైద్యర్, పున్నత్తురవీట్టిల్ పాపియమ్మ దంపతులకు జన్మించారు. నారాయణన్ వాస్తవానికి 4 ఫిబ్రవరి 1921 న జన్మించినట్లు చెపుతారు. అయితే ఆయన మేనమామ, పాఠశాలలో యాదృచ్ఛికంగా 27 అక్టోబర్ 1920ను నమోదు చేయించినట్లు చెపుతారు. అదే తేదీని నారాయణన్ తన పుట్టిన తేదీగా ఎంచుకుని, అధికారికంగా ఉండటానికి అనుమతించారు. అలా అధికారిక రికార్డుల ప్రకారం, తేదీ 27 అక్టోబర్ 1920 జన్మదినం అయింది. ఆయన భారతదేశ 10వ రాష్ట్రపతి. నారాయణన్ సెయింట్ జాన్స్ హైస్కూలు కూతట్టుకుళంలో అనంతరం సెయింట్ మేరీ హైస్కూలు, కురవిలంగడ్ లో చదివి మెట్రిక్యులేషన్ (1936-37) పూర్తి చేసారు. ఇంటర్మీడియట్ విద్యను కొట్టయంలోని సి.ఎం.ఎస్ కళాశాలలో (1938 - 40) పూర్తి చేసారు.



నారాయణన్ బి.ఎ (ఆనర్స్), ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ డిగ్రీలను ట్రావెన్స్‌కోర్ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం కేరళ విశ్వ విద్యాలయం) నుండి పూర్తిచేసారు. విశ్వ విద్యాలయంలో ప్రథమ శ్రేణిలో (ట్రావెన్స్‌కోర్ లో డిగ్రీలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడైన మొదటి దళిత విద్యార్థి) ఉత్తీర్ణుడయ్యారు. ఆయన కుటుంబం తీవ్రమైన యిబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఢిల్లీ వెళ్ళి ది హిందూ, ది టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలలో పాత్రికేయుడిగా (1944%-%45) పని చేసారు. ఎం.మున్షీ ప్రచురిస్తున్న సోషల్ వెల్ఫేర్ వారపత్రికకు లండన్ విలేకరిగా వ్యవహరించారు.

పాత్రికేయులుగా కొంతకాలం పనిచేసిన తర్వాత, ఉపకార వేతనం సహాయంతో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో రాజకీయ శాస్త్రాన్ని అధ్యయనం చేసారు. నెహ్రూ ప్రభుత్వంలో భారత విదేశాంగ శాఖలో ఉద్యోగిగా నారాయణన్ తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. నారాయణన్ ప్రతిభను గుర్తించిన జవహర్ లాల్ నెహ్రూ ఆయనను రంగూన్ లోని భారత విదేశాంగ శాఖలో భారతదేశ ప్రతినిధిగా నియమిం చారు. ఆయన జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, థాయ్‌లాండ్, టర్కీ, చైనా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు దేశాలలో భారత రాయబారిగా పనిచేసారు. అమెరికాలో భారత రాయబారిగా 1980 నుండి 1984 వరకూ నాలుగేళ్ళు పనిచేసారు. ఆయనను దేశంలో అత్యుత్తమ దౌత్యవేత్తగా నెహ్రూ పేర్కొన్నారు.

1949లో భారత విదేశాంగ సర్వీసులో (ఐ.ఎఫ్.ఎస్) నెహ్రూ అభ్యర్థన మేరకు చేరారు. దౌత్యవేత్తగా రంగూన్, టోక్యో, కెనడా , హనోయ్ లలో పని చేసారు. థాయ్‌లాండ్ (1967%-%69), టర్కీ (1973%-%75), చైనా(1976%-%78) ల భారత అంబాసిడర్ గా ఉన్నారు. 1954 లో ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ లో బోధించారు. అతను జవహర్‌లాల్ నెహ్రూ ఫెలోషిప్(1970%-%72) పొందారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో సెక్రటరీగా (1976) ఉన్నారు. 1978 లో పదవీ విరమణ చేసిన తరువాత అతను న్యూఢిల్లీ లోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయానికి వైస్-ఛాన్సలర్ గా 1979 జనవరి 3 నుండి 1980 అక్టోబరు 14 వరకు పనిచేసారు. ఈ అనుభవం తన ప్రజా జీవితానికి పునాదిగా ఆయన అభివర్ణించాడు. తరువాత పదవీ విరమణ నుండి తిరిగి వచ్చి ఇందిరా గాంధీ ప్రభుత్వ కాలంలో 1980 నుండి 84 వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో భారత అంబాసిడర్ గా తన సేవలనందించారు. ఇందిరా గాంధీ అభ్యర్థన మేరకు రాజకీయాలలోనికి ప్రవేశించారు. 1984, 1989, 1991 లలో వరుసగా మూడు సార్లు పాలక్కాడ్ (కేరళ) లోని ఒట్టపాళం నియోజక వర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాజీవ్ గాంధీ కేబినెట్ లో రాష్ట్ర వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. 1985 లో ప్లానింగ్, 1985-86 మధ్య విదేశీ వ్యవహారాలు, 1986-89 మధ్య సైన్సు అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పదవులను స్వీకరించారు.

1992 ఆగస్టు 21 న నారాయణన్ భారత ఉప రాష్ట్రపతిగా ఎన్నియ్యారు. అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నారాయణన్ పేరును మొదటి సారిగా జనతాదళ్ పార్లమెంటరీ పార్టీ నాయకులు, పూర్వపు భారత దేశ ప్రధానమంత్రి వి.పి.సింగ్ ప్రతిపాదించారు. జనతాదళ్ , పార్లమెంటులోని వామపక్ష పార్టీలు ఉమ్మడిగా ఆయనను అభ్యర్థిగా ప్రకటించాయి. తరువాత పి.వి. నరసింహారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి మద్దతు పొందింది. అలా ఆయన ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమమైంది. కె.ఆర్. నారాయణన్ 1997 జూలై 17 న భారత రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. రాష్ట్రపతి ఎన్నికలలో ఆయనకు 95% ఎలక్టోరల్ కాలేజి ఓట్లు వచ్చాయి. కేంద్రంలో మైనారిటీ ప్రభుత్వం ఉన్న సమయంలో జరిగిన ఏకైక అధ్యక్షుని ఎన్నిక ఇది. ఆయనకు టి. ఎన్. శేషన్ ఏకైక ప్రత్యర్థి అభ్యర్థి. శివసేన తప్ప మిగతా ప్రధాన రాజకీయ పక్షాలన్నీ నారాయణన్‌కు ఆ అధ్యక్ష ఎన్నికలలో మద్దతునిచ్చాయి. 1998 సార్వత్రిక ఎన్నికలలో నారాయణన్ రాష్ట్రపతి భవన్ సముదాయంలోని ఒక పాఠశాలలో నిర్వహిస్తున్న పోలింగు బూత్‌లో సామాన్య ఓటర్లతో కలసి వరుసలో నిలబడి ఓటు వేసి పదవిలో ఉండి ఓటు వేసిన మొదటి రాష్ట్రపతిగా గుర్తింపు పొందారు.

అధ్యక్షునిగా నారాయణన్ తన వివేచనా శక్తులను ఉపయోగించి ఆయన తీసుకున్న వివిధ నిర్ణయాలు, ఆలోచనను దేశానికి వివరించే ముఖ్యమైన ఆచరణను ప్రవేశపెట్టారు. ఇది అధ్యక్షుడి పనితీరులో పారదర్శకతకు దారి తీసింది. నారాయణన్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో వివిధ రాజకీయ పార్టీలలో ఎవరికీ సభలో విశ్వాసం పొందవలసిన స్థితి లేదని వారితో సంప్రదింపుల ద్వారా నిర్ణయించు కున్న తరువాత లోక్ సభను రెండు సార్లు రద్దు చేశారు. అధ్యక్షులుగా నారాయణన్ ఒక రాష్ట్రంలో రాజ్యాంగంలోని 356 అధికరణ క్రింద రాష్ట్రపతి పాలనను విధించేందుకు కేంద్ర మంత్రివర్గం చేసిన సిఫారసును పునః పరిశీలించమని రెండు సార్లు కోరారు. గుజ్రాల్ ప్రభుత్వం (1997 అక్టోబరు 22) ఉత్తర ప్రదేశ్ లోని కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్నప్పుడు, అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం (1998 సెప్టెంబరు 25) న బీహార్ లోని రబ్రీదేవి ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్నప్పుడు ఆ విధంగా పునః పరిశీలన కోరారు.

భారత రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తరువాత కె.ఆర్. నారాయణన్ తన భార్య ఉషతో పాటు తన శేష జీవితాన్ని సెంట్రల్ ఢిల్లీ బంగ్లా (34 పృథ్వీ రోడ్) లో గడిపారు. ముంబై (21 జనవరి 2004) లో వరల్డ్ సోషల్ ఫోరమ్ "ప్రత్యామ్నాయ ప్రపంచీ కరణ ఉద్యమానికి" తన మద్దతును అందించారు. ఆయన సిద్ధ, ఆయుర్వేదం కోసం నవజ్యోతిశ్రీ కరుణాకర గురు పరిశోధనా కేంద్రాన్ని స్థాపించడానికి ఉఝావూరు నుండి పోథెన్‌కోడ్ లోని సంతిగిరి ఆశ్రమానికి వెళ్ళారు. కె.ఆర్.నారాయణన్ 2005 నవంబరు 9 న తన 85వ యేట న్యూఢిల్లీ లో మరణించారు. ఆయనకు హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం దహన కార్యక్రమాలను సైనిక లాంఛనాలతో చేసారు. ఇది రాజ్‌ఘాట్ కు సమీపంలోని "కర్మ భూమి" లో జరిగింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

## నేడు కొమురం భీం వర్ధంతి



ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం. గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబు పై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27 న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం.

కొమురం భీం స్ఫూర్తితో...దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు.

జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు.

నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేశారు. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని గిరిపల్లెలు నేటికీ ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది కూడా. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. అలా గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యం. అత్యవసరం.

# జానపద కవిరాజు కొసరాజు

## నేడు కొసరాజు రాఘవయ్య వర్ధంతి

తెలుగు చిత్రసీమలో జానపదం అనగానే ముందుగా గుర్తుకు వచ్చే నటులు నందమూరి తారక రామారావు, దర్శకుడు బి.విఠలాచార్య కాగా, జానపద గీతం అనగానే వెనువెంటనే స్ఫురించే పేరు కొసరాజు రాఘవయ్య చౌదరిదే. కొసరాజు రాఘవయ్య చౌదరి, తెలుగు జానపద సాహిత్యానికి ఎనలేని కీర్తిని తెచ్చిన ప్రముఖ కవి, గీత రచయిత, రచయిత. 'జానపద కవిరాజు'గా, 'కవిరత్న'గా ప్రశంసలందుకున్న ఆయన తెలుగు జానపద సాహిత్యంలో గాథల్ని సృష్టించారు. 1905లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా కర్లపాలెం మండలం, చింతాయపాలెం గ్రామంలో లక్ష్మమ్మ, సుబ్బయ్య దంపతులకు జన్మించిన రాఘవయ్య జీవితమంతా తెలుగు గ్రామీణ జీవనాన్ని తన రచనల్లో ప్రతిబింబించాడు.

తెలుగు జానపద సాహిత్యాన్ని సమున్నతంగా నిలిపిన కొసరాజు రాఘవయ్య, కేవలం పాటల రచయితగానే కాక, పల్లె జీవితం, సంప్రదాయాలు, పండుగలు, వ్యవసాయం వంటి అంశాలను తన గీతాల్లో చక్కగా మేళవించాడు. ఆయన రచనల్లో గ్రామీణ ప్రజల శైలీ, జీవన విధానాలు, పండుగ సంబరాలు, పెళ్లిళ్లు, పల్లె జీవనంలోని ప్రత్యేకతలు స్పష్టంగా ప్రతిఫలిస్తాయి. పాఠకుడు పల్లె జీవితం, పల్లె సౌందర్యాన్ని ఆస్వాదించగలిగేలా తన రచనల ద్వారా ఆయన తెలుగుదనాన్ని పంచాడు. ప్రకృతి, పొలాలు, పక్షులు, చెట్లు, జంతువులు, నదులు వంటి ప్రకృతి అంశాలను



ఆయన తన రచనల్లో అద్భుతంగా మిళితం చేసి, పాఠకులను ప్రేరేపించాడు.

కొసరాజు రాఘవయ్య తన రచనల్లో కుల వివక్ష, అణగారిన వర్గాల సమస్యలు, అవినీతి వంటి సామాజిక సమస్యలను సునిశితంగా ప్రస్తావించారు. పల్లె ప్రజల దుఃఖాలు, అణచివేతలను వ్యక్తం చేస్తూ సమాజంలో మార్పు రావాలనే కృతనిశ్చయంతో తన రచనల్లో సామాజిక సందేశాలను చేర్చారు. మానవ జీవనంలోని ప్రేమ, విరహం, మమత వంటి భావజాలాలను సున్నితంగా, హృద్యంగా, అత్యంత చక్కగా ప్రతిబింబించారు. ఈ పాటలు గాఢమైన భావనలతో పాఠకులను హత్తుకునేలా ఉంటాయి. సాధారణ ప్రజల జీవనంలోని హాస్యాన్ని కూడా ఆయన రచనలు అద్భుతంగా ప్రతిబింబిస్తాయి, పాఠకుడిని అలరిస్తాయి. రాఘవయ్య తొలిసారిగా కథానాయకునిగా 1939లో "రైతుబిడ్డ" చిత్రంలో నటించారు. తరువాత ఆయన కవిత్వ ప్రతిభను గుర్తించిన బి.ఎ. సుబ్బారావు, కె.వి. రెడ్డి వంటి దర్శకులు ఆయన్ని తమ చిత్రాలకు పాటలు రాయించేందుకు ఆహ్వానించారు. 1954లో విడుదలైన "పెద్ద మనుషులు" చిత్రంలో ఆయన రాసిన పాటలు తెలుగు ప్రేక్షకుల మనసులను చూరగొన్నాయి. "రాజు పేద" చిత్రంలో ఆయన రాసిన "జేబులో బొమ్మ జేజేల బొమ్మ" పాట భలే ప్రాచుర్యం పొందింది. అలాగే "రోజులు మారాయి" చిత్రంలోని "ఏరువాక సాగారో," "ఇల్లరికములో ఉన్న మజా," వంటి పాటలు ఆయన ప్రతిభకు నిలువుటద్దంగా నిలిచాయి.

### "జేబులో బొమ్మ జేజేల బొమ్మ",

"ఏరువాక సాగారో", "ఇల్లరికములో ఉన్న మజా", "అయయో జేబులో డబ్బులు పోయెనే", "ముద్దబంతి పూలు బెట్టి", "మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా" మొదలైన గీతాలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలు. కొసరాజు రాసిన పాటలు పల్లె ప్రజల జీవితానికి ప్రతిధ్వనులుగా నిలిచాయి. ఈ గీతాలు మామూలు ప్రజల భావాలను అక్షరాలుగా మార్చాయి. కొసరాజు రాసిన కొన్ని గీతాలు శాశ్వతంగా ప్రజల మనస్సులలో నిలిచిపోయాయి, అవి ప్రతి పల్లె వాసి హృదయాన్నే కాదు, వారి జీవితాలనూ ప్రతిబింబించాయి. "కళ్ళు తెరచికనరా," "జయమ్ము నిశ్చయమ్మురా," "వినరా వినరా నరుడా" వంటి గీతాలు గ్రామీణ ప్రజల మనోభావాలను, వారి ఆశలను ప్రతిబింబించాయి. కొసరాజు రాఘవయ్య 1984లో రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. "కవిరత్న," "జానపద కవిసార్వభౌమ" వంటి బిరుదులతో గౌరవం పొందారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ నిర్వహించిన బుర్రకథల పోటీలో ఆయన రాసిన "నవభారతం" బుర్రకథ ప్రథమ బహుమతిని అందుకుంది. చివరి బుర్రకథగా నిలిచిన "వినరా, ఆంధ్రకు మారా" అనే కృతి 1986 అక్టోబర్ 27న రాశారు. అదే రోజున ఆయన పరమ పదించారు.

కొసరాజు రాఘవయ్య రచనలు తెలుగు సాహిత్యానికి ఒక అమూల్యమైన నిధిగా నిలిచాయి. ఆయన పాటలు, కవితలు తెలుగు ప్రజల మనసులను హత్తుకునేలా ఉంటాయి. పల్లె జీవితం, ప్రకృతి, గ్రామీణ సంస్కృతి, తెలుగు భాషలోని విలువలను ప్రతిబింబిస్తూ పాఠకులను స్ఫూర్తి ప్రదాయకంగా ప్రేరేపించాయి. రాఘవయ్య రాసిన పాటలు, బుర్రకథలు, కవిత్వం తెలుగు జానపద సాహిత్యానికి నిలువుటద్దంగా, నిత్య కీర్తిగా నిలిచిపోయాయి.

# 'చిల్లర' సమస్యను తీర్చే మెషీన్

- ఫోన్‌తో స్కాన్ చేస్తే కాయిన్స్
- కోజీకోడ్‌లోని ఫెడరల్ బ్యాంకులో ప్రారంభం
- దేశంలోనే మొదటి 'క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మెషీన్'




**కోజికోడ్:** దుకాణం లేదా మార్కెట్?కు వెళ్లి ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు కొన్ని సార్లు చిల్లర సమస్య ఏర్పడుతుంది. దురాణదారుడి వద్ద చిల్లర లేకపోతే కష్టమర్లనే తీసుకురావాలని చెబుతుంటాడు. చిల్లర దొరకకపోవడం వల్ల కొన్ని సార్లు వాటిని కొనుగోలు చేయకుండానే తిరిగి రావాల్సి వస్తుంది. ఈ సందర్భం దాదాపు అందరికి ఏదో ఒక సమయంలో ఎదురయ్యే ఉంటుంది. ఇలాంటి చిల్లర సమస్యలను అరికట్టేందుకు దేశంలోనే మొదటి 'క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మెషీన్'ను కేరళలో ప్రారంభించారు. కోజీకోడ్?లోని పుతియారాలోని ఫెడరల్ బ్యాంకులో 'క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మెషీన్' ను ప్రారంభించారు. డబ్బులు విత్ డ్రా చేసుకునేందుకు ఏటీఎంలు ఏవిధంగానైతే ఉన్నాయో, అదే విధంగా కాయిన్స్ తీసుకునేందుకు క్యూఆర్ కోడ్ వెండింగ్ మెషీన్ ఉపయోగపడుతుంది.

### 'క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మెషీన్' అంటే ఏమిటి?

ఇది నగదు రహిత కాయిన్ డెలివరీ సిస్టమ్. ఈ మెషీన్?లో స్క్రీన్ పై కనిపించే క్యూఆర్ కోడ్?ను స్కాన్ చేయడం వల్ల కావాల్సినన్ని నాణేలను తీసుకోవచ్చు. మీ యూపీఐ ద్వారా డబ్బును చెల్లించి నాణేలు పొందవచ్చు. ఈ మెషిన్?లో 1,2,5,10 రూపాయలు అందుబాటులో ఉంటాయి.

మెషీన్లలో స్క్రీన్ పై ఉండే క్యూఆర్ కోడ్?ను స్కాన్ చేయడం ద్వారా కావాల్సిన నాణేలను పొందొచ్చు. యూపీఐ ద్వారా బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును చెల్లించి నాణేలు పొందొచ్చు. నాణేల కొరతను తగ్గించేందుకు ఈ మెషీన్ ఉపయోగపడుతుంది.

### గతంలో కంటే భిన్నం

గతంలోనూ ఇలాంటి మెషీన్లు ఉన్నప్పటికీ, అవి నోట్లను స్వీకరించి మాత్రమే నాణేలను అందించేవి. కానీ క్యూఆర్ కోడ్ ఆధారిత వెండింగ్ మెషిన్?లో యూపీఐ చేసి నాణేలను ఈజీగా పొందొచ్చు. 2023లోనే క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మెషీన్లను తీసుకురావాలని ఆర్?బీఐ నిర్ణయించింది. ఈ క్రమంలో కోజీకోడ్?లోని ఫెడరల్ బ్యాంకులో దేశంలోనే 'క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మెషీన్' ప్రారంభమైంది.

### ఎలా పని చేస్తుందంటే?

ముందుగా క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మెషీన్ వద్దకు వెళ్లి, అక్కడ స్క్రీన్ పై మీకు అవసరమైన చిల్లర మొత్తంపై క్లిక్ చెయ్యండి. మీకు ఏ నాణేం అవసరమో దానిపై క్లిక్ చెయ్యండి. ఈ మెషిన్?లో స్క్రీన్ పై ఉండే క్యూఆర్ కోడ్ మీ యూపీఐతో స్కాన్ చేయండి.ట్రాన్సాక్షన్ పూర్తయిన తర్వాత నాణేలు మెషిన్ నుంచి బయటకు వస్తాయి. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి డిజిటల్ చెల్లింపు యాప్?ల ద్వారా క్యూఆర్ కోడ్ ఆధారిత వెండింగ్ మెషిన్?లో నాణేలను విత్ డ్రా చేసుకోవచ్చు. ఏ బ్యాంకులో అకౌంట్ ఉన్నా ఈ మెషిన్?లో డబ్బులు తీసుకోవచ్చు. భారీ మొత్తంలో చిల్లర కావాలనుకునేవారిపై మాత్రం ఆంక్షలు విధించారు. దుకాణదారులు, బస్సు ప్రయాణికులు, విద్యార్థులు, కార్మికులకు ఈ మెషీన్లు ఎక్కువగా ఉపయోగపడే అవకాశం ఉంది.

# ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు
# ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి

- మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు ద్రోహం చేయొద్దు
- ఈ నెల 29న నల్లగొండలో మాదిగల ధర్మయుద్ధ సదస్సు
- ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్ర స్వామి మాదిగ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలులోకి తీసుకు వచ్చిన తరువాతనే ఉద్యోగాలు భర్తీ చేయలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్ర స్వామి మాదిగ డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు(ఎం) మండలంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నల్ల చంద్ర స్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలబెడతామని ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయడం మాదిగల, ఎస్సీ ఉపకులాలకు ద్రోహం చేయడమేనని, ఎస్సీ రిజర్వేషన్ కేటగిరిలోని టిచర్ పోస్టుల్లో 80% పైగా మాలలకే చెందాయన్నారు. రేవంత్ రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి ఎస్సీ కేటగిరి ఉద్యోగాలన్ని మాలలకు దోచి పెట్టొద్దన్నారు. తక్షణమే ఉద్యోగాల భర్తీ నిలిపివేయాలని అన్నారు. తక్షణమే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని, అప్పటి వరకు ఉద్యోగ నియామకాలన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఉమ్మడి నల్లగొండ మాదిగల ధర్మయుద్ధ సదస్సును 29 న ఉదయం 11 గంటలకు నల్లగొండ లో నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ పాల్గొంటారన్నారు. మాదిగలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు, మండల నాయకులు మందుల లింగ స్వామి మాదిగ, గట్టు రాములు మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలరాజు మాదిగ, మందుల విజయ్ మాదిగ, కాను కంట్ల నవీన్ మాదిగ, వేముల భిక్షపతి మాదిగ, కదిరే సాయి వినయ్ మాదిగ పాల్గొన్నారు.

## పట్టపగలే చైన్ స్నాచింగ్



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్న నగళ్ల తిరుపతమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో పనిచేస్తుండగా ఇంట్లో ఎవరూ లేరని గ్రహించి శనివారం ఉదయం గుర్తుతెలియని ఇద్దరు యువకులు మాయ మాటలతో దాదాపు 30 నిమిషాలు కాలయాపన చేసి వృద్ధురాలు మెడలో నుంచి మూడు తులాల బంగారంతాడు దొంగతనం చేసి పారిపోయినట్టు వృద్ధురాలు తెలిపింది. సంఘటన స్థలాన్ని చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి తెలిపారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ. సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాల గ్రామం నాలుగో వార్డులో రూ.20 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ బరిగెల హేమలత రాజగౌడ్, కౌన్సిలర్లు వై శివకుమార్, అనిత, జయరాజ్, మౌనిక మహేందర్, వెంకటేష్ గౌడ్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

### నాగర్ కర్నూలు పార్లమెంట్ సభ్యుడు
## డా.మల్లు రవికి ఘన స్వాగతం



**విశ్వంభర, ఆమనగల్లు:** కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యుడిగా నాగర్‌కర్నూలు పార్లమెంట్ సభ్యుడు డా.మల్లురవి నియమితులైన సందర్భంగా అచ్చంపేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. వంశి కృష్ణకి ఆమనగల్లు, కడ్తాల్ మండలాల అధ్యక్షులు జగన్, బీచ్యా నాయక్ మాజీ అధ్యక్షుడు మండ్లీ రాములు, యూత్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రిపాతి శ్రీనివాస్ రెడ్డి, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మానయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీఖ్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, గూడూరు భాస్కర్ రెడ్డి, అద్దాల రాములు, రాష్ట్ర సేవాలాల్ సేన కార్యదర్శి లక్కృతి నాయక్ ఖాదర్ పాల్గొన్నారు.

## నేడు ఉచిత మెగా హెల్త్ క్యాంప్

**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల ప్రజలకు గోప్ప సువర్ణ అవకాశం ప్రసిధ్ హాస్పిటల్ వనస్థలిపురం ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ ఆదివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్, సాయిబాబా టెంపుల్ ఎదురుగా ఉ? 8-00 నుంచి మధ్యాహ్నం 1-00 గం వరకు ఉచిత వైద్య శిబిరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని ప్రసిధ్ హాస్పిటల్ చైర్మన్ జూకూరి చైతన్య రాజు తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో అన్ని రకాల ఉచిత హెల్త్ టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరంలో కళ్యాణ లక్ష్మి, సీఎం ఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఇచ్చే లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇవ్వాలని, మహిళలుకు రెండువేలు ఇవ్వాలని, సంపూర్ణ రుణమాఫీ వెంటనే చెయ్యాలని, రైతు భరోసా పదిహేను వేలు ఇవ్వాలని, కౌలు రైతులకు సంవత్సరానికి పన్నెండువేలు ఇవ్వాలని, రైతు కూలీలకు పన్నెండు వేలు ఇవ్వాలన్నారు. అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విధి దీపాల ఏర్పాటు



**విశ్వంభర, పరిగి :** పరిగి మున్సిపల్ మూడవ వార్డు ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి నిధుల ద్వారా మంజూరైన హైమాస్ట్ ప్రాజెక్టర్ లైట్లను ఏర్పాటు చేవారు. దీంతో తమ సమస్య తీరిపోయిందని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడవ వార్డు కాంగ్రెస్ ఇంచార్జ్, పరిగి టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఎజాస్, సీనియర్ నాయకులు నసీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు నాగరాజు, యువ నాయకులు కమ్మరి అనిల్ పాల్గొన్నారు.

## మతిస్థిమితం కోల్పోయిన
## వృద్ధురాలిని చేరదీసిన సఖి సెంటర్



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గిద్ద ముత్తారం గ్రామంలోని బస్సు షెల్టర్‌లో గత పది రోజుల నుంచి ఒక వృద్ధ మహిళ ఉంటుందని ఆ గ్రామానికి చెందిన బైరి కుమార్, హరీష్ గౌడ్ అనే ఇద్దరు వ్యక్తులు మహిళా హెల్ప్ లైన్ 181 కి ఫోన్ చేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి వేళ్లి ఎంక్వైరీ చేయగా వృద్ధ మహిళ మతిస్థిమితం కోల్పోయి ఉందని గమనించి భూపాలపల్లి జిల్లా సఖి సెంటర్‌కి వృద్ధ మహిళని తీసుకు వచ్చి భోజనం పెట్టి, తన ఇంటికి పంపించడం కోసం వివరాలు సేకరిస్తూ ఎంక్వైరి చేస్తున్నామని సెంటర్ అడ్మినిస్ట్రేటర్ గాయత్రి తెలిపారు. మానవ సేవే మాదవ సేవగా ముందుకు వచ్చి వృద్ధ మహిళకు సహాయం చేయడం కోసం మహిళా హెల్ప్ లైన్‌కి కాల్ చేసి సమాచారం అందించిన గిద్దముత్తారంకు చెందిన వ్యక్తులు బైరి కుమార్, హరీష్‌లను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో బాధిత మహిళలు తమ సమస్యల పరిష్కారానికి సఖి సెంటర్ ను ఆశ్రయించాలని, వారు రాలేని పక్షంలో సఖి నెంబర్ 8500009433 కి ఫోన్ చేస్తే తమ సిబ్బంది సఖి సెంటర్ కి తీసుకు వస్తారని, మీ చుట్టుపక్కల ఎవరైనా బాధిత మహిళలు, వృద్ధులు ఉన్నచో వారికి సంబంధించిన సమాచారాన్ని 181 టోల్ ఫ్రీ నెంబర్ కి గాని, లేదా సఖి సెంటర్ నెంబర్ 8500009433 కి గానిఫోన్‌చేసి సమాచారం ఇవ్వవలసిందిగా తెలిపారు. ఈ రెస్క్యూలో మల్టీ పర్పస్ సుమలత, డ్రైవర్ కుమార్ పాల్గొన్నారు.

### రెచ్చిపోతున్న మట్టి మాఫియా
## పట్టించుకోని అధికారులు

**గత 15 రోజుల నుంచి వందల ట్రిప్పుల లారీల మట్టి తరలింపు**

**ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న పట్టించుకోని అధికారులు**



**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం నియోజకవర్గ తుక్కుగూడ మున్సిపల్ రావిరాల నుంచి ఆర్‌సీఐ రోడ్డులో మట్టి మాఫియా రెచ్చిపోయి గత 15 రోజుల నుంచి వందల ట్రిప్పుల లారీల మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చిన మహేశ్వరం ఎమ్మార్వో స్పందించి ఆర్ఐ వచ్చి పరిశీలించి వెళ్లారు. వారు పోలీసులకునిగా పెట్టాలని సూచించారు. కానీ ఇంతవరకు మట్టి మాఫియాని పట్టుకోలేక పోయారు. ఆ రోడ్డులో సీసీ కెమెరాలు ఉన్నాయి అలాగే రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ వెహికల్ తిరుగుతూ ఉంటుంది మరి పోలీసులకు కనిపించడం లేదా లారీలు అర్ధరాత్రి పూట యథేచ్ఛగా తిరుగుతున్నాయి. మరి ఎందుకు మట్టి మాఫియా ఎవరికీ దొరకడం లేదు చూసి చూడనట్టు పోలీసులు అధికారులు వ్యవరిస్తున్నారా.. భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈసమస్యను పరిష్కారం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## అంగన్‌వాడి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి తన ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని గణపురం మండల పరిధిలోని గాంధీ నగర్ గ్రామంలో రూ.20 లక్షలతో మోడల్ అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వహిస్తున్న పౌష్టికారాన్ని వినియోగించుకోవాలని అన్నారు. మహిళలు చైతన్యవంతులైతే ఆ ప్రాంతం నియోజవర్గం రాష్ట్రం దేశం అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకే నియోజవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఓసీ మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబు



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గంలోని మల్హర్ రావు మండలం గాదంపల్లికి చెందిన నల్ల మహేందర్‌కి రూ.2,50,000 ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. మంథని నియోజకవర్గంలోని మల్హర్ రావు మండలం గాదంపల్లికి చెందిన నల్ల మహేందర్ కిడ్నీ సంబంధించిన సమస్యకి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రికి తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం LOC మంజూరు చేయించి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబుకి బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## కాళేశ్వరంలో హైకోర్టు జడ్జి పూజలు



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్ కుటుంబ సభ్యులతో భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఆలయ రాజగోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి అభిషేకం చేసి శుభానంద అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అమ్మవారి ఆలయంలో జడ్జి దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ శేష వస్త్రములతో సన్మానించగా అర్చక స్వాములు, వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్, కాటారం డీఎస్పీ, మహాదేవపూర్ సీఐ, కాళేశ్వరం ఎస్సైలు, మహదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, వివిధ జిల్లా కోర్టు జడ్జిలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## హైడ్రాపై ప్రతిపక్షాల మాటలు సరికాదు

**విశ్వంభర, భూపాలపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హైడ్రాను ప్రతిపక్షాలు అడ్డుకోవడం సరికాదని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య డీకే పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అధికారులను అడ్డం పెట్టుకొని ఇష్టానుసారంగా ఎన్‌టీపీఎల్, బఫర్ జోన్, మూసి పర్యావహరణ ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టారని అన్నారు. మూసిని సుందరీకరణ చేసి సాగునీరు, తాగునీరు అందించేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలబడుతుందని మూసి పరివాహక ప్రాంత ప్రజలకు తగిన న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. హైడ్రా పై తప్పుడు ప్రచారం చేస్తున్న నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు
### వివేక విద్యాభారతి విద్యార్థుల ఎంపిక



**విశ్వంభర, ఆమనగల్లు :** జాతీయ స్కూల్ గేమ్స్ సమాఖ్య ఎస్‌జీఎఫ్, 68వ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఈనెల శుక్రవారం 25వ తేదీన వికారాబాద్ జిల్లాలో 3 జిల్లాల విజేతలకు రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ వాలీబాల్ పోటీలు సెలక్షన్స్ నిర్వహించారు. ఈ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రానున్న నవంబర్ నెలలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక చేశారు. ఇందులో ఆమనగల్లు పట్టణానికి చెందిన వివేక విద్య భారతి హైస్కూల్ కి చెందిన రీనాలీసా, తపస్య అనే విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికైనందున పాఠశాల ప్రిన్సిపాల్ మహామాద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, పీఈటీ శంకర్, అంజు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వారిని శాలువాతో సన్మానించి ప్రశంసించారు.

## స్టాఫ్‌నర్స్, మెడికల్ ఆఫీసర్ల ఎంపిక

**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ ( ఎన్ హెచ్ ఎం ) పథకంలో భాగంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో తేదీ :02-03-2024, పత్రికా ప్రకటన ద్వారా ఎంఎల్‌హెచ్‌పీ, స్టాఫ్ నర్స్, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్లు తదితర (37) పోస్టులకు పత్రికా ప్రకటన ఇచ్చి దరఖాస్తులు తీసుకోవడం జరిగింది. అట్టి పోస్టులకు తేదీ సోమవారం ఫైనల్ మెరిట్ జాబితాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో, వెబ్ సైట్ (mahabubabad.telangana.gov.in) లో కూడా పొందపరచబడునని, తేదీ:06-11-2024 రోజున 1 :3 నిష్పత్తి (రూల్ ఆఫ్ రిజర్వేషన్) ప్రకారం అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన చేయబడునని, మరుసటి రోజు తేదీ:07-11-2024 రోజున కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించబడునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా ఏబీవీపీ మహాదేవపూర్ నగర కార్యదర్శి పేట సాయి విలేఖరులతో మాట్లాడుతూ వెంటనే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయాలన్నారు. సంవత్సరాల తరబడి ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయని కారణంగా దాదాపు రూ.7,500 కోట్లకు పైగా పెండింగ్లో ఉన్నాయని, నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావొస్తున్న పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారారని మండిపడ్డారు. రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. రాజేష్, అజయ్, అరుణ్, ప్రకాష్, పాల్గొన్నారు.

## కార్తీక మాసంలో లక్షపత్రి పూజలు

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరంలో నవంబర్ రెండవ తేదీ నుంచి డిసెంబర్ ఒకటవ తేదీ వరకు కార్తీక మాసం సందర్భంగా లక్ష పత్రి పూజలు నిర్వహించ బడునని ఆలయ కార్య నిర్వహణ అధికారి మారుతి ప్రకటనలో తెలిపారు. వివరాలకు నెంబర్ 8008696869 సంప్రదించాలని కోరారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష అందజేత



**విశ్వంభర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండల కేంద్రంలో సీసీ కెమెరాలు లేక ప్రజలు తీవ ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ సార్‌కి లక్ష రూపాయలు సీసీ కెమెరాల ఏర్పాటుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కండె జగదీశ్వర్, తలకొండపల్లి మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, పెరుమళ్ల ఆంజనేయులు, సింగిల్ విండో డైరెక్టర్సపోతుగంటి యాదయ్య, కటికల శేఖర్, మాజీ ఎంపీటీసీ జంగయ్య, చలిచీమల మల్లేష్, పోతుగంటి మల్లేష్, పేరుమళ్ల శీను, పొన్నగంటి రవికుమార్, పోతుగంటి వెంకటయ్య, కటికల పాండు, కటికేల మధు, రొయ్యల యాదయ్య, ఇట మోని సత్తయ్య, బొజ్జం మల్లేష్, బొజ్జం మహేష్, శ్రీరాములు, నరసింహ, మహేష్, ప్రశాంత్, వెంకటేష్, డాక్టర్ రవి, దీప్లా, కర్ణ, పీ రవి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి నియోజకవర్గం కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన బండి అలేఖ్యకు రూ. 1.6 లక్షలు, మొగుళ్లపల్లి మండలం అంకుషాపూర్ గ్రామానికి కొడగాని భీమన్నకు రూ.75 వేలు విలువైన ఎల్వోసీని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అందజేశారు. శనివారం గణపురం మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే జీఎస్సార్ సీతారాంపూర్ గ్రామంలో బాధిత కుటుంబాలకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ఎల్వోసీ చెక్కులు ప్రాణదానం చేస్తున్నాయని అన్నారు. కష్టకాలంలో ఆదుకుంటూ దరఖాస్తు చేసుకున్న కొద్దిగంటల్లోనే ఎల్వోసీతో చికిత్స సహాయం పొందుతున్నారని ఎమ్మెల్యే అన్నారు.

## ప్రగతి నగర్ వాసుల నిరసన



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ ప్రగతి నగర్‌లో ఘాటైన వాసనలు వస్తున్నాయని గత నాలుగు రోజులుగా ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ప్రగతి నగర్ వాసులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు శుక్రవారం రాత్రి వచ్చి చెక్ చేసి మనుషులు చచ్చే అంత లేదంటూ వెళ్ళారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కెమికల్ కంపెనీలను ఆలీఫ్ నుంచి తొలగించాలని డిమాండ్ చేసారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం ఆగదన్నారు. మూడు సంవత్సరాల నుంచి సమస్య ఉన్న పట్టని పొల్యూషన్ బోర్డు అధికారులు ఇకనైనా స్పందించి తమ సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ అపార్ట్మెంట్ వాసులు పాల్గొన్నారు.

# మండల ఏర్పాటు కోసం ఏకమైన ఉద్యమకారులు, సామాజికవేత్తలు

- ఆత్మకూర్ (ఎస్) మండల అభివృద్ధి సాధన లక్ష్యంగా జేఏసీ ఆవిర్భావం
- మండలంలోని ప్రజలకు విద్య, వైద్యం, న్యాయ సలహాలు అందించేలా కృషి
- జేఏసీ అధ్యక్షుడిగా భూపతి రాములు ఏకగ్రీవ ఎన్నిక



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండలం అభివృద్ధి, ఆ ప్రాంత ప్రజలకు సరైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా జాయంట్ యాక్షన్ కమిటీ ఏర్పడింది. శనివారం మండలంలోని నెమ్మికల్లు పూర్ణిమ ఫంక్షన్ హాల్లో సమావేశమైన సామాజికవేత్తలు జేఏసీని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్టు, రాష్ట్ర ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహిత భూపతి రాములు మాట్లాడారు. జేఏసీ ఈ ప్రాంత సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. ప్రజల తరపున గళం వినిపించే దిశగా జేఏసీ పని చేస్తుందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సరైన విద్య, వైద్యం, రక్షణ పొందే విధంగా పాటుపడుతుందన్నారు. మండల వ్యాప్తంగా ప్రతిభావంతులను గుర్తించి జేఏసీ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రతి సామాన్య పౌరుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఫలాలు అందేలా పోరాటం చేస్తుందని వివరించారు. బెల్టు షాపులు, బహిరంగ మద్యపాన నిషేధం అమలుకు పాటుపడుతుందన్నారు. జేఏసీ చేపట్టిన ప్రజా సంక్షేమ, సామాజిక కార్యక్రమాలకు అన్ని పార్టీలు, ఉద్యమ సంఘాలు, స్వచ్ఛంద సంఘాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఏకగ్రీవంగా ఎన్నికైన జేఏసీ కమిటీ.. జేఏసీ మండలాధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు భూపతి రాములు, గౌరవ సలహాదారు, లీగల్ అడ్వైజర్గా న్యాయవాది దండ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహకులుగా గంపల కృపాకర్, ప్రధాన కార్యదర్శిగా దొంతగాని కరుణాకర్, కోశాధికారిగా మేడి కృష్ణ, సంస్కృతిక కార్యదర్శిగా గుండు వెంకన్న, అధికారిక స్పోక్ పర్సన్స్ భారీ అశోక్, పందిరి మాధవరెడ్డి, తగుళ్ల జనార్ధన్ యాదవ్, నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫయాజ్, కిరణ్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫ్రెషర్స్ డే



**విశ్వంభర, మహబూబాబాద్:** పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్లో శ్రీ చైతన్య ఒకేషనల్ జూనియర్ కళాశాల ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు సెకండరీ విద్యార్థులు ప్రిన్సిపాల్ పుల్లారావు అధ్యక్షతన ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్ జిల్లా విద్య శాఖ అధికారి సీహెచ్ మదర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసి నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ మోజెస్, ప్రిన్సిపాల్ పుల్లారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికుల నూతన జేఏసీ ఏర్పాటు



**విశ్వంభర, కరీంనగర్ :** తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ సమావేశం శనివారం కరీంనగర్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వెన్షన్ జేఏసీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆర్టిజన్ కన్వర్షన్ కొరకు కరీంనగర్ జిల్లా పరిధిలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ఏర్పాటు చేశారు. కమిటీలో కరీంనగర్ జిల్లా చైర్మన్ గుగులోతు శివ కృష్ణ, కన్వీనర్ ఏ జీవన్, కో చైర్మన్ కే శివ, పి సంతోష్, కో కన్వీనర్ మద్దెల శ్రీనివాస్, పి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎండీ. అమానుల్లా, సోషల్ మీడియా కే శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలను ఎన్నుకున్నారు.

## 31న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



**విశ్వంభర, షాద్నగర్:** నియోజకవర్గంలోని చౌదర్ గూడా మండల కేంద్రంలో ఆర్య సమాజం దగ్గర ఏఐటీయూసీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31న బాంబే నగరంలో ఏఐటీయూసీ ఆవిర్భావం జరిగిందని నాటి నుంచి అనేక రకాల పోరాటాలు నిర్వహించిందని వారు తెలియజేశారు. బ్రిటిష్ పాలనలో అనేక సంఘాలను నెలకొల్పి దేశస్వతంత్ర్యం కోసం పోరాడింది ఏఐటీయూసీ అని అన్నారు. కనీస వేతనం కోసం ఎనిమిది గంటల పరిధినం కోసం పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఏఐటీయూసీకి ఉందన్నారు. పాలక ప్రభుత్వాలు కార్మికుల పట్ల కర్షకంగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను అన్ని మార్చేసి కార్మికులకు హక్కులు లేకుండా చేసిందని దీనికి వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. అక్టోబర్ 31న చౌదర్ గూడా మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జీ వెంకటేష్, మండలాధ్యక్షుడు చిన్నయ్య, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్ష కార్యదర్శులు రమేష్ విదేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం కృష్ణ, ఎలక్ట్రిషన్ యూనియన్ నాయకుడు షబ్బీర్, నాయకులు గోపాల్, శంకర్, జానయ్య, పాండు, చెన్నయ్య, జంగమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సాకారమైన రైతుల కలలు



**విశ్వంభర, నార్కట్పల్లి:** నకిరేకల్ రైతుల సాగు నీటికి ఆధారమైన నార్కట్పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టుకు గత రెండు రోజుల నుంచి పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తున్న సందర్భంగా శుక్రవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి జల హారతినిచ్చారు. రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దాదాపు లక్ష ఎకరాలకు సాగునీటిని అందించే ప్రాజెక్టుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డిలకు నకిరేకల్ నియోజకవర్గ రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# గైనకాలజీ రాష్ట్ర సదస్సులో పాల్గొన్న ఎంపీ కావ్య



**విశ్వంభర, వరంగల్ :** వరంగల్ వేదికగా మడికొండలోని రెడ్డి కన్వెన్షన్లో జరిగిన అబస్ట్రేట్రిక్స్, గైనకాలజీ తెలంగాణ చాప్టర్ 7వ వార్షిక రాష్ట్ర సదస్సులో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2వేల మంది గైనకాలజిస్టులు హాజరైన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రధానంగా గైనకాలంజస్టులు మహిళలు కాబట్టి మహిళల మానసిక, ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. మహిళలకు వివిధ దశలలో వచ్చే అనారోగ్య సమస్యలను వారికి అర్థం అయ్యే విధంగా వివరించాలన్నారు. కౌమార దశ నుంచి గర్భిణీలు, మోనోపాజ్, క్యాన్సర్, వయో వృద్దులు ఎదుర్కొనే సమస్యల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. కోవిడ్ తర్వాత డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలతో సతమతమౌతున్నారని కావున మానసిక సమస్యలు, మెంటల్ హెల్త్ పై కూడా దృష్టి సారించాలని వివరించారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి రీసెర్చ్ మరియు పరిశోధనలు చేయడానికి అధిక నిధులు కేటాయించే విధంగా కృషి చేస్తానన్నారు. ఆధునిక శస్త్ర చికిత్సలు, వ్యాధులపై పరిశోధనలు జరిపే విధంగా కూడా తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. మహిళా సాధికారత అంటే కేవలం ఆర్థికంగానే కాకుండా ఆరోగ్యంగా కూడా బలంగా ఉన్నప్పుడే నిజమైన సాధికారత సాధించినట్లు అవుతుందన్నారు. కాళోజి హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కర్ణాకర్ రెడ్డి, డాక్టర్ శాంత కుమారి, డాక్టర్ జామున దేవి, డాక్టర్ నరసింహ రెడ్డి, డాక్టర్ సంధ్యా రాణి, డాక్టర్ మధు చంద్ర, ఇతర గైనకాలంజస్టులు పాల్గొన్నారు.

## రెవెన్యూ మంత్రికి వినతి పత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** నియోజకవర్గంలో భూ రిజిస్ట్రేషన్ సమస్యలకు పరిష్కారం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సమావేశం అయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో కొన్ని కాలనీల్లో వక్ఫ్ బోర్డ్ స్థలాల నెపం చూపిస్తూ.. సర్వేనెంబర్ 58 నుంచి 226 వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకుండా సబ్ రిజిస్ట్రార్ నిలిపివేయడంతో, దానిని పునరుద్ధరించాలని కోరుతూ శనివారం మినిస్టర్ క్వార్టర్స్ లో రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కూన శ్రీశైలం గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యపై స్పందించిన మంత్రి యథాతతంగా రిజిస్ట్రేషన్లు అయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీశైలం గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, అప్పారావు, వెంకటరమణయ్య, ఓబుల్ రెడ్డి, సత్యం, హర్షారెడ్డి, రాజేష్, రాజీవ్ పాల్గొన్నారు.

# కొడంగల్లోనే కాంగ్రెస్ సర్కారుపై తిరుగుబాటు మొదలైంది : కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** కొడంగల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ దయాకర్ రెడ్డితోపాటు.. బీఎస్పీ తరపున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన నర్మద శనివారం నందినగర్ లోని కేటీఆర్ నివాసంలో ఆయన సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. వారితోపాటు కొడంగల్ నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన దాదాపు వంద మంది బీఆర్ఎస్లో చేరారు. వారందరికీ కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్లోనే కాంగ్రెస్ సర్కారుపై తిరుగుబాటు మొదలైందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా సిటీని తీవ్రంగా వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కొడంగల్ లోనే ఫార్మా కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేయడంతో స్థానిక ప్రజలు తరిమికొట్టే పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. పాలూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా కొడంగల్ నియోజకవర్గాన్ని తక్కువ ఖర్చుతో సస్యశ్యామలం చేసే ప్రణాళికలు పక్కనపెట్టి, కేవలం కమీషన్ల కోసం కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టారని మండిపడ్డారు. మొన్నటిదాకా రేవంత్ రెడ్డి తిట్టిపోసిన మెగా ఇంజనీరింగ్ కంపెనీకి, మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కంపెనీకి కాంట్రాక్టు కట్టబెట్టడం వెనక ఉన్న మతలబు ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అనేక వర్గాల ధర్నాలు, రాస్తా రోకోలతో తెలంగాణ అట్టడుకుతుంటే... మంత్రులు విహార యాత్రల్లో ఎంజాయ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని స్పష్టంచేశారు.

## మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల చేయూత



**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామంలో పోలే లక్ష్మయ్య భార్య పోలే లక్ష్మమ్మ శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మండల బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు పోలే అశోక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతి దేహానికి పూలమాలతో నివాళులర్పించి మృతురాలు కుటుంబ సభ్యులకు 3వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. పోలే అశోక్ వెంట జంగయ్య, రమేష్ కుమార్, చిన్న సైదులు, అంజయ్య, కృష్ణయ్య, రవి, వసంత్ ఉన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** వరి ధాన్యం ఉత్పత్తి ఆధారంగా అవసరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం సాయంత్రం భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్లోని ఐడీవోసీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. ఈ వానాకాలం వరి ధాన్యం కొనుగోలు చేయుటకు మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్ – ఏ రకానికి రూ. 2320, సాధారణ రకానికి రూ. 2300 ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ప్రతీ క్వింటాలుకు అదనంగా రూ. 500 చెల్లిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనాథ్, జిల్లా మేనేజర్ రాములు, డీసీవో వాల్యా నాయక్, ఇంచార్జ్ డీఆర్డీఓ అవినాష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, డీఎంవో కనకశేఖర్, అన్ని మండలాల పీఏసీఎస్ చైర్మన్లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు, మండల అగ్రికల్చర్ అధికారులు, ధాన్యం సప్లై చేసే కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బంది



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ చిత్రా లేఔట్ కాలనీలో గత వారం రోజులుగా విద్యుత్ శాఖ కొట్టివేసిన చెట్లకొమ్మలు తీసి వేయడంలో జీహెచ్ఎంసీ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీవాసులు మండి పడుతున్నారు. పాదచారుల బాట మీద, సెంట్రల్ డివైడర్ మీద కొమ్మలు వేయడంతో నివాసితులకు ఇబ్బందిగా మారాయని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని వెంటనే అధికారులు చెట్ల కొమ్మలను తీసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

## బాత్రూం నిర్మాణం చేయించిన ఉప్పల ట్రస్ట్



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండ పల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలో అంగన్వాడీ పాఠశాలలో బాత్రూం లేక పిల్లలు ఇబ్బంది పడు తుండడం చూసిన మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, ఉప్పల చారిట బుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా బాత్రూం కట్టించాలని కోరగా వెంటనే స్పందించిన వెంకటేష్ బాత్రూంలను కొత్తగా ఏర్పాటు చేయించారు. ఇందుకు సహకరించిన వెంకటేష్కి, ఎంపీపీకి, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్కి అంగన్వాడీ టీచర్ గిరిజ, విద్యార్థుల తల్లి తండ్రులు, గ్రామ ప్రజలు, కృతజ్ఞతలు తెలియజేసారు.

## బాక్స్ డ్రైన్స్ నిర్మాణంతో సమస్యలకు చెక్

### ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** బాక్స్ డ్రైన్ నిర్మాణాలతో వరద నీటి సమస్యకు పరిష్కారం దొరికినట్టు అవుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం క్యాంపు కార్యాలయంలో శనివారం డివిజన్ రెడ్డి బ్రదర్స్ చుట్టుప్రక్కల ప్రజలు, వివేకానంద నగర్ చుట్టుపక్కల ప్రజలు ఎమ్మెల్యేను కలిశారు. సరూర్ నగర్ చెరువు నుంచి వచ్చే వరదనీరు పోవడానికి నూతన బాక్స్ డ్రైన్స్ నిర్మాణం డివిజన్ పరిధిలో మరొక చోటకు తరలిస్తే ఆయా కాలనీవారికి ప్రయోజనం ఉంటుంది అని వారు సుధీర్ రెడ్డిని కోరారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. మీరు కోరిన విధంగా గడ్డిఅన్నారం డివిజన్ నందు అవసరం ఉన్న ప్రదేశంలో నూతన బాక్స్ డ్రైన్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, రమేష్,రమణరెడ్డి, యాదాశంకర్, దేవేందర్ రెడ్డి, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## మలబార్ షోరూంలో బ్రైడల్ జ్యువెలరీ షో



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వనస్థలిపురం షోరూంలో బ్రైడల్ జ్యువెలరీ షోను శుక్రవారం ప్రారంభించారు. ఈ షోను నవంబర్ 3వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యాజమాన్యం సభ్యులు మాట్లాడుతూ.. ఈ షో ఇతివృత్తం ద్వారా బిన్న ప్రాంతాలు, విభిన్న సంస్కృతులకు ప్రతిబింబించేలా ఆభరణాలను ప్రదర్శింపజేస్తున్నట్టు తెలిపారు. కొత్త పెళ్ళికూతురి అందచందాల నుంచి పొందిన ప్రేరణతో విస్మయపరిచే ఆభరణాల సేకరణలను ఈ ప్రచారంలో భాగంగా దర్శిస్తోంది మలబార్ గోల్డ్, డైమండ్స్ అని స్టోర్ హెడ్ ఇషాక్ తెలిపారు.

## తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు బద్దం జంగయ్య (48) రోజువారీగా వృత్తిరీత్యా తాటి చెట్టు ఎక్కుతుండగా మోపు జారీ కింద పడ్డా డు. కుటుంబ సభ్యులు వెంటనే చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స ప్రస్తుతం హైదరాబాదులోని ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయాలతో బాధపడుతున్న గీత కార్మికున్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.



నార్కెట్పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం. – విశ్వంభర, నార్కెట్ పల్లి

## అరవింద్ కేజ్రీవాల్ను చంపేందుకు బీజేపీ కుట్ర.. ఆప్ కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ ఆరోపణ




**విశ్వంభర, బషీర్ బాగ్ :** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ను చంపేందుకు బీజేపీ లోతైన కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే అయనపై బీజేపీ యువమోర్చ గుండాలతో దాడి చేయించిందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్పై దాడిని నిరసిస్తూ ట్యాంక్ బండ్, అంబెద్కర్ విగ్రహం వద్ద శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఆప్ కార్యకర్తలు జెండాలు, ప్లకార్డులు చేతబూని అరవింద్ కేజ్రీవాల్పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, బీజేపీకి వ్యతరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. ద్వేషం, శత్రుత్వం, హింసతో కూడిన రాజకీయాలు బీజేపీ చేస్తుందని మండిపడ్డారు. ఢిల్లీ వికాస్పురిలో శాంతియుతంగా పాదయాత్ర నిర్వహిస్తున్న అరవింద్ కేజ్రీవాల్ పై బీజేపీకి చెందిన బీజేవైఎం గుండాలు పోలీసుల సమక్షంలోనే దాడి చేయడం హేయమన్నారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, ఎంఏ మజీద్, సోలొమన్ రాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, నర్సింగ్ యమునా గౌడ్, అధికార ప్రతినిధులు జావీద్ షరీఫ్, అఫ్స సలాం, కాలిం బాబా, నేతలు శివాజీ, కొడంగల్ శ్రీనివాస్, ఇస్మాయిల్, రాకేష్ సింగ్, సుధారాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలి

## ఎమ్మెల్యే వేముల వీరేశం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని రామన్నపేట పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులతో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లను కలిసిన నకిరేకల్ శాసన సభ్యుడు వేముల వీరేశం, రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల మధ్యన ఏర్పాటుకు తలపెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ కొరకు ఈ నెల 23న జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణను రామన్నపేట ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. ఆ సమావేశంలో అక్కడ జాయింట్ కలెక్టర్, కాలుష్య బోర్డు వాళ్ళు తీసుకున్న ప్రజల అభిప్రాయాలకు సంబంధించిన ప్రతులను ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ప్రజలకు హాని కలిగించే సిమెంట్ పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదన్నారు. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల రైతులతో పాటు గొర్ల కాపరులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, మత్స్య కారులు, వివిధ వృత్తిదారులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. సిమెంట్ కంపెనీ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతంలో రైతుల చిరకాల స్వప్నం ధర్మారెడ్డి కాలువ పోతుందని, దీంతో సాగులోని భూములు బీడు భూములుగా మారే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేక అశోక్ రెడ్డి, జినుకల ప్రభాకర్, కన్వీనర్ జిల్లాల పెంటయ్య, కో-కన్వీనర్ మహ్మద్ రేహాన్, పల్లపు దుర్గయ్య, ఉట్కూరి నరసింహ, ఫజల్ బేగ్, పూస బాల కిషన్, జమీరుద్దీన్, ఎండి అక్రం, కందుల హనుమంత్, పిట్టల రామ్ రెడ్డి, సుక్క శ్రవణ్ కుమార్, బోయిని ఆనంద్, గురుకు శివ, జవ్వాజి శ్రీకాంత్, రవీందర్ పాల్గొన్నారు.

## కమలా హారిస్ ప్రచారానికి రిపబ్లికన్ల అంతరాయం

### ఆమె ర్యాలీకి పలు ఇబ్బందులు

**వాషింగ్టన్:** త్వరలో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. దీంతో డెమోక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ అభ్యర్థి, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోటీగా ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రజల మద్దతు కూడగట్టుకోవడానికి ముమ్మరంగా పావులు కదుపుతున్నారు. కాగా తాజాగా టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో హారిస్ పాల్గొన్నారు. హ్యూస్టన్‌లో రిపబ్లికన్లు అధికంగా ఉండటంతో ఈమె ర్యాలీకి పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రజలనుద్దేశించి హారిస్ ప్రసంగిస్తున్న సమయంలో ట్రంప్ మద్దతుదారులు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనలు సృష్టించారు. వారి చర్యలతో ర్యాలీకి అంతరాయం కలిగించడంతో ఆమె ఆగ్రహానికి గురయ్యారు. "వీరందరినీ వీధుల్లో నిర్వహించే చిన్న చిన్న ర్యాలీలకు పంపండి. అది వారికి సరదాగా ఉంటుంది.

## కోరుట్ల ఎమ్మెల్యేకు సన్మానం



విశ్వంభర, డెస్క్ : జగ్గాసాగర్ గ్రామంలోని కొండస్వామి దేవస్థానం ఆవరణలో రైతు పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్య కొనుగోలు కేంద్రం ప్రారంభానికి కృషి చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్‌ని జగ్గాసాగర్ గ్రామ రైతుల పక్షాన జగ్గాసాగర్ మార్కెట్ కమిటీ సభ్యులు, రైతు ట్రాన్స్‌ఫార్మర్ కమిటీ సభ్యులు కలిసి శాలువతో సత్కరించి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, మాక్స్ కమిటీ చైర్మన్ డబ్బ రాజారెడ్డి, కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బురిడీ బాబాను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని సింగారం గ్రామం మధిర శేరు బావి దగ్గర శుక్రవారం సత్తిరెడ్డి ఇంటికి బాబా వేషధారణలో వచ్చి బాగుచేస్తానని 38 వేల 500 రూపాయలు నమ్మించి మోసగించిన కేసులో నిందితుడు షేక్ సత్తార్ మియా తండ్రి జానీమియా వయస్సు 56 సంవత్సరాలు గ్రామం తోపుచర్ల మండలం మాడ్గులపల్లి జిల్లా నల్లగొండ. శేరుబావీ సత్తిరెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నకిలీ బాబాను ఆత్మకూరు(ఎం) మండల పోలీసులు చాకచక్యంగా 15 గంటల్లో పట్టుకుని పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా సీఐ సోలోమన్ రాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నకిలీ బాబాల రూపంలో ఎవరైనా గ్రామంలో సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. అపరిచిత వ్యక్తులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పండుగలకు, ఫంక్షన్ లకి వేరే ఊరూ వెళ్లిన ఇంటికి తాళాలు వేసుకొని పక్కింటి వారికి ఎదురు ఇంటి వారికి చెప్పి వెళ్లాలని అప్పుడప్పుడు వారు ఇంటిని గమనిస్తూ వుంటారు. అవకాశం ఉంటే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ఎవరి మీద అయిన అనుమానం వచ్చిన వెంటనే100 కి డయల్ చేయాలని లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఎస్ కృష్ణయ్య , ఏఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబాలకు బాసటగా భద్రత స్కీమ్



**విశ్వంభర, సూర్యాపేట:** అర్మ్‌డ్ రిజర్వ్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ కోటేశ్వరరావు ఆకాలంగా మరణించాడు. బాధిత కుటుంబ సభ్యులకు పోలీసు భద్రత స్కీమ్ ద్వారా 8 లక్షల రూపాయల చెక్కును శనివారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ ఐపీఎస్ జిల్లాపోలీసు కార్యా లయంలో అందించారు. ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసుశాఖ కృషి చేస్తుంది. భద్రత పథకం సిబ్బంది కుటుంబాలకు బాస టగా ఉందన్నారు. నందు అధనపు ఎస్పీ నాగేశ్వర రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘ వులు, పోలీసు సమంఘం సభ్యులు వెంకన్న, సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్టాఫీస్‌లో పొదుపు డబ్బును స్వాహా చేసిన పోస్ట్‌మాస్టర్



**విశ్వంభర, భూపాలపల్లి:** కాయ కష్టం చేసుకునే మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు తమ పిల్లల చదువుల కోసం, పెళ్లిళ్ల కోసం రూపాయి రూపాయి జమ చేసుకుని పోస్టాఫీసులో పొదుపు చేసుకుంటే బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ నకిలీ పాసు పుస్తకాలతో లక్షల్లో మోసానికి పాల్పడి పేదప్రజలను మోసం చేవాడు. నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేసి పొదుపు ఖాతాల్లోని డబ్బు స్వాహా చేసిన సంఘటన పెద్దపల్లి జిల్లా బేగంపేటలో జరిగింది. కాగా బేగంపేట పోస్టాఫీస్ ఎదుట ఖాతాదారులు తమ పాసు పుస్తకాలతో తమ డబ్బులు తమకు ఇప్పించాలంటూ డిపాజిటర్లు ఆందోళన చేపట్టారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు పేరుతో పల్లెల్లో తపాల శాఖ లావాదేవీలు జరుపుతోంది. బ్యాంకుల మాదిరిగా అన్ని నగదు లావాదేవీలు చేపడు తోంది. ఈ వ్యవహారంపై పర్యవేక్షణ, జవాబుదారీ తనం లేక రామగిరి మండ లం బేగంపేట పోస్టాఫీసులో బ్రాంచ్ పోస్టుమాస్టర్ హేమ చేతి వాటం ప్రదర్శించింది. ఈ పోస్టాఫీసు పరిధిలో దాదాపు సుమారు 400 మంది ఖాతాదారుల నుంచి సుమారు కోటి రూపాయలు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ కాజేసినట్లు సమాచారం. డిపాజిట్లు, రికవరింగ్ డిపాజిట్ నగదును నకిలీ పాసుపుస్తకాలతో పక్కదారి పట్టించింది. బేగంపేట బ్రాంచ్ పోస్టో మాస్టర్‌గా విధులు నిర్వహి స్తున్నహేమ ఖాతాలు తెరిచేందుకు వచ్చిన నిరక్షరాస్యులను గుర్తించి, వారికి నకిలీ పాస్ పుస్తకాలు అంటగట్టింది. వారి ఖాతాల్లో జమచేసిన నగదును తన సొంత అవసరాలకు వినియోగిం చుకున్నారని, ఖాతాదా రులు ఆరోపించారు. ఇటీవల బదిలీపై వచ్చిన సబ్ పోస్ట్ మాస్టర్ శివ కూమార్ పలు ఖాతాలపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా ఆమె చేసిన మోసం బయట పడింది. దీంతో కొంతమంది ఖాతాదారులను పిలిపించి వారి పాసుపుస్తకాలు పరిశీలించగా అవి నకిలీవిగా తేలింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలపడంతో తపాలాశాఖ ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. కాగా తాను చేసిన తప్పును క్షమించాలని.. ఒక నెల సమయమిస్తే అందరి డబ్బులు తిరిగి చెల్లిస్తానని ఖాతాదారులను మోసం చేసిన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ హేమ తెలిపింది.

## ఇండస్ యూనివర్సల్ స్కూల్‌లో యూరేకా 2024



**విశ్వంభర,సైనిక్‌పురి:** సైనిక్‌పురిలోని ఇండస్ యూనివర్సల్ స్కూల్, విద్యార్థుల సృజనాత్మకతను, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి నిర్వహించిన యురేఖ 2024 కార్యక్రమం ఘనంగా జరిగింది. స్కూల్ బృందం, ఆర్థిక పరిపాలనా విభాగం అధిపతి ఇ.కిషన్, ప్రిన్సిపాల్ కేవీ నీలిమ నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తెచ్చి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య బలమైన సంబంధాలను ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి టీ అమర్నాథ్ గౌడ్ హాజరయ్యారు. విద్యార్థుల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించి, ఈ విభిన్న పండుగను నిర్వహించిన స్కూల్ బృందానికి అభినందనలు తెలిపారు. ఇది విద్యార్థుల అభివృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. ప్రత్యేకంగా గుర్తింపు పొందిన విద్యార్థి బి.శ్రేయస్, తైక్వాండోలో తన అద్భుత ప్రతిభను ప్రదర్శించాడు. మూడు సంవత్సరాల వయస్సులోనే తైక్వాండో నేర్చుకోవడం ప్రారంభించి, తన తొలి బెల్ట్‌ను ప్రముఖ తెలుగు సిని నటుడు సుమన్ తల్వార్ చేత అందుకున్నాడు. ప్రస్తుతం, అతనికి కుక్కివాన్ తైక్వాండోలో మొదటి డాన్, మార్వెలస్ ప్రపంచ రికార్డు సాధించాడు. బీ శ్రేయస్ 30 సెకండ్లలో 100 స్పీడ్ కిక్స్ కొట్టి అద్భుత రికార్డు సాధించాడు. నంచాక్ పుమ్సే ప్రదర్శనలో కూడా తన నైపుణ్యాలను చాటాడు. ఇది తైక్వాండోలో ఉన్న ప్రత్యేకతను ప్రతిబింబిస్తుంది. ఈ నైపుణ్యాలను చూసి న్యాయమూర్తి విద్యార్థిని అభినందించారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

### సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**విశ్వంభర, సూర్యాపేట :** పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా శనివారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పాల్గొని మొదటగా రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత పాల్గొని వారి రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాల అస్మారకంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, అత్యవసర సమయాల్లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశామన్నారు. పోలీసుల త్యాగాలు బలిదానాలను ప్రజలు గుర్తించాలని శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులతో భాగస్వామ్యం కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. రక్తదానం ప్రాణదానమని ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు అత్యవసర సమయంలో ఎందరో రక్తం అందగా ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటి పరిస్థితి రాకుండా అవసరమైన వారికి సరైన సమయంలో రక్తం అందాలని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పెద్ద ఎత్తున యువత తరలివచ్చి రక్తదానం చేయడం సంతోషకరమైన విషయం అని అన్నారు. సూర్యాపేట జిల్లా ఆసుపత్రి సిబ్బంది పాల్గొని రక్త దాతల నుండి రక్తాన్ని సేకరించారు. అలాగే తలసేమియా పిల్లలకు ఉపయోగపడే విధంగా తలసేమియా పరిరక్షణ స్వచ్ఛంద సంస్థ వారు కూడా దాతల నుండి రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరంలో యువత, పోలీసు సిబ్బంది కలిసి 200 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ నాగేశ్వర రావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహా చారి, సూర్యాపేట డీఎస్పీ రవి, ఆర్ఐ నారాయణ రాజు, సీఐలు రాజశేఖర్, సురేందర్ రెడ్డి, శ్రీను, రఘువీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయించాలని మా ఎమ్మెల్యేలకు డబ్బు ఆఫర్

### ఇద్దరు ఎమ్మెల్యేలకు రూ. కోట్లు ఇస్తామన్నారు

### అజిత్ పవార్ ఎన్సీపీపై కాంగ్రెస్ ఆరోపణ



**ముంబయి:** అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లో చేరాలని తమ ఎమ్మెల్యేలకు రూ.కోట్లలో డబ్బు ఆఫర్ చేశారని కాంగ్రెస్ ఆరోపించింది. అజిత్ పవార్ నేతృత్వం లోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లో చేరేందుకు ఇద్దరు ఎమ్మెల్యేలకు కోట్లాది రూపాయలు ఆఫర్ చేశారని కాంగ్రెస్ శనివారం ఆరోపించింది. "ఎన్సీపీలో చేరాలని మా పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు ఆ పార్టీ కోట్ల రూపాయలు ఆఫర్ చేస్తోంది. ఇది నేరపూరిత చర్య.. ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుంది. హోంశాఖ బాధ్యతలు చూస్తున్న సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారు. అసలు ఏమి జరిగిందో చెప్పాల్సిన బాధ్యత ఆయనపైన ఉంది" అని కాంగ్రెస్ మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్ రమేష్ చెన్నితాల అన్నారు. కాగా కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై ఎన్సీపీ ఇంకా స్పందించలేదు. మహారాష్ట్ర ఎన్నికలకు 48 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసిన కాంగ్రెస్ గురువారం 23 మంది అభ్యర్థులతో రెండో జాబితా ప్రకటించింది. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన వసంత్ పుర్కే రాలేగావ్, శివాజీరావ్ మోఘే కుమారుడు జితేంద్ర పేర్లు ఆ జాబితాలో ఉన్నాయి.

**మహా వికాస్ అఘాడీ సీటు షేరింగ్ ఒప్పందం:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు విపక్ష 'మహా వికాస్ అఘాడీ' కూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారంలో ఏకాభిప్రాయం కుదిరింది. ఈ కూటమిలోని ప్రధాన పక్షాలైన శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ) పార్టీలు 85 స్థానాల చొప్పున పోటీచేయాలని నిర్ణయించాయి. మరోవైపు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు శివసేన (యూబీటీ) 65మంది అభ్యర్థులతో జాబితాను విడుదల చేసింది. మరోవైపు శివసేన (యూబీటీ) 65మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదలైంది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే కోప్రి-పచ్‌పఖాడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతుండగా.. ముంబయిలోని వర్లి నుంచి మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే తనయుడు ఆదిత్య ఠాక్రే పోటీ చేయనున్నారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే నియోజకవర్గమైన కోప్రి పాచ్‌పఖాడి సీటులో ఆయన రాజకీయ గురువు ఆనంద్ దిఘే సోదరుడి కుమారుడైన కేదార్ దిఘేను ఉద్ధవ్ ఠాక్రే బరిలో దించారు.

## అమీన్ పూర్‌లో పర్యటించిన ఎంపీ రఘునందన్ రావు



**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్ చెరు నియోజకవర్గం అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడలో పలు కాలనీల్లో శనివారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు పర్యటించారు. అనంతరం కాలనీలో సమస్యలను స్తానికులను అడిగి తెలుసుకున్నారు. పటేల్ గూడలోని పలు కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ, కరెంట్, అలాగే ఇతర సమస్యలు ఉన్నాయని వాటిని సకాలంలో పూర్తి చెయ్యాలని కాలనీ వాసులు వినతి పత్రాలను అందజేశారు. అందుకు ఎంపీ రఘునందన్ రావు సానుకూలంగా స్పందిస్తూ సంబధిత అధికారులతో మాట్లాడారు. అమీన్ పూర్ మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి దాదాపు ఐదు వందల నుంచి ఆరు వందల కోట్లు ఖర్చు అవుతాయని అందుకు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఖజానా లేనందు వల్ల పనులు ప్రారంభించడానికి ఆలస్యం అవ్వచ్చు అని, అందుకు తనవంతుగా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి డ్రైనేజీ నిర్మిస్తానని ఎంపీ తెలిపారు. అలాగే పటేల్ గూడలో ప్రభుత్వ పాఠశాలను కూల్చి వేయడంతో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుండంతో జిల్లా విద్యా అధికారికి ఫోన్ కాల్ ద్వారా వచ్చే సంక్రాంతి సెలవులలో లోపు పాఠశాల భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తేవాలని ఎంపీ రఘునందన్ విద్యాధికారికి తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఈర్ల రాజు, నాయకులు ఎడ్ల రమేష్, సంగారెడ్డి మహిళ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నర్సింగ్ గౌడ్, కొలుకూరి రాజశేఖర్ రెడ్డి, నాగసాని బాలరాజ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు

## సైనిక స్థావరాలే లక్ష్యం

## విమానాలు బంద్?!



**జెరూసలెం:** ఇరాన్ చేసిన దాడులకు ప్రతీకారం తీర్చుకుంటోంది ఇజ్రాయెల్. శనివారం తెల్లవారుజామున టెహ్రాన్‌కు చెందిన సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దళాలు దాడులు చేస్తున్నాయి. ఈమేరకు అక్కడి మీడియా సంస్థల్లో వార్తలు వస్తున్నాయి. "ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్ చేసిన దాడులకు ప్రతిస్పందనగా ఐడీఎఫ్ దాని సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తోంది. ఇరాన్ దాని మద్దతుదారులు అక్టోబరు 7 నుంచి ఇజ్రాయెల్‌పై కనికరం లేకుండా దాడులు చేస్తున్నాయి. ప్రపంచంలోని అన్ని సార్వభౌమ దేశాల మాదిరిగానే ఇజ్రాయెల్‌కు ప్రతిస్పందించే హక్కు, బాధ్యత ఉంది. మా దేశాన్ని, ప్రజలను రక్షించుకునేందుకు ఏదైనా చేస్తాం" అని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డేనియల్ హగారీ పేర్కొన్నారు. జనరల్ స్టాఫ్ చీఫ్, ఎల్‌టీజీ హెర్జి హలేవీ నాయకత్వంలో ఈ ప్రతీకార దాడులు చేస్తున్నట్లు ఐడీఎఫ్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఇజ్రాయెల్ వైమానిక దళం కమాండింగ్ అధికారి మేజర్ జనరల్ టోమర్ బార్‌తో కలిసి క్యాంప్ రాబిన్‌లోని ఇజ్రాయెల్ ఎయిర్‌ఫోర్స్ కమాండ్ సెంటర్ నుంచి దాడులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్ క్షిపణి దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ జరుపుతున్న వైమానిక దాడుల్లో అమెరికా ప్రమేయం లేదని అమెరికాకు చెందిన ఓ అధికారి వెల్లడించారు. అయితే ఇరాన్‌పై ప్రతీకార దాడులకు సంబంధించి అమెరికాకు ముందే సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఇజ్రాయల్ దాడులపై ఇరాన్ స్పందించింది. ఇలామ్, ఖుజెస్థాన్, టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలను ఐడీఎఫ్ లక్ష్యంగా దాడులు జరిపిందని తెలిపింది. అయితే ఈ దాడుల కారణంగా పరిమిత స్థాయిలో నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది.

**విమాన రాకపోకలకు అంతరాయం:** ఇరాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడుల కారణంగా ఇరాక్ తన విమానాశ్రయాల్లో రాకపోకలను నిలిపివేసింది. ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా, ఇరాక్ గగనతలంలో పౌర విమానయాన భద్రతను కాపాడేందుకు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు విమానాల రాకపోకలు నిలిపివేశామని దేశ రవాణాశాఖ మంత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబరు 1వ తేదీన ఇరాన్ భారీ బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై దాడులు చేసింది. వీటిల్లో కొన్ని లక్ష్యాలకు అత్యంత సమీపంలో పడ్డాయి. మిగిలినవాటిని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు అడ్డుకొన్నాయి. దీనికి ప్రతీకార చర్య తప్పదని టెల్ అవీవ్ స్పష్టంచేసిన విషయం తెలిసిందే. టెహ్రాన్‌పై దాడులకు ఇజ్రాయెల్ సైన్యాన్ని సిద్ధం చేసిందనే వార్తలు ఆందోళన రేకెత్తించాయి. ఈనేపథ్యంలోనే ఇరాన్ సైనిక స్థావరాలు లక్ష్యంగా ప్రతీకార దాడులు చేయడం గమనార్హం.

## వర్కింగ్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ కమిటీ సమావేశం



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ మంజూరుకు అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ, ప్రథమ సమావేశం శనివారం బూర్గుల రామకృష్ణారావు భవనంలో జరిగింది. మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్, సియాసత్ న్యూస్ ఎడిటర్, ఎమ్మెల్సీ, అమీర్ అలీ ఖాన్, హిందూ పొలిటికల్ ఎడిటర్ ఆర్ రవికాంత్ రెడ్డి, సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కే నరహరి, సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్ పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర హైకోర్టు తీర్పులు, నూతన మార్గదర్శకాలు, వివిధ రాష్ట్రాలలో అమలులో ఉన్న అక్రిడిటేషన్ కమిటీ నిబంధనలను, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ఇతర మీడియాకు అక్రిడిటేషన్ల అంశాలపై ప్రాథమికంగా చర్చించారు. రాష్ట్రంలో నూతన మార్గదర్శకాలపై జర్నలిస్టు యూనియన్లు/అసోసియేషన్లు, ప్రెస్ క్లబ్బులు, వ్యక్తుల నుంచి ప్రత్యేక కమిటీకి రాతపూర్వకమైన సలహాలు, సూచనలను ఆహ్వానించింది. నవంబర్ 15లోగా వాటిని సమాచార పౌర సంబంధాల శాఖ, జాయింట్ డైరెక్టర్ (ఎం ఆర్) కు అందజేయాల్సిందిగా కోరింది.

## పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, మహబూబాబాద్ :** మహబూబాబాద్ మండలం ఈదుల పూస పల్లి పాఠశాలను శనివారం స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందని అందులో భాగంగా 11 వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిందని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని వారందరికీ నాణ్యమైన మంచి విద్యను అందించడానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. ఈదుల పూసపల్లి పాఠశాలకు అన్ని వసతులు కల్పిస్తామని, ఉపాధ్యాయ కృషి చాలా బాగుందని ఎమ్మెల్యే కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యేను పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమ గోవర్ధన్, ఉపాధ్యాయులు వేణు గోపాల్, సత్యనారాయణ రెడ్డి, కృష్ణవేణి, షమీం, సింధుజ, కాంగ్రెస్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఘనపురం అంజయ్య, భూపతి వినయ్, పుట్టగిరి శ్రీపాల్ రెడ్డి, వెన్నం లక్ష్మారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**విశ్వంభర, తలకొండపల్లి :** ఏబీవీపీ తలకొండపల్లి శాఖ ఆధ్వర్యంలో పెండింగ్ ఉన్నవిద్యార్థులకు రూ.7400 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్షిప్ లను విడుదల చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోరటి భరత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని కలశాలలకు రావాల్సిన ఫీజు రీయంబర్స్మెంట్ స్కాలర్షిప్‌లు దాదాపు 7400కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని మండిపడ్డారు. దీంతో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎంతో మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారని ఆవేదన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులను పట్టించుకోవడంలేదని, ఇప్పటి వరకు విద్యా శాఖకు మంత్రి లేకపోవడం శోచనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి రాష్ట్ర నాయకుల కట్టుమాల విజయ్ కుమార్, ఇస్లావత్ వెంకటేష్ నాయక్, లండం మల్లేష్, నగర నాయకులు, భరత్, నందు, మల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, మర్పల్లి :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతున్నది. మర్పల్లి మండల బీజేవైఎం మండలాధ్యక్షుడు మధుకర్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని భూచన్పల్లి, దమస్తాపురం గ్రామాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. దేశ ప్రజలు నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుతున్నారన్నారు వికసిప్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రజల మద్దతు మరింత అవసరమన్నారు. దీనికోసం ప్రజలు ఎక్కువ సంఖ్యలో పార్టీలో చేరి తమ మద్దతు తెలపాలన్నారు. బీజేపీ ఎప్పుడు ఉచిత పథకాలను ఇవ్వదని దేశ సంక్షేమం పురోగతిపైనే దృష్టి పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, యాదవ్ రెడ్డి, శాంతప్ప, సుభాష్, లక్ష్మణ్, అన్నపూర్ణ, శ్రీశైలం, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## చౌదరిగూడ మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, షాద్‌నగర్ :** చౌదరిగుడా మండల కేంద్రంలో శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు కురుమయ్య, అనిల్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వం నమోదు ముమ్మరంగా సాగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా సభ్యత కో కన్వీనర్ కందూర్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వానికి ప్రజల బ్రహ్మరథం పడుతున్నారని చివరి 3 రోజులు ప్రతి భూత్‌లో 100కి తగ్గకుండా సభ్యత్వం చేసి, కమిటీ ఏర్పాటుకు అర్హత సాధించే విధంగా సభ్యత్వాలు చేయాలని సూచించారు. భవిష్యత్తు తరాల భద్రత కోసం భారతీయ జనతా పార్టీని భారతీయ జనతా పార్టీని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామ్ లక్ష్మణ్, గొల్ల రాజు, బల్వంత్, వెంకటేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

### మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్న

# ప్రైవేటు దవాఖానల దందా..

- నిబంధనలు గాలికి వదిలేసిన ప్రైవేటు వైద్యులు
- తూతూమాత్రంగా రక్షణ చర్యలు

పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలో ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, దంత వైద్యశాలలు, స్పెషలిస్ట్ డాక్టర్ల పేరిట ఎన్నో క్లినిక్లు వెలుస్తున్నాయి. మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా ప్రైవేటు దవాఖానల దందా కొనసాగుతుంది. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా క్లినిక్ నిర్వహణలో ఎలాంటి నియమ నిబంధనలు పాటించడం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో పలు విమర్శలకు తావిస్తుంది. ఫిర్యాదులు అందినప్పుడు కొన్ని రోజులు సీజ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. మళ్లీ పర్మిషన్ తెచ్చుకుని దందా చేస్తున్నారు. వచ్చిన అమాయక పేషెంట్ల నుంచి చికిత్స పేరుతో వేలకు వేలకు దండుకుంటున్నారు. హాస్పిటల్‌లో సరైన డాక్టర్లు లేకున్నా.. హైదరాబాదు నుంచి వైద్యులను రప్పించి ఆయనకు కొంత ముట్టజెప్పి పని కానిస్తున్నారు. ఇదంతా తెలియని పేషెంట్లకు పెద్ద డాక్టర్ వస్తారు రెండు గంటలు వేచి ఉండండి అంటూ మభ్యపెడతారు హైదరాబాదు నుండి వచ్చిన తర్వాత శస్త్ర చికిత్స చేసిన తర్వాత ఫోనులోనే డాక్టర్ తో ఇక్కడున్న డాక్టర్లు సంభాషించి మందులను ఇస్తుంటారు. ఒకవేళ శస్త్ర చికిత్స వికటించిన పేషెంట్ ను చూడకుండా ఇచ్చిన మందులను పొరపాటుగా వాడిన అంతే సంగతులు ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉన్న వాళ్ళకి ఇవేమీ పట్టింపులు లేవు చాలామంది ప్రాణాలు పోయిన రెండో మూడో లక్షలను కుటుంబ సభ్యులకు అందజేసి చేతులు దులుపుకుంటున్నారు. 2020 మెడికల్ చట్ట ప్రకారం ప్రతి ఆసుపత్రి, ప్రతి క్లీనిక్లో ఆసుపత్రికి సంబంధించిన రిజిస్ట్రే షన్ అందులో పని చేస్తున్న డాక్టర్ల అర్హత, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రే షన్ తదితర అంశాలను పరిశీలించాలని సూచించింది. క్లీనికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు ప్రకారం అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, దయాగ్నోస్టిక్ సెంటర్లలో టెస్టుల ఫీజు వివరాలను సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో వ్రాసి ఆయా ఆసుపత్రుల ఆవరణలో బోర్డులో ప్రదర్శించాలి. అయితే పట్టణంలోని కొన్ని ఆసుపత్రులు ఈ నిబంధనలు తుంగలో తొక్కి ప్రజల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ నిలువు దోపిడి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వైద్య అధికారులు తనిఖీలు నిర్వహించక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాల ఆటలు కట్టించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# సిండికేట్‌కు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సపోర్ట్

- బెల్టు షాపులకు అనువైన మద్యం బాటిళ్లు అమ్మాలని ఆదేశం
- మీడియా కంటపడటంతో జారుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు
- వీడియోలు తీస్తుండడంతో హెూల్ సేల్ వైన్ షాప్ మూసేసి పరారైన సిబ్బంది




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** బెల్ట్ షాపులు లేవని.. వైన్ షాపుల యజమానులు సిండికేట్ అయి హెూల్ సేల్ షాపులు నడపడం లేదని చెబుతున్న ఎక్సైజ్, ఎక్సైజ్ ట్రాస్క్ ఫోర్స్ పోలీసులు ఏకంగా యాదాద్రి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో వైన్ షాపుల యజమానులతో కుమ్మక్కై బెల్ట్ షాపులకు అనువైన మద్యం అమ్మాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులకు ఫుల్, ఆఫ్ బాటిళ్లే ఇస్తున్నారని, వాళ్లకి ఇబ్బంది పడుతున్నారని క్వార్టర్ బాటిళ్లు అమ్మాలని దగ్గరుండి చెప్పడం గమనార్హం. ఉన్నతాధికారులు ఎవరూ లేకుండా నలుగురైదుగురు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు (వాహనం నంబర్ %టూ 30 రూా% 4279) శనివారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని వైన్ షాప్‌ల యజమానులు సిండికేట్ అయి హెూల్ సేల్‌గా నడుపుతున్న షాపులో ఆ పోలీసులు కూర్చుని మాట్లాడుతుండడం మీడియా కంట పడింది. రిపోర్టర్లు వీడియోలు, ఫోటోలు తీస్తుండడంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు అక్కడి నుంచి వాహనం ఎక్కి జారుకోగా, హెూల్ సేల్ కౌంటర్ వైన్ షాప్‌ను సిబ్బంది పోలీసుల ముందే మూసేశారు. ఉన్నతాధికారులు లేకుండా షాపులను ఏ విధంగా తనిఖీ చేస్తున్నారని, హెూల్ సేల్ షాప్ మీ కళ్ళముందే నడుస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని టాస్క్ ఫోర్స్ పోలీసులను ప్రశ్నించగా సమాధానం చెప్పడానికి నిరాకరించి అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో రెండు వైన్ షాపులు ఉండగా ఆ షాపుల యజమానులు సిండికేట్ అయి అక్రమంగా బెల్ట్ షాపులు అమ్మకాల కోసం సుమారు ఏడాదికాలంగా హెూల్ సేల్ కౌంటర్ నడుపుతున్నారు. ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.10 నుంచి 50 రూపాయల వరకు అదనంగా బెల్ట్ షాప్ నిర్వాహకులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. హెూల్ సేల్ షాప్ పై ఎన్ని ఫిర్యాదులు చేసినా ఇటు ఎక్సైజ్, అటు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆ ఫిర్యాదులను అడ్డం పెట్టుకొని మామూళు దండుకుంటూ అక్రమ మద్యం వ్యాపారానికి సపోర్ట్ చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు ప్రారంభం

**విశ్వంభర, మహబూబాబాద్ :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం మహబూబాబాద్ జిల్లా గుడూరు మండలం ఎల్లంపేట్ క్రాస్ రోడ్డు వద్ద మైదానంలో పోలీస్ శాఖపరమైన క్రికెట్ టోర్నమెంట్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ ప్రారంభించారు. తొర్రుర్ సబ్ డివిజన్ పోలీస్ టీం, పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఏఆర్ టీం మధ్య అట కొనసాగింది. మొదట బాటింగ్ ఎంచుకున్నా తొర్రుర్ టీం 10 ఓవర్లకు 65 పరుగులు చేయగా.. ఏ.ఆర్ టీం 68 పరుగులు తీసి విజయం సాధించింది. నేడు ఉదయం మిగతా టీమ్స్ మధ్య పోటీ ఉంటుందని గెలిచిన వారు ఫైనల్స్ ఆడటం జరిగితుందని ఎస్పీ తెలిపారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వారిని స్మరించుకుంటూ పోలీస్ శాఖ పరంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రుల ధర్నా



**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండలం నెల్వలపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. పాఠశాలకు తాళం వేసి ప్రభుత్వం మా పాఠశాలకు కేటాయించిన టీచర్‌ను మా పాఠశాలకే పంపాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గజ్జల వెంకట్ రెడ్డి, గొడ్డటి మధుయాదవ్ మాట్లాడుతూ.. మా పాఠశాలలో ప్రాథమికొన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఉండగా ఉపాధ్యాయులు 37 సబ్జెక్ట్స్ బోధించాలి కానీ మా పాఠశాలకు ప్రభుత్వంచే నిర్ణయించబడ్డ పోస్టులు 7 వుండగా కేవలం ముగ్గురు ఉపాధ్యాయులతో బోధన నిర్వహిస్తుండగా గ్రామస్తులు, ఉపాధ్యాయ తల్లిదండ్రుల, అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వం డీఎస్సీ నియామకాలలో ఎస్జిటి టీచర్ ను ఈ నెల 17న నియమించారు. ఎటువంటి ప్రభుత్వ ఆదేశాలు లేకుండా ఆ టీచర్ పోలేపల్లి రాంనగర్ ప్రాథమిక పాఠశాలకు పంపడం జరిగింది. మా పాఠశాల కేటాయించిన టీచర్‌ను మా స్కూలుకే పంపాలని అధికారులను కోరుతున్నారు. అక్రమ డిప్యూటేషన్ పై పంపిన జిల్లా అధికారిపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## సేవ చేయడమే మా సిద్ధాంతం

### షేర్ ద విజన్ సేవా సంస్థ చైర్మన్ పొదిలి నారాయణ



విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం: విద్యార్థులకు వృద్ధులకు అనాథలకు తమ శక్తి మేరకు సేవ చేయడమే తమ సంస్థ సిద్ధాంతమని షేర్ ద విజన్ సేవా సంస్థ చైర్మన్ పొదిలి నారాయణ తెలిపారు. సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాకలోని యాదాద్రి సేవా ఆశ్రమంలోని అనాథలకు ఏడాదికి సరిపడా నిత్యవసర సరుకులు, ఫ్యాన్లు, గ్రైండర్, గీజర్, ఇతర వస్తువులు ఆయన శనివారం అందజేశారు. నారాయణ మాట్లాడుతూ.. సమాజానికి తమ వంతు సేవ చేయాలనే భావన ఉన్న మిత్రులందరికీ 2013లో సేవా సంస్థను ప్రారంభించామని తెలిపారు. మారుమూలన ఉన్న తమ ఆశ్రమాన్ని వెతుక్కుంటూ వచ్చి ఏడాదికి సరిపడా రూ. రెండు లక్షల విలువైన సరుకులను అందించినందుకు ఆశ్రమం నిర్వాహకులు, అనాథ వృద్ధులు సేవా సంస్థ చైర్మన్ నారాయణను సన్మానించారు. అతని దయ హృదయానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదాద్రి వృద్ధాశ్రమం ట్రస్టు చైర్మన్ వర్కాల చంద్రశేఖర్, కార్యదర్శి రావిరాల మల్లేష్, ఉపాధ్యక్షులు చిట్యాల వెంకటరెడ్డి, గజం హనుమంతు, సభ్యులు కేశిరెడ్డి యాదరెడ్డి, వనం స్వామి, గజం రమేష్, కోన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



వంగూరు మండలం అచ్చంపేట నియోజకవర్గం నాగర్ కర్నూల్ జిల్లా.. వ్యవసాయ కమిషన్ మెంబర్‌గా నియమితులైన కేవీఎన్ రెడ్డి శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కమిషన్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలిపారు.
– విశ్వంభర, వంగూరు



గీసుగొండ గ్రామంలో దౌడు భరత్ మాజీ ఎంసీటీసీ కోమల ఎంపీటీసీ నిధుల నుంచి బోర్ వేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చాడ కొమురరెడ్డి కొబ్బరికాయకొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో దౌడు ప్రవీణ్ కుమార్, ఎండీ జావిద్, చాడ సంజీవరెడ్డి, బోడకుంట్ల కుమారస్వామి, మాజీ సర్పంచ్ మహబ్ తదితరులు ఉన్నారు.

## క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి



**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండల కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని ఎంసీసీ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు తహసీల్దార్ రమాకాంత్ శర్మకు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో క్రీడా మైదానం లేక యువత చెడు అలవాట్లకు బానిసలయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే మండల కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసే దిశగా సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఎంసీసీ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈగల్ బాక్స్ క్రికెట్ శిక్షణ కేంద్రం ప్రారంభం



**విశ్వంభర, మేడిపల్లి :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్రీ విలేజ్, చెంగిచెర్ల సమీపంలో బాక్స్ క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని పీ భరత్, బీ శ్రవణ్ కుమార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒకటవ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్, చెంగిచెర్ల మాజీ ఉపసర్పంచ్ కొత్త రవి గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల సత్యమూర్తి యాదవ్, సోమయ్య గౌడ్, మేకల వెంకటేష్, సోమేష్ యాదవ్, శ్రీనివాస్, యువనేత కొత్త సాయి తేజ గౌడ్, ఈగల్ బాక్స్ క్రికెట్ వ్యవస్థాపకులు పాల్గొన్నారు.

## తుక్కుగూడ మున్సిపల్‌లో పర్యటించిన చైర్ పర్సన్



**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ ప్రభుత్వ హైస్కూల్ ప్రైమరీ స్కూల్, అంగన్వాడిలో టాయిలెట్స్, మధ్యాహ్నం భోజనం గురించి విద్యార్థులను అడిగి సమస్య తెలుసుకున్నారు. అదేవిధంగా స్మశాన వాటికల్లో స్నానాల గదులు ఇతర సమస్యల గురించి పరిశీలించారు చైర్ పర్సన్ బరిగెల హేమలత రాజు గౌడ్. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ బాకీ విలాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్ రాజ్, బరిగెల సుధాకర్, శేఖర్, రాజు, శివ, కిరణ్, మిట్టు తదితరులు పాల్గొన్నారు.

## తల్లోజు ఆచారి ఆర్థిక సహాయం

**విశ్వంభర, మాడ్గుల :** మాడుగుల మండలం అజిలాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కాలే శివలింగం ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న మాజీ జాతీయ బీసి కమీషన్ సభ్యుడు తల్లోజు ఆచారి శుక్రవారం సాయంత్రం గ్రామానికి చేరుకొని శివలింగాన్ని పరామర్శించి నాయకుల ద్వారా 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీ పెద్దయ్య, కే శీను, కే మల్లయ్య, శివలింగం, కే మల్లేష్, జీ రమేష్, ఆనంద్, శివ, బీరప్ప, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.





## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని ఆత్మకూరు, మొరిపిరాల, సర్వేపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం పక్కీరయ్య, ఐకేపీ సీసీలు లోడి వెంకన్న గౌడ్, లోడి భాస్కర్ గౌడ్, ఏఈఓ చేగూరి మనీషా, వీబీకేలు నర్సింహ, మౌనిక, లావణ్య, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ఎన్నికల స్టార్ క్యాంపెయినర్లుగా

### మోదీతో సహా 40మంది

**ముంబయి:** త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టార్ క్యాంపెయినర్లను బీజేపీ ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా మొత్తం 40 మంది పేర్లను ప్రకటించింది.మహారాష్ట్ర లో మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించి.. 23న ఫలితాలు వెల్లడించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 9 కోట్ల 63 లక్షల మంది ఓటర్లు ఉండగా.. లక్షా 186 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఈసీ ఇప్పటికే ప్రకటించింది. ఇక నవంబర్ 26తో మహారాష్ట్ర అసెంబ్లీ గడువు ముగియనుంది.

## పోటీ కొత్తేమో.. పోరాటం కొత్త కాదు

### ప్రియాంకగాంధీ వాద్రా



**ఢిల్లీ:** ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి అరంగేట్రం చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వయనాడ్ ఉప ఎన్నిక పోరుకు సిద్ధమవుతున్నారు. ఇటీవలే ఈ లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈనేపథ్యంలో తాజాగా వయనాడ్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఓ భావోద్వేగభరిత పోస్ట్ చేశారు. ఎన్నికల్లో పోటీ కొత్తేమో గానీ.. ప్రజల తరఫున పోరాటం తనకు కొత్తేమీ కాదని అన్నారు.“కొన్ని నెలల క్రితం నేను, మా సోదరుడు రాహుల్‌తో కలిసి మండక్కై, చూరాల్ మల వెళ్లాను. కొండచరియలు విరిగిపడటంతో ప్రకృతి సృష్టించిన బీభత్సం కారణంగా మీరు ఎదుర్కొన్న నష్టాన్ని, సర్వం కోల్పోయిన మీ ఆవేదనను కళ్లారా చూశా. పిల్లలను కోల్పోయిన తల్లులు, కుటుంబాన్ని కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను చూశా. ఆ చీకటి రోజుల నుంచి బయటపడి నవశక్తితో మీరు ముందుకు కదిలిన తీరు స్ఫూర్తిదాయకం. నిస్సహాయ స్థితిలోనూ తోటి వారి కోసం మీరు పడిన ఆరాటం.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఆ విషాద సమయంలో మీరు చూపించిన అచంచలమైన ధైర్య సాహసాలే.. ఈరోజు నాలో స్ఫూర్తిని నింపాయి. మీ తరఫున పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా”“నా సోదరుడికి మీరు ఎంతో ప్రేమను, అభిమానాన్ని పంచారు. అదే ప్రేమను నాపైనా కురిపిస్తారని ఆశిస్తున్నా. చట్టసభలో మీ గళాన్ని వినిపించే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నా. చిన్నారుల భావి భవిష్యత్తు, మహిళల శ్రేయస్సు కోసం నా శక్తికి మించి కృషి చేస్తానని మాటిస్తున్నా. ప్రజాప్రతినిధిగా పోటీ చేసే ఈ ప్రయాణం నాకు కొత్త కావొచ్చు. కానీ, ప్రజల తరఫున గళం వినిపించేందుకు చేసే పోరాటం మాత్రం కొత్త కాదు. ఈ ప్రయాణంలో మీరంతా నాకుమార్గదర్శకంగా నిలుస్తారని ఆశిస్తున్నా” అని ప్రియాంకా గాంధీ రాసుకొచ్చారు.ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేసినరాహుల్‌గాంధీ.. సీపీఐనాయకురాలు అన్నీరాజాపై3.6 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాహుల్ రాజీనామాతో జరుగుతోన్న ఉప ఎన్నికలో ప్రియాంకాగాంధీ కాంగ్రెస్ తరఫున పోటీకి దిగారు. కేరళలో పాలక్కాడ్, చెలక్కర అసెంబ్లీ స్థానాలతోపాటు వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నవంబర్ 13న జరగనుంది. నవంబర్ 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

## అందరినీ అభివృద్ధి చేసేది మహా వికాస్ అఘాడీ మాత్రమే : సంజయ్ రౌత్



**రాంచీ:** ‘సబ్ కా సాత్, సబ్ కా వికాస్ ’ అనేది మా కూటమి నినాదమని,అందరినీ అభివృద్ధి చేసేది ‘మహా వికాస్ అఘాడీ’ కూటమి మాత్రమేనని శివసేన ఎంపీసంజయ్ రౌత్ అన్నారు. మహారాష్ట్రలో ఇప్పుడు బలంగా ఉన్న పార్టీలు మూడు మాత్రమేనని.. కాంగ్రెస్, శరద్‌పవార్ కాంగ్రెస్, ఉద్ధవ్ థాకరే శివసేన మాత్రం బలంగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ ఎన్నికల్లోగెలుపు తమ కూటమి దేనని‌రౌత్‌ధీమా వ్యక్తంచేశారు. ఈ ఎన్నికల్లో మూడు పార్టీలు సమానంగా సీట్లు పంచుకుని బరిలో దిగుతున్నాయని సంజయ్ రౌత్ చెప్పారు. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా అన్ని స్థానాల్లో పోటీ చేసిందని, కానీ అధికారంలోకి మాత్రం రాలేకపోయిందని ఆయన గుర్తుచేశారు. అందుకే మహారాష్ట్రలో అందరం ఒక్కటై ముందుకు వెళ్లడం మంచిదనేది తన అభిప్రాయమని అన్నారు. కాగా మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మహాకూటమిలోని మూడు పార్టీలు 85 చొప్పున స్థానాల్లో బరిలో దిగనున్నాయి.ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతోపాటే మహారాష్ట్రలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఝార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుండగా, మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను నవంబర్ 23న వెల్లడించనున్నారు.

## ఆ నాలుగు పదాలే సామాన్యుల వ్యథలకు నిలువుటద్దం

### రాహుల్ గాంధీ



దిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఇటీవల దిల్లీలో ఓ బార్బర్ షాప్‌కు వెళ్లారు. అక్కడ షేవింగ్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా తనకు షేవింగ్ చేసిన అజిత్ అనే బార్బర్‌తో రాహుల్‌గాంధీ ముచ్చటించారు. బార్బర్ తన సాధకబాధకాలను రాహుల్‌గాంధీతో పంచుకున్నాడు. రోజంతా కష్టపడి పనిచేసినా ‘ఏమి మిగలడం లేదు (కుచ్ నహీ బచ్‌తా హై)’ సార్ అని చెప్పాడు. బార్బర్‌తో సంభాషణలకు సంబంధించిన వీడియోను శనివారం రాహుల్‌గాంధీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.బార్బర్ అజిత్ చెప్పిన ‘కుచ్ నహీ బచ్‌తా హై’ అనే నాలుగు పదాల మాట దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజల కష్టాలకు నిలువుటద్దమని తన సోషల్ మీడియాలో పోస్టులో రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న ధరలతో మంగలివాడి నుంచి చెప్పులు కుట్టేవాడి వరకు, కుమ్మరి వాడి నుంచి వడ్రంగి వరకు అందరి సంపాదన పడిపోతున్నదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పెరుగుతున్న ధరలతో సామాన్యులు దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఎన్డీఏ సర్కారు తీరుతో.. కష్టపడి పనిచేసి షాపులు పెట్టుకోవాలని, సొంత ఇళ్లు కట్టుకోవాలని, ఆత్మగౌరవంతో బతుకాలని సామాన్యులు కంటున్న కలలు కలలుగానే మిగిలిపోతున్నాయని రాహుల్‌గాంధీ ఆవేదన వెలిబుచ్చారు. ప్రజల బతుకులు బాగుపడాలంటే ప్రభుత్వాలు తీసుకొచ్చే కొత్త పథకాలు వారి ఆదాయాన్ని పెంచేవిగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాహుల్‌గాంధీ బార్బర్‌తో మాట్లాడిన వీడియోను కాంగ్రెస్ పార్టీ కూడా సోషల్ మీడియాలో షేర్ చేసింది.

## ‘మీ లేఖ అర్థం కాలేదు’.. కేంద్రమంత్రి హిందీ లేఖకు తమిళంలో డీఎంకే ఎంపీ రిప్లై



**చెన్నై:** కేంద్రం, తమిళనాడు మధ్య భాషాపరమైన వివాదం నడుస్తోన్న వేళ.. కేంద్రమంత్రి, ఎంపీ మధ్య లేఖల రూపంలో జరిగిన సంభాషణ చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి హిందీలో రాసిన లేఖకు డీఎంకే ఎంపీ పుదుకొట్టై ఎంఎం అబ్దుల్లా సమాధానం ఇచ్చారు. ఆ హిందీ లేఖ తనకు ఏమాత్రం అర్థం కాలేదని అబ్దుల్లా మంత్రికి బదులిచ్చారు.రైళ్లలో ఆహారనాణ్యత, పరిశుభ్రతకు సంబంధించిన అబ్దుల్లా లేవనెత్తిన ప్రశ్నలకు కేంద్రమంత్రి రవనీత్ సింగ్ బిట్టు హిందీలో బదులిచ్చారు. ఈవిషయమై రెండు వేర్వేరు భాషల్లో ఒకరికొకరు రాసుకున్న లేఖలను ఎంపీ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. “రైల్వేశాఖ సహాయమంత్రి నుంచి వచ్చే లేఖ ఎప్పుడూ హిందీలోనే ఉంటుంది. ఆయన కార్యాలయంలో విధుల్లో ఉన్న అధికారులకు ఫోన్ చేసి.. నాకు హిందీ రాదని, లేఖను ఆంగ్లంలో పంపమని కోరాను. కానీ హిందీలోనే బదులు వచ్చింది. అయితే నేను మాత్రం ఆయన అర్థం చేసుకునేలా రిప్లై పంపాను” అని సామాజిక మాధ్యమాల వేదికగా అబ్దుల్లా వెల్లడించారు. అలాగే సమాధానం ఇప్పటినుంచైనా ఆంగ్లంలో ఉండేలా చూడాలని కోరారు. గతంలో హిందీ భాష గురించి అమిత్ షా మాట్లాడుతూ..“హిందీ-గుజరాతీ, హిందీ-తమిళం,హిందీ-మరాఠీల మధ్య పోటీ ఉందంటూ కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారు. దేశంలో ఏ భాషకూ హిందీ పోటీ కాదు. దేశంలోని భాషలన్నింటికీ ఇది మిత్ర భాష. కేవలం హిందీ భాష అభివృద్ధి చెందినప్పుడే దేశంలోని ప్రాంతీయ భాషలన్నీ పరస్పరం వర్ధిల్లుతాయి. భాషలన్నీ పరస్పరం సహకరించుకుంటే తప్ప మన సొంత భాషలో దేశం నడవాలనే స్వప్నాన్ని సాకారం చేసుకోలేమన్నారు” అని వ్యాఖ్యనించిన సంగతి తెలిసిందే.

## చెంగల్పట్టులో వీధివీధికి వెలసిన నటుడు విజయ్ పోస్టర్‌లు



చెన్నై: తమిళనాడులోని చెంగల్పట్టు పట్టణంలో సందడి నెలకొంది. అక్కడ వీధివీధిన తమిళ స్టార్ హీరో విజయ్ పోస్టర్‌లు వెలిశాయి. విజయ్ స్థాపించిన ‘తమిళగ వెట్రి కజగం ’ పార్టీ కార్యకర్తలు ఎక్కడికక్కడ తమ అధినేత పోస్టర్‌లు ఏర్పాటు చేశారు. ఇంత హంగామా దేనికంటే విజయ్ టీవీకే పార్టీని స్థాపించిన తర్వాత అక్కడ ఎప్పుడు రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించలేదు.ఈ నేపథ్యంలో టీవీకే రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించాలని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ నిర్ణయించారు. అందుకు అక్టోబర్ 27న ముహూర్తం పెట్టుకున్నారు. విల్లుపురం జిల్లాలోని విక్రవంది ఏరియాలో ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల పట్టణాల్లో పార్టీ కార్యకర్తలు పార్టీ పోస్టర్లు, బ్యానర్‌లు ఏర్పాటు చేశారు.

## ఝార్ఖండ్ బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవీంద్రకుమార్ రాయ్



**రాంచీ:** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఝార్ఖండ్ బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవీంద్ర కుమార్ రాయ్‌ని నియమించారు. ఈ మేరకు బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా అప్పాయింట్‌మెంట్ లెటర్‌పై సంతకం చేశారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాయ్ నిమాయకం తక్షణమే అమల్లోకి వస్తుందని బీజేపీ ఒక ప్రకటనలో పేర్కొన్నది.ఝార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 23 ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. అక్కడ అధికార జేఎం, కాంగ్రెస్ కూటమి, ప్రతిపక్ష బీజేపీ నడుమ ప్రధాన పోటీ ఉండనుంది. జార?ండ్‌లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బీజేపీ చేయని ప్రయత్నం లేదు. భూ కుంభకోణంలో సీఎం హేమంత్ సోరెన్‌ను అరెస్ట్ చేయించింది.దాంతో హేమంత్ సోరెన్ తనకు నమ్మకస్తుడైన చంపాయ్ సోరెన్‌ను సీఎంగా నియమించి జైలుకు వెళ్లాడు. అనంతరం హేమంత్ సోరెన్ బెయిల్‌పై బయటికి వచ్చి మళ్లీ సీఎం పదవి చేపట్టాడు. దాంతో బీజేపీ నేతలు చంపాయ్ సోరెన్‌కు వలవేసి తమ పార్టీలో చేర్చుకున్నారు. అంతేగాక బీజేపీ నుంచి ఆయనకు ఆయన మనుషులకు టికెట్లు కూడా ఇచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో జార?ండ్ ప్రజలు ఎవరివైపు మొగ్గుచూపుతారో వేచిచూడాలి.

## ట్రాక్‌పై ఆరు కిలోల బరువున్న చెక్క దిమ్మె

**లక్నో:** దేశంలో రైలు ప్రమాదాలకు దారి తీసేలా కుట్రపూరిత ప్రయత్నాలు



ఆందోళన కలిగిస్తున్నాయి. ట్రాక్‌లపై గ్యాస్ సిలిండర్లు, ఇనుప పట్టీలు ఉంచుతూ రైళ్లను పట్టాలు తప్పించేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో ఇప్పటికే ఇలాంటివి అనేక ఘటనలు వెలుగుచూశాయి.తాజాగా మరో కుట్ర బయటపడింది.ఉత్తరప్రదేశ్ లోని మలిహాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్‌పై దుండగులు చెక్క దిమ్మెను ఉంచారు. అక్టోబర్ 24న ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో 14236 నంబర్ గల బరేలీ- వారణాసి ఎక్స్‌ప్రెస్ రైలు పైలట్ ట్రాక్‌పై ఉన్న 6 కిలోల కంటే ఎక్కువ బరువున్న రెండు అడుగుల పొడవైన చెక్క దిమ్మెను గుర్తించారు. వెంటనే అత్యవసర బ్రేక్‌లు వేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.ఈ ఘటనతో దాదాపు రెండు గంటల పాటు ఆ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రంగంలోకి దిగిన అధికారులు ట్రాక్‌పై ఉన్న వాటిని తొలగించారు. ఆ తర్వాత భద్రతా తనిఖీల అనంతరం రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.ఇటీవలే దేశవ్యాప్తంగా రైళ్లను పట్టాలు తప్పించేందుకే అనేక కుట్రలు జరిగిన విషయం తెలిసిందే. రైలు ట్రాక్‌లపై వివిధ రకాల వస్తువులను అధికారులు గుర్తించారు. వీటిలో ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ట్రాక్టర్లు, ఇనుప రాడ్‌లు, సిమెంట్ దిమ్మెలు, ఇసుక దిబ్బలు ఉన్నాయి. ఇలాంటి ఘటనలు ఎక్కువగా ఉత్తరప్రదేశ్‌లోనే వెలుగు చూడగా.. ఆ తర్వాత పంజాబ్, జార?ండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ప్రమాదాలు జరిగినట్లు రైల్వే శాఖ అధికారులు వివరించారు. ఇక జూన్ 2023 నుంచి ఇప్పటి వరకూ ఈ తరహా ఘటనలు 24 జరిగినట్లు తెలిపారు.

## దేశంలో అక్రమంగా ఉంటున్న భారతీయులను వెనక్కి పంపిన అమెరికా



**వాషింగ్టన్:** అమెరికాలో అక్రమ వలసదారులను నియంత్రించాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ (డీహెచ్ఎస్) ప్రయత్నిస్తుంది. ఇందులోభాగంగా తమ దేశంలో అక్రమంగా ఉంటున్న భారతీయులను వెనక్కి పంపించినట్లు డీహెచ్ఎస్ పేర్కొంది. అక్టోబరు 22న ప్రత్యేక విమానంలో వీరిని భారత్‌కు పంపినట్లు తెలిపింది. భారత ప్రభుత్వ సహకారంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు అవె ంరికా వెల్లడించింది. ‘చట్టబద్ధత లేకుండా అమెరికాలో ఉంటున్న భారతీయ పౌరులను వెనక్కి పంపాలని నిర్ణయించుకున్నాం. వలస వచ్చిన ప్రజలు స్మగ్లర్ల చేతిలో బందీలు కాకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నాం’ అని డీహెచ్ఎస్ సీనియర్ అధికారి క్రిస్టీ ఎ.కనెగాల్లో పేర్కొన్నారు. గత జూన్ నెలలోది బోర్డర్ ప్రెసిడెన్షియల్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. అమెరికా నైరుతి సరిహద్దుల్లో అనధికారిక వలసలు 55శాతం తగ్గినట్లు డీహెచ్ఎస్ గుర్తించింది.ఈ క్రమంలోనే 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 1,60,000 మంది అక్రమ వలసదారులను వెనక్కి పంపినట్లు తెలిపింది. 495కు పైగా ప్రత్యేక విమానాల్లో 145 దేశాలకు చెందిన వలసదారులను వెనక్కి పంపింది. వీరిలో భారత్‌తో పాటు కొలంబియా, ఈక్వెడార్, పెరూ, ఈజిప్ట్, మారిటానియా, సెనెగల్, ఉజ్బెకి స్థాన్, చైనా దేశాల పౌరులు ఉన్నారు. ఈ చర్యలు కఠినమైన సరిహద్దు సమస్యలను పరిష్కరించడం, అక్రమ వలసలను నియంత్రించడంతో పాటు చట్టబద్ధమైన వలసల మార్గాలను ప్రోత్సహించేందుకేనని అమెరికా వెల్లడించింది.

## మహారాష్ట్ర అభ్యర్థుల రెండో జాబితా ప్రకటించిన కాంగ్రెస్

**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా ప్రకటించింది. మరో 23 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశం తర్వాత రెండో జాబితాను శనివారం విడుదలచేసింది.కాంగ్రెస్, శివసేన (యూబీటీ) మధ్య వివాదంగా మారిన నాగ్‌పూర్ సౌత్ సీటు కాంగ్రెస్‌కు దక్కింది. ఈ నియోజకవర్గం నుంచి గిరీష్ కృష్ణరావు పాండవ్ బరిలోకి దిగనున్నారు.కాగా, తొలి జాబితాలో 48 మంది అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. వీరిలో 25 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు. తాజాగా 23 మందితో రెండో జాబితా రిలీజ్ చేసింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 71 మంది అభ్యర్థులను ప్రకటించింది.మరోవైపు మహారాష్ట్రలో ప్రతిపక్ష కూటమి అయిన మహా వికాస్ అఘాడి (ఎంవీఏ)లో ఎలాంటి విబేధాలు లేవని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. శనివారం సాయంత్రంలోగా భాగ స్వామ్య పక్షాలమధ్య తుది సీట్ల పంపకం ఖరారవుతుందని పేర్కొంది. కాగా, మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలోనవంబర్ 20న పోలింగ్ జరుగనున్నది.

## ఇద్దరు డీఎస్పీలు, మరో ఏడుగురు పోలీసులపై వేటు

### జైల్లో లారెన్స్ బిష్ణోయ్ ఇంటర్వ్యూకు అనుమతివ్వడంతో పంజాబ్ ప్రభుత్వం చర్యలు



**ముంబయి:** బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌పై బెదిరింపులు, మహారాష్ట్ర రాజకీయ నేత బాబా సిద్దిఖీ హత్య వంటి కారణాలతో దేశవ్యాప్తంగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరు మారుమోగుతోంది. అయితే అతడికి సంబంధించిన వ్యవహారంలో ఇద్దరు డీఎస్పీలు సహా ఏడుగురు పోలీసులు సస్పెండ్ అయ్యారు. అతడు కస్టడీలో ఉన్న సమయంలో టీవీ ఇంటర్వ్యూకు అనుమతించినందుకు అక్కడి అధికారులపై పంజాబ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 2023 మార్చిలో ఒక టీవీ ఛానల్‌లో లారెన్స్‌కు సబంధించిన రెండు ఇంటర్వ్యూలు ప్రసారం అయ్యాయి. ఈ వ్యవహారంపై పంజాబ్ - హరియాణా కోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. పంజాబ్‌లోని జైలు నుంచి వీడియో కాల్ ద్వారా ఒక ఇంటర్వ్యూ ఇచ్చాడని సిట్ గుర్తించింది. పంజాబ్ సింగర్ సిద్ధూ మూసే వాలా హత్య నేపథ్యంలో ఇది ప్రసారమైంది. దాంతో గ్యాంగ్‌స్టర్‌తో పోలీసులు చేతులు కలిపారంటూ అప్పట్లో మూసేవాలా తండ్రి ఆరోపించారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కొన్నేళ్లుగా జైల్లోనే ఉంటున్నాడు. బ్యారక్‌ల్లోకి అక్రమంగా వచ్చే సెల్‌ఫోన్ల ద్వారా అనుచరులతో నిరంతరం టచ్‌లో ఉంటూ హత్యలకు ప్రణాళికలు రచిస్తున్నాడనేఆరోపణలున్నాయి. సిద్ధూ మూసే వాలా, బాబా సిద్ధిఖీపై దాడులు ఈవిధంగానే చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే.. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య విషయం గురించి మాట్లాడుతూ.. కెనడియన్లకు సంబంధించిన సమాచారాన్ని భారత దౌత్యవేత్తలు సేకరించారని, వాటిని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు అందజేశారని ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

కేంద్ర రాజకీయాల్లో చక్రం తిప్పాలనుకున్న కేసీఆర్ బీఆర్ఎస్ ఏర్పాటు తర్వాత మహారాష్ట్రపై ఎక్కువ దృష్టి పెట్టారు. పూర్వపు హైదరాబాద్ స్టేట్ (నిజాం స్టేట్) లో అంతర్భాగంగా ఉండిన నాందేడ్, ఔరంగాబాద్, నాగ్‌పూర్ తదితర ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారు, పాత అనుబంధాలను పరిగణనలోకి తీసుకున్నారు. సోలాపూర్, ఔరంగాబాద్, లాతూర్, విదర్బ, హుమ్నాబాద్, బీవండి, నాందేడ్, గడ్చిరోలి, నాగ్ పూర్, థానే, నాసిక్, కల్యాణ్, బీడ్, పర్బణి, సాంగ్లీ, నాసిక్ ఇలా 16కు పైగా నియోజకవర్గాల్లో ఎక్కువగా తెలుగు ప్రజలు ఉంటున్నారు. దీంతో మహారాష్ట్ర రాజకీయాలపై ఫోకస్ చేశారు. నాగపూర్, సోలాపూర్, నాందేడ్ ప్రాంతాలలో పార్టీ కార్యాలయం కూడా ప్రారంభించారు. కేసీఆర్ చెప్పిన మాటలను విశ్వసించి కొన్ని ప్రాంతాల్లో ఎన్సీపీ, కాంగ్రెస్, శివసేనల నుంచి పలువురు నాయకులు గులాబీ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మహారాష్ట్రలో 4 భారీ బహిరంగ సభలు నిర్వహించింది. 48 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ ప్రధాన, అనుబంధ కమిటీల ఏర్పాటు చేశారు.అప్పట్లో మహారాష్ట్ర నుంచి కొంతమందికి రాష్ట్ర ప్రభుత్వంలో పోర్ట్‌ఫోలియో ఉన్న బాధ్యతలు కూడా అప్పజెప్పారు. అదిలాబాద్, నిజామాబాద్ ఎమ్మెల్యేలకు నాందేడ్‌తో పాటు తెలంగాణకు ఆనుకొని ఉన్న మహారాష్ట్ర ప్రాంతాలకు ఇంఛార్జ్‌లుగా నియమించారు. అదే సమయంలో వచ్చిన మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పోటీ చేసింది. నాగపూర్ డివిజన్‌లో భండారా, విదర్భ, షోలాపూర్ వంటి ప్రాంతాల్లో కొన్ని పంచాయతీల్లో బోణీ కొట్టి ఉనికి చాటుకుంది.రెండువందలకు పైగా వార్డులు, సర్పంచులను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. నాగ్‌పూర్ డివిజన్‌లోని భండారా జిల్లాలో అత్యధికంగా 20, విదర్భ, షోలాపూర్‌లోని 15 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ గెలుపొందింది. ఆ తర్వాత మహారాష్ట్రలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా చేపట్టారు. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ నియోజకవర్గాలలో దాదాపు 20 లక్షల మంది బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారు. నాగ్‌పూర్ లో పార్టీ కార్యాలయాన్ని సైతం ప్రారంభించారు. అన్ని జిల్లాల్లో పార్టీకి సొంత భవనాల్లో కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆ హడావుడి, ఆర్భాటం చూసి మహారాష్ట్ర రాజకీయాలలో బీఆర్ఎస్ అత్యంత కీలకం కాబోతున్నదని అంతా ఊహించారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోయిన కానీ ప్రధాన పార్టీలకు ఎంతో కొంత పోటీ ఇస్తుందని అంతా భావించారు.

మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది.ఈ నేపథ్యంలో.. బీఆర్ఎస్ పార్టీ గురించి చర్చ జరుగుతోంది. మహారాష్ట్ర ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీచేస్తుందా? లేదా అనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. గతంలో హడావుడి చేసిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు ఎవరికైనా మద్దతిస్తుందా... లేక తెలంగాణ బోర్డర్‌లో ఉన్న నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందా... అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కానీ బీఆర్ఎస్ పార్టీ వైపు నుంచి మాత్రం ఎలాంటి సమాధానం రావడం లేదు. ఈ నేపథ్యంలో దేశరాజకీయాల్లో బీఆర్ఆర్ పార్టీ నాటి, నేటి పరిస్థితులపై విశ్వంభర దినపత్రిక ప్రత్యేక కథనం..

## మహారాష్ట్రపై ప్రధానంగా ఫోకస్..




### మహారాష్ట్రలో స్తంభించిన కార్యాకలాపాలు..

తెలంగాణ అసెంబ్లీ, పార్లమెంటులో ఓటములతో కేసీఆర్ దాదాపుగా అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు. మహారాష్ట్రలో పార్టీ కార్యక్రమాలు స్తంభించాయి. దీంతో మహారాష్ట్రలో పార్టీ పూర్తిగా బలహీనపడింది. మహారాష్ట్ర వైపు చూడటమే కేసీఆర్ బంద్ చేశారు. పర్యటనలు లేవు... భేటీలు లేకపోవడంతో అసలు పార్టీ ఉందా? లేదా? అనే పరిస్థితి నెలకొంది. దీంతో మహారాష్ట్ర కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మాణిక్‌రావు కదం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఎన్సీపీలో చేరారు.బీడ్ జిల్లా ఇంఛార్జిగా పనిచేసిన దిలీప్ గోరె వంటి నాయకులు, వారి అనుచరులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బయటకు వచ్చేశారు. ఫలితంగా ఆ రాష్ట్రంలో పార్టీకి పెద్ది దిక్కు లేకుండా పోయింది.

# మహారాష్ట్రలో 'గులాబీ పార్టీ' గుడారం ఎత్తేసినట్లేనా?

### నైరాశ్యంలో మహారాష్ట్ర బీఆర్ఎస్ కేడర్..

కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది.ఈసారి మహారాష్ట్రలో పోటీ చేస్తారా అనే చర్చ జరుగుతోంది.పార్టీలో ఉన్న నేతలకు కనీసం కేసీఆర్ దర్శన భాగ్యం కూడా కలగని పరిస్థితి ఉంది. దీంతో ఇప్పుడు పార్టీలో ఉన్న మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలకు మహారాష్ట్ర సిద్ధమవుతోన్న తరుణంలో అక్కడ పోటీపై గులాబీ అధిష్టానం మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. దీంతో పార్టీ కేడర్ డైలమాలో పడిరది.దీనికి తోడు పార్టీ అధినేత కేసీఆర్ సైతం మహారాష్ట్ర నేతలతో భేటీకి దూరంగా ఉన్నారు. మహారాష్ట్రలో పార్టీ విస్తరణలో భాగంగానే అప్పట్లో ఆ రాష్ట్రంలో తాత్కాలికంగా స్టీరింగ్ కమిటీ వేశారు. పార్టీ ఇన్ చార్జిగా కల్వకుంట్ల వంశీధర్ రావుకు బాధ్యతలు అప్పగించారు. డివిజన్లకు ఇన్ చార్జులను నియమించారు. అయితే తెలంగాణలో ఓటమితో పార్టీ నేతలకు వంశీధర్ రావు అందుబాటులోకి రావడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని మహారాష్ట్ర నేతలు ఆరోపిస్తున్నారు. అన్నిపార్టీలు యాక్టీవ్ గా ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉంటే, బీఆర్ఎస్ కేడర్ మాత్రం నైరాశ్యంలో పడిపోయింది.






### రెండు పర్యాయాలు టీఆర్ఎస్‌కు పట్టం..

కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన టీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం సుదీర్ఘ పోరాటం చేసింది. ఉద్యమ పార్టీగా టీఆర్ఎస్ రాజకీయాలకు అతీతంగా తెలంగాణకు అనుకూలంగా అందరి మద్దతూ పొందింది. టీఆర్ఎస్ ఉద్యమాల కారణంగానో.. అప్పటికి కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాజకీయ అనివార్యత వల్లో తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. తెలంగాణ సాధించిన పార్టీగా తెలంగాణ ప్రజలు టీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా చెప్పుకున్న కాంగ్రెస్ కంటే.. కోట్లాడి తెలంగాణ సాధించాను అన్న కేసీఆర్ మాటనే ప్రజలు విశ్వసించారు. ఉద్యమ పార్టీగా జనం టీఆర్ఎస్‌ను గుండెల్లో పెట్టుకున్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది కాలానికే టీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. టీఆర్ఎస్ ఉద్యమ కార్యాచరణ ముగిసిందని, ఇక తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీ అని ప్రకటించారు. సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కలను సుసాధ్యం చేసిన నాటి టీఆర్ఎస్‌కు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత వరుసగా రెండు సార్లు టీఆర్ఎస్‌కే పట్టం కట్టారు. తెలంగాణలో వరుసగా 2014, 2018లో అధికారంలోకి వచ్చింది.

### కేంద్రంలో చక్రం తిప్పాలని కలలుకన్న కేసీఆర్...

పదేళ్ల పదవీ కాలంలో తమ ప్రాబల్యాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలని, కేంద్రంలో చక్రం తిప్పాలని కేసీఆర్ కలలు కన్నారు. 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి భారత రాష్ట్ర సమితిగా పార్టీగా పేరు మార్చారు.'అబ్ కీ బార్ కిసాన్ కి సర్కార్' నినాదంతో దేశంలో బీఆర్ఎస్ పార్టీని విస్తరిస్తున్నట్లు 2022 డిసెంబర్ 9న పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. రైతు చట్టాలపై పంజాబ్, హర్యానా రైతులు చేపట్టిన ఉద్యమంలో మృతి చెందిన వారికి ఆర్థిక సాయం అందజేశారు. కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిషా, ఏపీ, కర్ణాటక, యూపీలో పార్టీ విస్తరణకు చర్యలు చేపట్టారు. జాతీయ స్థాయిలో సత్తా చాటాలని బీజేపీ, కాంగ్రెసేతర కూటమి ఏర్పాటు చేసేందుకు పార్టీ అధ్యక్షుడు, కె.చంద్రశేఖర్ రావు వివిధ రాష్ట్రాల్లో పర్యటించారు. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిస్సా, బీహార్ రాష్ట్రాలలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ పర్యటించి అక్కడ కూడా పార్టీ శాఖలను ఏర్పాటు చేశారు.



### ఎంఆర్ఎస్‌గా మారనున్న బీఆర్ఎస్

కేసీఆర్ నుంచి ఉలుకూ పలుకూ లేకపోవడంతో ఈ తరుణంలో నేతలంతా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడంతో పాటు ప్రత్యేక ఫ్రంట్ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే కూటమి కార్యచరణ ప్రకటించబోతున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలు తమ రాష్ట్రంలో బీఆర్ఎస్ పేరును ఎమ్ఆర్ఎస్ గా మార్చుకోవాలని నిర్ణయానికి వచ్చేశారు. మహారాష్ట్ర రాజ్య సమితిగా భారత రాష్ట్ర సమితి పేరు మార్పునకు వారు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### తెలంగాణ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఎదురుదెబ్బ..

అన్ని సిద్ధం చేసుకుని ఎన్నికల రంగంలోకి దూకి జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని అనుకున్న సమయంలోనే తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలైంది. 2023 ఆఖరులో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో వంద స్థానాల నుంచి 39 స్థానాలకు పడిపోయి అధికారాన్ని కోల్పోయింది. దీంతో ఒక్కసారిగా గులాబీ బాస్ నైరాశ్యానికి గురయ్యారు. ఈ సమయంలో ఎర్రవెల్లిలోని ఫామ్ హౌజ్ కే పరిమితం అయ్యారు. తెలంగాణలో బీఆర్ఎస్ దెబ్బతినడంతో కేసిఆర్ వ్యూహాలు తలకిందులయ్యాయి. తెలంగాణ అసెంబ్లీ బీఆర్ఎస్ ఓటమి తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఏ రాష్ట్రంలో కూడా పోటీ చేయలేదు.మహారాష్ట్రలో పోటీ చేస్తామని ప్రకటించినప్పటికీ వెనుకంజ వేశారు. కేవలం తెలంగాణపైనే ఫోకస్ పెట్టినప్పటికీ ఒక్కసీటు కూడా గెలుచుకోలేకపోయారు. ఎక్కువ సెగ్మెంట్లలో మూడో స్థానానికే పరిమితం అయ్యారు. దీంతో బీఆర్ఎస్ బాస్ డైలమాలో పడ్డారు.



### మూడో కూటమి ఏర్పాటుకు సన్నద్ధం..

మహారాష్ట్రలో బీజేపీ, ఎన్సీపీ-శివసేన కూటములకు ప్రత్యామ్నాయంగా ఆ రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతీయ పార్టీలు 'పరివర్తన్ మహాశక్తి' పేరుతో మూడో కూటమి ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నాయి. పోటీపై, పొత్తులపై కేసీఆర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని,దీంతో రాష్ట్రంలోని పార్టీ నేతల ఏకాభిప్రాయంతోనే ఫ్రంట్ ప్రయత్నాలు చేస్తున్నామని బీఆర్ఎస్ నేత శంకరన్న దోండ్గే తెలిపారు.మహారాష్ట్ర పరివర్తన్ ఫ్రంట్, రైతు సంఘాల మద్దతుతో మహారాష్ట్ర ఎన్నికలలో కనీసం 80 స్థానాలలో అభ్యర్థులను నిలబెట్టాలని భావిస్తున్నారు. సోలాపూర్, ఔరంగాబాద్, లాథూర్, హుమ్నాబాద్, బీవండి, నాందేడ్, గాడ్చిరోలి, నాగ్ పూర్, థానే, నాసిక్, కల్యాణ్, బీడ్, పర్భాణి, సాంగ్లి, నాసిక్ ఇలా 15కు పైగా నియోజకవర్గాల్లో తెలుగువారు ఎక్కువగా ఉండటంతో ఇది వారికి కలిసివచ్చే అంశం.

### మహారాష్ట్రలో పోటీ చేసే అవకాశం లేదు..

మహారాష్ట్రలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన కూడా చేసే పరిస్థితి బీఆర్ఎస్‌కు లేదంటున్నారు రాజకీయ విశ్లేషకులు. తెలంగాణలో పవర్ లో ఉన్నప్పుడు పార్టీ నేతలు ఉత్సాహంతో ఆయా రాష్ట్రాల పర్యటలకు వెళ్లినా.. అధికారం కోల్పోవడంతో ఇప్పుడు పార్టీ విస్తరణకు ఫుల్ స్టాప్ పడినట్లు కనిపిస్తున్నది.దేశ రాజధానిలో బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయాన్ని 2023 మే 4న కేసీఆర్ ప్రారంభించారు. హర్యానా కురుక్షేత్రకు చెందిన గుర్నామ్ సింగ్ చడూని పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా నియమించారు.అయితే, ఆయన ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికల్లో పెహోవా సెగ్మెంట్ నుంచి పోటీ చేశారు. ఆయనకు వచ్చిన ఓట్లు 1170 ఓట్లు మాత్రమే. దీనిని దృష్టిలో ఉంచుకొని కేసీఆర్ కు ప్రజల్లో ఆదరణ తగ్గిందనే చర్చ జోరుగా సాగుతున్నది. మహారాష్ట్ర ఎన్నికల్లోనూ పోటీచేస్తే ఇవే ఫలితాలు వచ్చే ప్రమాదముందని భావించి పోటీకి దూరంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు సైతం పోటీపై నోరుమెదపడం లేదు. కేవలం తెలంగాణ అంశాలు, ప్రభుత్వ వైఫల్యాలపైనే ఫోకస్ పెట్టి విమర్శలు చేస్తున్నారు.అయితే, రాజకీయ వర్గాల్లో మాత్రం మహారాష్ట్రలో 'గులాబీ పార్టీ' గుడారం ఎత్తేసినట్లుగా చెబుతున్నారు. ఏదిఏమైనా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది మాత్రం రాజకీయ వర్గాల్లో హాట్ టాఫిక్ గా మారింది.

### అంతర్ రాష్ట్ర రాజకీయాలకు దూరం.

జాతీయస్థాయిలో ఎదగడం కోసమే పేరు మార్చుకున్న బీఆర్ఎస్ పార్టీకి అసెంబ్లీ, పార్లమెంటు ఫలితాల తర్వాత పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. సొంత రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో రాజకీయాల్లో చక్రం తిప్పాలని, కాంగ్రెస్, బీజేపీయేతర తృతీయ కూటమి కట్టాలని, జాతీయ పార్టీగా వెలుగు వెలగాలని ఆశించిన బీఆర్ఎస్‌కు.. ఆ పార్టీ నేత కేసీఆర్ కలలు కల్లలయ్యాయి . దీంతో అంతర్ రాష్ట్ర రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తుంది. అంతేగాకుండా బీఆర్ఎస్ కు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు సంకటంగా మారాయి. దీంతో దేశవ్యాప్తంగా విస్తరిస్తామని కేసీఆర్ ప్రకటించినప్పటికీ.. కేసీఆర్ ఇతర రాష్ట్రాల్లో రాజకీయాలపై దృష్టి పెట్టడం తాత్కాలికంగా ఆపివేసినట్లు చర్చ జరుగుతోంది. అందుకే ఇతర రాష్ట్రాల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. అసలు పార్టీ నేతలతోనే చర్చించేందుకు సుముఖంగా లేరు.

### ఎన్సీపీలో విలీనం అవుతుందనే ప్రచారం..

తెలంగాణలో ఓటమితో మహారాష్ట్రలో పార్టీ విస్తరణపై కేసీఆర్ దృష్టి సారించకపోవడంతో ఇటీవల నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌పీ) లో బీఆర్ఎస్ మహారాష్ట్ర యూనిట్ విలీనం అవుతుందనే ప్రచారం జరిగింది. పుణెలో బీఆర్ఎస్ మహారాష్ట్ర నేత బాలాసాహెబ్ దేశ్‌ముఖ్, శరద్ పవార్ భేటీ అయ్యారని, విలీనం చేస్తున్నట్లు ప్రకటించినట్లు ప్రచారం జరిగింది. ఈ నెల 6న అధికారికంగా విలీనం జరుగుతుందనుకున్నారు. అయితే ఈ ప్రచారాన్ని పార్టీ రాష్ట్ర సమన్వయకర్త శంకరన్న దోండ్గే ఖండించారు. బీఆర్ఎస్ (మహారాష్ట్ర) ఏ పార్టీలో విలీనం కాదని వెల్లడించారు.

### స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి..

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి నుంచి బయటపడేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నది. రాబోయే స్థానిక, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటి మళ్లీ కేడర్ లో జోష్ నింపాలని భావిస్తున్నది. అందుకే అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నది. అందులో భాగంగానే ప్రభుత్వం చేసే ప్రతి వైఫల్యాన్ని సోషల్ మీడియా, మీడియా వేదికగా ఎండగడుతున్నది. ప్రజల్లోకి వెళ్లి పార్టీపై సానుకూలత పెరిగేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందుకే ఇతర రాష్ట్రాలపై ఫోకస్ పెట్టలేదని పార్టీ వర్గాల సమాచారం. కేసీఆర్ సైతం రాష్ట్రంలోనే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని నేతలకు హింట్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

### తెలంగాణలో నిలదొక్కుకునే ప్రయత్నం..

తెలంగాణ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బొక్కా బోర్ల పడిన బీఆర్ఎస్.. ఇక్కడే తిరిగి నిలదొక్కుకునే పనిపై ఎక్కువగా దృష్టి పెడుతున్నట్లు కనిపిస్తోంది. పది నెలల కిందట అధికారాన్ని కోల్పోయిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తిరిగి పుంజుకునేందుకు క్షేత్ర స్థాయిలో చేయని ప్రయత్నమంటూ లేదు. తెలంగాణలో కాంగ్రెస్ సారథ్యంలోని ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతూ.. మీడియా వేదికగా హడావిడి చేస్తూనే ఉంది. ఆ పార్టీ నాయకులు ప్రధానంగా మాజీ మంత్రులు హరీష్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను తూర్పారా పడుతున్నారు.

## క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి పెను ముప్పు: శక్తికాంత దాస్



**ముంబయి:** క్రిప్టో కరెన్సీపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తంచేశారు. క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి పెను ముప్పు ఉందన్నారు. 'పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్' థింక్ ట్యాంక్‌కు హాజరైన ఆయన క్రిప్టోల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిప్టోలతో ద్రవ్య లభ్యత, ఆర్థిక స్థిరత్వానికి భారీ ప్రమాదం పొంచిఉందని దాస్ అన్నారు. దీనికారణంగా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరాపై కేంద్ర బ్యాంక్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉందన్నారు. క్రిప్టోలు ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యాన్ని చెలాయించకూడదని తాను అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు. అందుకే క్రిప్టోను ప్రమాదకరంగా భావిస్తున్నట్లు ఆయన వివరించారు. క్రిప్టోతో కలిగే భారీ నష్టాలను దృష్టిలోఉంచుకొని ఈ సమస్యపై అంతర్జాతీయ అవగాహన ఉండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లకు ఇది ప్రధాన ఆందోళన అని దాస్ తెలిపారు.

క్రిప్టో కరెన్సీల గురించి ప్రశ్నల్ని లేవనెత్తిన మొదటి దేశం భారత్ అని దాస్ పేర్కొన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో క్రిప్టోపై ఎలా వ్యవహరించాలనే అంశంపై అంతర్జాతీయ అవగాహనను పెంపొందించేందుకు ఒప్పందం జరిగిందని గుర్తుకుతెచ్చారు. క్రిప్టోపై ఆందోళన వ్యక్తంచేసిన మొదటి సెంట్రల్ బ్యాంకుల్లో తమ బ్యాంకు కూడా ఒకటన్నారు. "ఆర్థికవ్యవస్థలో క్రిప్టో ఆధిపత్యం చెలాయిస్తే సెంట్రల్ బ్యాంక్ ద్రవ్య వ్యవస్థపై నియంత్రణ కోల్పోతుంది. ఇది ద్రవ్య వ్యవస్థలో అస్థిరతకు దారితీస్తుంది. అంతేకాదు ఆర్థికరంగంపై ప్రభావం చూపుతుంది" అని ఆయన అన్నారు. అందుకే ఈవిషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

## రేపటి నుంచి విశాఖ-విజయవాడ మధ్య మరో రెండు విమాన సర్వీసులు ప్రారంభించనున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**విశ్వంభర, విశాఖపట్నం:** విశాఖపట్నం నుంచి విజయవాడకు మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఆదివారం నుంచి ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు ఈ సర్వీసులను నడపనున్నాయి. వీటిని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించనున్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం సాయంత్రం 7.15 గంటలకు బయలుదేరి రాత్రి 8.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. అక్కడ విమానం తిరిగి 8.45 గంటలకు బయలుదేరి రాత్రి 9.50 గంటలకు విజయవాడ వస్తుందని అధికారులు తెలిపారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ఉదయం 9.35 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి 10.35 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి రాత్రి 7.55 గంటలకు బయలుదేరి 9 గంటలకు విశాఖపట్నం వెళ్తుంది. ఈ సర్వీస్‌ల రాకతో విజయవాడ-విశాఖ విమాన సర్వీస్‌ల సంఖ్య మూడుకు చేరనుంది.

## టీవీఎస్ నుంచి రైడర్ ఐగో మోటార్ సైకిల్..

### రూ.98,389 నుంచి ధర ప్రారంభం..!



**ఢిల్లీ:** ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ టీవీఎస్ మోటార్స్ తన టీవీఎస్ రైడర్ ఐగో (%ఇూ ఘఅఇవతీ అ+శీ%) మోటారు సైకిల్‌ను భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.98,389 (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభం అవుతుంది. టీవీఎస్ రైడర్ మోటారు సైకిళ్ల విక్రయాలు పది లక్షల మార్కుకు చేరుకున్న నేపథ్యంలో టీవీఎస్ రైడర్ ఐగో మోటారు సైకిల్ తీసుకొచ్చింది. ఆరు మోటారు సైకిళ్ల టీవీఎస్ రైడర్ లైనప్‌లో నాలుగో స్థానంలో నిలుస్తుంది. టీవీఎస్ రైడర్ ఐగో మోటారు సైకిల్ 124.8 సీసీ ఆయిల్ కూల్డ్, ట్రిపుల్ వాల్వ్, సింగిల్ సిలిండర్ ఇంజిన్ తో వస్తుంది. ఈ ఇంజిన్ దాదాపు 7500 ఆర్పీఎం వద్ద 11.2 బీహెచ్పీ విద్యుత్, 6000 ఆర్పీఎం వద్ద 11.7 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. అర్బన్ యూజర్ల కోసం డిజైన్ చేసిన టీవీఎస్ రైడర్ ఐగో 5-స్పీడ్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్ కలిగి ఉంటుంది. ఐగో అసిస్ట్ టెక్నాలజీతో టీవీఎస్ రైడర్ ఐగో మోటారు సైకిల్ వస్తుంది. టీవీఎస్ రైడర్ మోటారు సైకిల్ మాదిరిగానే రైడర్ ఐగో బైక్ లోనూ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్, ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్స్, కమ్యూటర్ స్టైల్ రైడింగ్ పొజిషన్ లో స్ప్లిట్ సీటు ఉంటుంది. అల్లాయ్ వీల్స్ మీద బ్రైట్ రెడ్ పెయింట్, నార్డో గ్రే కలర్ లో మోటారు సైకిల్ వస్తుంది.

టీవీఎస్ రైడర్ ఐగో మోటారు సైకిల్ టీవీఎస్ కనెక్ట్ యాప్ ద్వారా స్మార్ట్ ఎక్స్ కనెక్ట్‌తోపాటు రైడర్ ఐగో మోటారు సైకిల్ యాక్సెస్ చేయొచ్చు. టర్న్ బై టర్న్ నేవిగేషన్, కాల్ హ్యాండ్లింగ్, నోటిఫికేషన్ మేనేజ్ మెంట్‌కు మద్దతుగా రివర్స్ ఎల్‌సీడీ క్లస్టర్ ఉంటుంది. మొబైల్ యాప్ లో వాయిస్ అసిస్ట్ కూడా ఉంటుంది. యాప్ ద్వారా రైడ్ డిటైల్స్, బైక్ ఓవర్ వ్యూ, లైవ్ డాష్ బోర్డ్ తదితర వివరాలు ఉంటాయి. ఫైవ్ స్టెప్ అడ్జస్టబిలిటీతోపాటు గ్యాస్ చార్జిడ్ మోనో షాక్, టెలిస్కోపిక్ ఫ్రంట్ సస్పెన్షన్ ఉంటాయి. 240 ఎంఎం డిస్క్ ఫ్రంట్ బ్రేక్, రేర్ డ్రమ్ బ్రేక్ ఉంటాయి.

## వైవీ సుబ్బారెడ్డి జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి

## నా బిడ్డలకు అన్యాయం చేయాలని ఎలా అనిపించింది?

### ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల



**విశ్వంభర, విజయవాడ:** వైవీ సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సుబ్బారెడ్డి వ్యాఖ్యపై స్పందించారు. "నా బిడ్డలు కూడా మీ కళ్ల ముందే పెరిగారు.. వారికి అన్యాయం చేయాలని ఎలా అనిపించింది. అన్ని విషయాలు తెలిసి కూడా బాబాయి ఎందుకిలా మాట్లాడుతున్నారు" అని కన్నీటి పర్యంతమయ్యారు.

**ఆమె ఎందుకు జైలుకు వెళ్లలేదు?**

"జగన్ పదవులు ఇస్తే సుబ్బారెడ్డి అనుభవిస్తున్నారు.. ఆయన అలా మాట్లాడకపోతే ఇంకెలా మాట్లాడుతారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు ఆర్థికంగా లాభపడ్డారు. సుబ్బారెడ్డే కాదు.. సాయిరెడ్డి కూడా అలాగే మాట్లాడొచ్చు. ఎందుకంటే ఆయన కూడా వాళ్ల టీమ్‌లోనే ఉన్నారు. జగన్ పక్కన వాళ్లు ఉన్నారని తెలిసి కూడా నిన్న రాసిన లేఖలో వాళ్ల పేర్లు ప్రస్తావించాను. నేను చెబుతున్నది నిజమని ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి చెబుతున్నది కూడా నిజమని ఆయన ప్రమాణం చేయగలరా? నలుగురు మనవళ్లకు ఆస్తిలో సమాన వాటా అని రాజశేఖర్‌రెడ్డి బతికుండగానే చెప్పారు. ఇది నిజం.. నా బిడ్డల మీద ప్రమాణం చేసి చెబుతున్నా. ఇది నిజం కాదని.. సుబ్బారెడ్డి, జగన్ ఇద్దరూ వారి బిడ్డలపై ప్రమాణం చేసి చెప్పగలరా? నాకు రావాల్సిన ఆస్తిలో వాటా ఇవ్వకుండా ఏవో చెబితే ఎలా? నా మేలు కోరతానని వైఎస్‌కు జగన్ మాట ఇచ్చారు. సాక్షిలో, భారతి సిమెంట్స్‌లో వాటాలు మావని జగన్ ఎలా చెబుతారు? కంపెనీలకు భారతి, జగతి అని వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. ఆరోజు ఆ పేర్లు పెట్టుకోగలిగారంటే కారణం.. రాజశేఖర్‌రెడ్డి అనుమతిచ్చారు, నేను అడ్డు చెప్పలేదు కాబట్టే. పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ఆస్తులు మొత్తం వారివే అనే రూల్ ఏమైనా ఉందా? ఆస్తులు మొత్తం జగన్‌వే కాబట్టి ఆయన జైలుకు వెళ్లారని సుబ్బారెడ్డి చెబుతున్నారు. భారతి పేరు మీద ఆస్తులు ఉంటే ఆమె ఎందుకు జైలుకు వెళ్లలేదు? ఎవరైనా గిఫ్ట్ ఇస్తే ఎంవోయూ రాసుకుంటారా? మీరు ఎంవోయూ రాశారంటేనే ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అర్థం. దీనికి సుబ్బారెడ్డి సమాధానం చెప్పాలి. కన్నతల్లిపై కేసు వేసిన వ్యక్తి ఈ లోకంలో ఎవరైనా ఉన్నారా? ఇలాంటి గొడవలు అందరి ఇళ్లలో ఉండేవే అని అని సునాయాసంగా మాట్లాడుతున్నారు. మీకు మానవత్వం లేదా? ఎవరో మాట్లాడితే బాధపడేదాన్ని కాదు.. సుబ్బారెడ్డి బాబాయి మాట్లాడే వరకు చాలా బాధపడ్డా. కళ్లలో నీళు తిరిగాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు.

**జగన్ నాయకుడో.. శాడిస్టో నేతలు అర్థం చేసుకోవాలి**

జగన్ కోసం నేను, అమ్మ.. ఎంతో కష్టపడ్డాం. ఐదేళ్లుగా ఎంవోయూ నా దగ్గర ఉన్నా ఒక్క మీడియా హౌస్‌కు వెళ్లలేదు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎంవోయూ వాడుకోలేదు.. ఎక్కడా బయటపెట్టలేదు. వైఎస్ కుటుంబం గురించి చెడ్డగా చెప్పుకొంటారనే ఎంవోయూ గురించి ఎప్పుడూ చెప్పలేదు. జగన్ కోసం రెండు ఎన్నికల్లో పాదయాత్ర చేశా. చెల్లి కోసం ఇది చేశానని జగన్ జన్మలో ఒక్కటైనా చెప్పగలరా? జగన్ బెయిల్ రద్దవుతుంది కాబట్టి కోర్టులో కేసు వేశామని చెబుతున్నారు. తనకి లాభం జరుగుతుంది అంటే తల్లిని కోర్టుకు ఈడుస్తారా? సొంత కుమారుడే తల్లిని కోర్టుకు లాగడం దారుణం కాదా? రాజశేఖర్‌రెడ్డి పేరు ఎఫ్‌ఐఆర్‌లో లేకపోతే.. కేసు నుంచి జగన్ బయటపడటం అసాధ్యమని భావించి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మూడు కోర్టుల చుట్టూ తిరిగి రాజశేఖర్‌రెడ్డి పేరును సీబీఐ ఎఫ్‌ఐఆర్‌లో చేర్పించారు.

## ఎస్‌బీఐతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్న సోలెక్స్ ఎనర్జీ



**ముంబయి:** వాణిజ్య, పారిశ్రామిక, సంస్థాగత కస్టమర్లకు సోలార్ ఫైనాన్సింగ్ ఎంపికలను అందించడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు 'సోలెక్స్ ఎనర్జీ' ఈ రోజు(శనివారం) తెలిపింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా, ఎస్‌బీఐ..భారత్ అంతటా తన 'సూర్య శక్తి సోలార్ ఫైనాన్స్ పథకం' కింద సోలార్ ప్రాజెక్టుల కోసం రూ.10 కోట్ల వరకు సోలార్ ఫైనాన్సింగ్‌ను అందించనుందని 'సోలెక్స్ ఎనర్జీ' ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సర్వీసులో భాగంగా 'సోలెక్స్ ఎనర్జీ' కస్టమర్లకు ఎండ్-టు-ఎండ్ సపోర్ట్ ఇస్తుంది. సైట్ ఎంపిక, డిజైన్ నుంచి రెగ్యులేటరీ అనుమతులు పొందడం వరకు సేవలను అందిస్తుంది. ఎస్‌బీఐ..సోలార్ ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ కోసం అవాంతరాలు లేని రుణ దరఖాస్తు ప్రక్రియను నిర్ధారించే డిజిటల్ ప్లాట్‌ఫాంను అందుబాటులోకి తెస్తుంది. సూరత్‌లో ఉన్న సోలెక్స్ ఎనర్జీ తన సోలార్ మాడ్యూల్ తయారీ సామర్థ్యాన్ని 700 మెగావాట్ల నుంచి 1.50 గిగావాట్లకు విస్తరించే ప్రక్రియలో ఉంది. వాణిజ్య, నివాస సౌర ప్రాజెక్టులకు ఫైనాన్స్ సౌకర్యాలను అందించడానికి వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు సోలార్ కంపెనీలతో కలిసి పనిచేస్తున్నాయి. ఆగస్టులో, టాటా పవర్ సోలార్ సిస్టమ్స్ లిమిటెడ్ వ్యక్తిగత, కార్పొరేట్ వినియోగదారులకు సోలార్ యూనిట్ల కోసం ఆర్థిక సహాయం అందించడానికి ఐసీఐసీఐ బ్యాంకుతో ఒక ఒప్పందంపై సంతకం చేసింది.

## జియో భారత్ ఫోన్లపై ఆఫర్..

### రూ.999 నుంచి రూ.699కి తగ్గింపు!




**ఢిల్లీ:** దీపావళి సందర్భంగా రిలయన్స్ జియో మరో సరికొత్త ఆఫర్‌తో ముందుకొచ్చింది. జియో భారత్ దీపావళి ధమాకా ఆఫర్ కింద జియో భారత్ 4జీ ఫోన్ల ధరలను తగ్గించింది. ఇప్పటి వరకు ఈ ఫోన్ల ధరలు రూ.999గా ఉండగా.. ఆఫర్‌లో భాగంగా రూ.699కే కొనుగోలు చేయొచ్చని జియో ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఆఫర్ పరిమితకాలం మాత్రమే ఉంటుంది.

ఇతర కంపెనీల నెలవారీ రీఛార్జి ప్లాన్లతో (రూ.199) పోలిస్తే జియో భారత్ ఫీచర్ ఫోన్ ప్లాన్లు చౌకగా లభిస్తాయని జియో తెలిపింది. ఈ ఫోన్లతో నెలకు 40శాతం మేర అంటే నెలకు రూ.76 చొప్పున ఆదా చేసుకోవచ్చని పేర్కొంది. రిలయన్స్ జియో సిమ్‌కార్డుతో మాత్రమే పనిచేసే ఈ ఫోన్లను దగ్గర్లోని రిలయన్స్ స్టోర్‌లో గానీ, జియోమార్ట్ లేదా అమెజాన్ వెబ్‌సైట్‌లో గానీ కొనుగోలు చేయొచ్చని తెలిపింది.

రిలయన్స్ జియో ఇటీవల జియో భారత్ వీ3, వీ4 మోడళ్లను అక్టోబర్ 14న లాంచ్ చేసింది. ఈ ఫోన్లను రూ.1099కి తీసుకొచ్చింది. జియో టీవీ, జియో పే వంటి ఆప్షన్లు వీటిలో ఉన్నాయి. ఇక జియో భారత్ ఫోన్ల నెలవారీ ప్లాన్ రూ.123కే లభిస్తుంది. ఈ ప్లాన్ కింద అపరిమిత కాల్స్, 14జీబీ డేటా, 455 లైవ్ టీవీ ఛానెల్స్ లభిస్తాయి. 2జీ ముక్త్ భారత్ నినాదంతో తీసుకొచ్చిన జియో భారత్ ఫోన్లు.. ఇప్పటికే రూ.1000లోపు కేటగిరీలో 50 శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకున్నట్లు రిలయన్స్ తన వార్షిక నివేదికలో తెలిపింది.

## తిరుమల శ్రీవారి ఆదాయం రూ. 3.78 కోట్లు

**విశ్వంభర, తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. కలియుగ ప్రత్యక్షదైవం, ఆపదమొక్కులవాడు వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 5 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని ఆలయ అధికారులు వివరించారు. శుక్రవారం స్వామివారిని 56,501 మంది భక్తులు దర్శించుకోగా 21,203 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.78 కోట్లు వచ్చిందన్నారు.

## ఆసీస్ టెస్టు సిరీస్‌కు తెలుగు కుర్రాడు..




**చెన్నై:** బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆసీస్‌తో ఐదు టెస్టుల సిరీస్ కోసం టీమ్‌ఇండియా స్క్వాడ్‌ను బీసీసీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డికి చోటు దక్కింది. పేస్ ఆల్‌రౌండర్‌గా కీలకపాత్ర పోషిస్తాడనే ఉద్దేశంతో సెలక్టర్లు అతడి వైపు మొగ్గు చూపారు. ఆసీస్ పిచ్‌లు పేస్‌కు అనుకూలంగా ఉంటాయి. ఫాస్ట్ బౌలర్లు ఉన్నప్పటికీ బ్యాటింగ్ కూడా అత్యంత కీలకమే. గత సిరీస్‌లో శార్దూల్ ఠాకూర్ ఈ పాత్రను పోషించాడు. ఈసారి హార్దిక్ వస్తాడనుకుంటే.. అతడు టెస్టులు ఆడేంత ఫిట్‌నెస్ సాధించలేదని తెలుస్తోంది. పాండ్య కూడా సుదీర్ఘ ఫార్మెట్ ఆడేందుకు పెద్దగా ఆసక్తి లేనట్లుంది. దీంతో మేనేజ్‌మెంట్ నితీశ్‌పై నమ్మకం ఉంచింది. ఈక్రమంలో భారత స్క్వాడ్‌పై క్రికెట్ దిగ్గజం అనిల్ కుంబ్లే విశ్లేషించాడు. అతడితోపాటు కివీస్ మాజీ క్రికెటర్ సైమన్ డౌల్ కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశాడు. న్యూజిలాండ్‌తో రెండో టెస్టు సందర్భంగా వీరిద్దరూ కామెంటేటర్లుగా వ్యవహరిస్తున్నారు.

"నితీశ్‌కుమార్ ఎంపిక ఆశ్చర్యం కలిగించింది. అతడు పెద్దగా ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడినట్లు కూడా లేదు. అతడి గణాంకాల గురించి మాట్లాడేందుకు ఏమీలేదు. అయితే, నితీశ్‌కు మంచి టాలెంట్ ఉంది. పేస్‌ను వేయగలడు. నాణ్యమైన బ్యాటర్. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తీవ్ర ఒత్తిడి ఉంటుంది. అలాంటి సమయంలో పరిణితితో ఆడాడు. అందుకేనేమో భారత సెలక్టర్లు నితీశ్ వైపు మొగ్గుచూపి ఉండొచ్చు" అని కుంబ్లే వెల్లడించాడు.

**శార్దూల్ స్థానంలో..** "గత పర్యటనలో శార్దూల్ ఠాకూర్ మంచి ప్రదర్శన ఇచ్చాడు. ఇప్పుడు అతడి స్థానాన్ని నితీశ్‌కుమార్‌తో భర్తీ చేయనుంది. ఆసీస్‌లో కనీసం 15 ఓవర్లు బౌలింగ్ చేయడంతోపాటు 7 లేదా 8వ స్థానంలో విలువైన పరుగులు చేయాల్సి ఉంటుంది. అప్పుడే వచ్చిన అవకాశానికి న్యాయం చేసినట్లు అవుతుంది. భారత స్క్వాడ్ ఎంపిక బాగుంది" అని సైమన్ డౌల్ తెలిపాడు. నితీశ్ ఇప్పటివరకు 21 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 708 పరుగులు చేశాడు. బౌలింగ్‌లోనూ 55 వికెట్లు పడగొట్టాడు. అంతర్జాతీయ టీ20ల్లోకి ఇటీవలే అడుగుపెట్టిన నితీశ్ 90 పరుగులు చేసి.. మూడు వికెట్లు తీశాడు.

## వ్యూహం మనది.. గెలుపు కివీస్‌ది..

### సిరీస్ పోవడానికి కారణాలివే..?



సొంతగడ్డపై భారత జట్టు 12 ఏండ్ల జైత్రయాత్రకు న్యూజిలాండ్ చెక్ పెట్టింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో వరుసగా 18 సిరీస్ విజయాలతో రికార్డు సృష్టించిన టీమిండియా కు కివీస్ ఊహించని షాకిచ్చింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. వ్యూహం మనోళ్లు పన్నితే విజయం మాత్రం ప్రత్యర్థికి సొంతమైంది. స్వదేశంలో బలమైన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలను ఓడించిన భారత్‌ను న్యూజిలాండ్ ఇప్పట్లో కోలుకోలేని విధంగా గట్టి దెబ్బ కొట్టింది. టర్నింగ్ పిచ్ మీద ఎలా ఆడాలో చూపిస్తూ.. టీమిండియాపై 113 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. బౌలర్లు రాణించినప్పటికీ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రిషభ్ పంత్‌ల వైఫల్యం జట్టు కొంపముంచింది. ప్రత్యర్థి పన్నిన వలలో పడిన రోహిత్ సేన చెత్త ఆటతో తీవ్రంగా నిరాశపరిచింది. బెంగళూరులో ఓటమినే ఇంకా మర్చిపోని అభిమానులను ఇప్పుడు పుణేలో దారుణ పరాభవం మరింత కుంగదీస్తోంది.

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు కాన్పూర్‌లో బజ్‌బాల్‌ను తలదన్నే ఆటతో బంగ్లాదేశ్‌ను ఓడించిన భారత జట్టు భీకర ఫామ్‌లో ఉంది. కివీస్ ఏమో శ్రీలంక చేతిలో వైట్‌వాష్‌కు గురైన బాధతో టీమిండియాకు వచ్చింది. కానీ, రెండు వారాల్లోనే అంతా తలకిందులైంది. భారత జట్టుపై సంపూర్ణ ఆధిపత్యంతో కివీస్ సిరీస్ కైవసం చేసుకుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో పిచ్‌ను సరిగా అంచనా వేయని రోహిత్ శర్మ భారీ మూల్యమే చెల్లించుకున్నాడు. మ్యాట్ హెన్రీ(5/15), విలియం ఓ రూర్కీ(4/22) నిప్పులు చెరగడంతో ఐదుగురు డకౌట్ అయ్యారు.

**అద్భుతంగా ఆడినా..** వరల్డ్ క్లాస్ బ్యాటర్లు అయిన రోహిత్ శర్మ, కోహ్లీలు సైతం కొత్త కుర్రాళ్లలా వికెట్ పారేసుకోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో సర్ఫరాజ్ ఖాన్(150), రిషభ్ పంత్(93), కోహ్లీ(70) అద్భుతంగా ఆడినా సరే కివీస్ బౌలర్లు పట్టువిడువకుండా అదిరే విజయాన్ని అందించారు.

దాంతో.. సిరీస్ సమం చేయాలంటే స్పిన్ పిచ్ ఒక్కటే మార్గమని పుణేలో టర్నింగ్ పిచ్ సిద్ధం చేసుకున్న టీమిండియాకు మళ్లీ ఓటమే ఎదురైంది. వాషింగ్టన్ సుందర్ (7/59) తిప్పేయడంతో తొలి రోజు ప్రత్యర్థిని 259కే కట్టడి చేసిన రోహిత్ సేన.. అనంతరం 156 పరుగులకే చాప చుట్టేసింది. రోహిత్ శర్మ రెండో ఓవర్లోనే డకౌట్ కాగా.. అనుభవజ్ఞుడైన కోహ్లీ ఫుల్‌టాస్ ఆడలేక సాంట్నర్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు.

### స్పిన్‌కు సమాధానం చెప్పలేక

ఇక మిడిలార్డర్‌లో పంత్, సర్ఫరాజ్‌లు ఈసారి సాంట్నర్ స్పిన్‌కు సమాధానం చెప్పలేకపోయారు. కానీ.. మనోళ్లు పరుగులు చేసేందుకు అష్టకష్టలు పడ్డ చోట కివీస్ కెప్టెన్ టామ్ లాథమ్(86) ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు. స్వీప్ షాట్లే ఆయుధంగా అశ్విన్, సుందర్‌లను దీటుగా ఎదుర్కొన్నాడు. ఆ తర్వాత వచ్చిన బ్లండెల్(41), ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్(48 నాటౌట్)లు అవలీలగా రన్స్ సాధించారు. దాంతో, రెండో ఇన్నింగ్స్‌లో లాథమ్ బృందం 255 పరుగులకు ఆలౌటయ్యింది.

ప్రత్యర్థి నిర్దేశించిన 359 పరుగుల ఛేదనలో మళ్లీ అదే తడబాటుతో భారత ఆటగాళ్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. యశస్వీ జైస్వాల్(77) అర్ధ శతకంతో పోరాడినా.. కోహ్లీ, సర్ఫరాజ్ సాంట్నర్(6/104)పై పైచేయి సాధించలేక వికెట్ ఇచ్చేశారు. 166 పరుగులకే ఏడు వికెట్లు పడడంతో ఓటమి ఖరారైపోయింది. కాకపోతే జడేజా(42) కాసేపు ప్రతిఘటించి ఫలితాన్ని ఆలస్యం చేశాడంతే.

### అటాకింగ్ గేమ్ ఆడి ఉంటే..

అలాకాకుండా.. టాపార్డర్‌లో రోహిత్ శర్మ అటాకింగ్ గేమ్ ఆడి శుభారంభం ఇచ్చి ఉంటే.. మిడిలార్డర్‌లో కోహ్లీ భారీ స్కోర్ చేసి ఉంటే ఈరోజు పుణేలో టీమిండియా జయకేతనం ఎగురవేసేది. కానీ.. ఒత్తిడికి లోనైన భారత బ్యాటర్లు కివీస్ స్పిన్‌కు దాసోహమై సిరీస్ ఓటమికి బాధ్యులయ్యారు. ఈ రెండు ఓటములతోనైనా టీమిండియా బ్యాటర్లు పాఠాలు నేర్వాలి. లేదంటే నవంబర్‌లో ఆస్ట్రేలియాతో జరుగబోయే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో హ్యాట్రిక్ విజయం అసాధ్యమే కానుంది.

### భారత్ అగ్రస్థానంలోనే..

పిచ్ ఎలాంటిదైనా సరే మేము చెలరేగగలం అని చాటుతూ పుష్కర కాలంలో ఏ జట్టుకు సాధ్యంకాని విధంగా న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌ను తన్నుకుపోయింది. చిన్నస్వామి స్టేడియంలో పేస్‌తో.. పుణేలో స్పిన్‌తో భారత్ బ్యాటర్లకు కళ్లెం వేసిన న్యూజిలాండ్ చిరస్మరణీయ విజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలిచింది. వరుసగా రెండో గెలుపుతో డబ్ల్యూటీసీ పట్టికలో నాలుగో స్థానానికి ఎగబాకింది. ఇప్పటికైతే భారత్ అగ్రస్థానంలోనే ఉన్నప్పటికీ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఫలితంపై.. ఇతర జట్ల ప్రదర్శనపై ఫైనల్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

## రెండో టెస్టులో భారత్ ఓటమి..

### చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్



**పుణె:** టెస్టుల్లో సొంతగడ్డపై తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తున్న టీమ్‌ఇండియాకు న్యూజిలాండ్ షాక్ ఇచ్చింది. పుణె వేదికగా జరిగిన రెండో టెస్టులో భారత్‌పై కివీస్ 113 పరుగుల తేడాతో విజయం సాధించింది. 359 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు.. 245 పరుగులకు ఆలౌటైంది. భారత బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ (77) రాణించగా.. మిగతావారు భారీ స్కోర్లు చేయలేకపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లతో చెలరేగిన మిచెల్ శాంట్నర్.. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో అదరగొట్టాడు. ఈ మ్యాచ్‌లో గెలుపుతో మూడు టెస్టుల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-0తో కైవసం చేసుకొని చరిత్ర సృష్టించింది. భారత గడ్డపై న్యూజిలాండ్ టెస్టు సిరీస్ గెలవడం ఇదే తొలిసారి. అంతేకాకుండా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చరిత్రలో విదేశీ గడ్డపై కివీస్ టెస్టు సిరీస్ గెలవడం ఇదే మొదటిసారి. 2012 నుంచి స్వదేశంలో వరుసగా 18 టెస్టు సిరీస్‌లు సాధించిన టీమ్‌ఇండియా.. పుష్కరకాలం తర్వాత సిరీస్‌ను కోల్పోవడం గమనార్హం. మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబయి వేదికగా ప్రారంభంకానుంది.

రెండో ఇన్నింగ్స్‌లో 198/5 స్కోరుతో మూడో రోజు ఆటను ప్రారంభించిన న్యూజిలాండ్ 255 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలో తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 103 పరుగుల ఆధిక్యాన్ని కలుపుకొని భారత్‌కు 359 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన టీమ్‌ఇండియా 34 పరుగుల వద్ద రోహిత్ శర్మ (8) రూపంలో తొలి వికెట్ కోల్పోయింది. శుభ్‌మన్ గిల్ (23)తో కలిసి జైస్వాల్ నిలకడగా ఆడటంతో భోజన విరామ సమయానికి భారత్ 81/1 స్కోరుతో మెరుగైన స్థితిలో కనిపించింది. కానీ, రెండో సెషన్‌లో ఆరు వికెట్లు కోల్పోవడంతో భారత్ ఓటమి అక్కడే ఖాయమైపోయింది. న్యూజిలాండ్ స్పిన్నర్ మిచెల్ శాంట్నర్.. యశస్వి జైస్వాల్, గిల్, విరాట్ కోహ్లీ (17), సర్ఫరాజ్ ఖాన్ (9)లను ఔట్ భారత్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. రిషభ్ పంత్ (0) అనవసరంగా రనౌటయ్యాడు. చివర్లో రవీంద్ర జడేజా (42) పోరాడినా ఫలితం లేకపోయింది.

**స్కోర్లు: న్యూజిలాండ్..**
**తొలి ఇన్నింగ్స్.. 259 ఆలౌట్**
**రెండో ఇన్నింగ్స్.. 255 ఆలౌట్**
**భారత్.. ఫస్ట్ ఇన్నింగ్స్.. 156 ఆలౌట్**

## 92 ఏళ్ల చరిత్రలో.. తొలి భారత బ్యాటర్‌గా యశస్వి జైస్వాల్



**పుణె:** న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్టులో టీమ్‌ఇండియా 113 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 359 పరుగుల లక్ష్యఛేదనలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (77బీ 65 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే అర్ధ శతకం బాదాడు. మిగతా ఆటగాళ్లు రాణించలేదు. దీంతో భారత్ 245 పరుగులకు ఆలౌటైంది. ఈ ఇన్నింగ్స్‌లో మూడు సిక్స్‌లు బాదడం ద్వారా జైస్వాల్ అద్భుతమైన రికార్డు సొంతం చేసుకున్నాడు. టెస్టుల్లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో 30 కంటే ఎక్కువ సిక్స్‌లు బాదిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా ఈ ఫీట్ అందుకున్న రెండో బ్యాటర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్ మాజీ ఆటగాడు బ్రెండన్ మెక్‌కల్లమ్ (33 సిక్స్‌లు) అగ్రస్థానంలో ఉన్నాడు. అతడు 2014లో 33 సిక్సర్లు బాదాడు. ఈ ఏడాది ఇప్పటివరకు యశస్వి జైస్వాల్ 32 సిక్స్‌లు కొట్టాడు. ఈ యువ బ్యాటర్ మరో రెండు సిక్సర్లు బాదితే మెక్‌కల్లమ్ రికార్డును బ్రేక్ చేస్తాడు. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు, తర్వాత ఆస్ట్రేలియాతో బోర్డర్-గావస్కర్‌లో యశస్వి ఆడనున్నాడు. దీంతో అతడు మెక్‌కల్లమ్ రికార్డును సునాయంసగా బ్రేక్ చేయడం ఖాయం.

ఈ ఏడాది టెస్టుల్లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న జైస్వాల్ 19 ఇన్నింగ్స్‌ల్లో 1084 పరుగులు చేశాడు. ఈ క్రమంలో స్వదేశంలోనే వెయ్యికిపైగా పరుగులు చేసిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు. అతడికంటే ముందు గుండప్ప విశ్వనాథ్ (1979లో), సునీల్ గావస్కర్ (1979లో) మాత్రమే టీమ్‌ఇండియా బ్యాటర్లుగా స్వదేశంలో 1000ంకి పైగా పరుగులు రాబట్టారు. భారత్, న్యూజిలాండ్ మధ్య మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబయి వేదికగా ప్రారంభంకానుంది. నవంబర్ 22 నుంచి బోర్డర్-గావస్కర్ సిరీస్ మొదలవనుంది. ఈ సిరీస్ కోసం ఇప్పటికే భారత జట్టును ప్రకటించారు.

## న్యూజిలాండ్‌కు షాక్.. సిరీస్ మధ్యలోనే స్వదేశానికి ఆల్‌రౌండర్



**ఢిల్లీ:** హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైన ఆమ్ ఆద్మీ పార్టీ మహారాష్ట్ర ఎన్నికల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించిందని ఆ పార్టీ నేత సంజయ్ సింగ్ తెలిపారు. మహా వికాస్ అఘాఢీ కూటమిలోని పార్టీలకు మద్దతుగా తమ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. మహారాష్ట్రతో పాటు ఝార?ండ్ విషయంలోనూ ఆమ్ ఆద్మీ పార్టీ ఇదే వైఖరి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హేమంత్ సోరెన్‌కు మద్దతుగా ఝార?ండ్ ముక్తి మోర్చాకు కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్రలోని 288 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరనుండగా.. ఝార?ండ్‌లో 13, 20 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. 23న ఫలితాలు వెలువడనున్నాయి. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి పోటీగా విపక్ష పార్టీలన్నీ ఇండియా కూటమి స్థాపించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ, గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో కలిసి ఆప్ పోటీ చేసింది. ఒక్క పంజాబ్‌లో మాత్రం ఒంటరిగా బరిలోకి దిగింది. ఇటీవల జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం సొంతంగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైంది. తాజాగా మహారాష్ట్ర, ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా నిలిచింది.

విశ్వంభర V3 NEWS

# ఇండియన్ మూవీగా 'పుష్ప-2' సరికొత్త రికార్డు.!



మరో 40 రోజుల్లో పుష్ప 2 సందడి మొదలవుతుంది. ఎప్పుడెప్పుడా అని బన్నీ అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఎదురుచూస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఈ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్‌లో అదరగొడుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే అన్ని భాషల్లో కలిపి ప్రీ రిలీజ్ బిజినెస్ రూ.1000 కోట్లకు పైగా జరిగినట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం విడుదల పరంగా మరో రికార్డును నమోదు చేయబోతుంది. ఈ సినిమా విడుదలకు సంబంధించి వరల్డ్ వైడ్‌గా ఆరు భాషల్లో కలిపి 11,500 స్క్రీన్స్‌లో విడుదల కాబోతున్నట్లు సమాచారం. దీంతో ఇంతకుముందు రాజమౌళి ఆర్ఆర్ఆర్ పేరిటా ఉన్న ఈ రికార్డు బద్దలవ్వనుంది. ఆర్ఆర్ఆర్ చిత్రం 10200 లుకు పైగా స్క్రీన్స్‌లో విడుదల అయ్యింది. ఇప్పటివరకు ఇండియన్ సినిమాలలో బిగ్గెస్ట్ రిలీజ్ అయిన చిత్రం ఇదే. అయితే ఈ రికార్డును పుష్ప అధిగమించబోతుంది. ఓవర్సీస్‌లో 5000 వేల స్క్రీన్స్, ఇండియాలో 6500 స్క్రీన్స్‌లో కలిపి మొత్తం 11,500 స్క్రీన్స్‌లో పుష్ప 2 విడుదల కాబోతున్నట్లు సమాచారం.

# బాలయ్యపై మరో బాలీవుడ్ హీరోయిన్ కామెంట్స్



నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం ఎన్‌బీకే 109, ఎన్‌బీకే 110 సినిమాలతో పాటు అన్‌స్టాపబుల్ సీజన్ 4తో ట్రెండింగ్ లో ఉన్నారు. సంక్రాంతి కానుకగా ఎన్‌బీకే 109 విడుదల కానుంది. ఈ సినిమాకి బాబీ దర్శకత్వం వహిస్తుండగా హీరోయిన్లుగా బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేల, పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్నారు. అయితే టాలీవుడ్‌లో బాలయ్యపై కామెంట్ చేసేందుకు ఎవరైనా వెనకడుగేస్తునారు. కానీ.. బాలీవుడ్‌లో రెండోసారి బాలయ్య హీరోయిన్ ఆయనపై కామెంట్ చేసింది. దీంతో బాలయ్య ఫ్యాన్స్ ఊగిపోతున్నారు. ఇంతకీ ఏమైందంటే..గతంలో బాలయ్యతో లెజెండ్, లయన్ సినిమాల్లో నటించిన బాలీవుడ్ బ్యూటీ రాధికా ఆప్టే ఆయనపై చేసిన వ్యాఖ్యలు ఎంత సంచలనం సృష్టించాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తాజాగా మరో బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేల బాలయ్య ఏజ్‌పై కామెంట్ చేసింది. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. "నేను బాబీ డియోల్‌తో కలిసి ఒక సినిమా చేస్తున్నా.. అతనికి నాకు ఏజ్ గ్యాప్ 37 సంవత్సరాలు. ఇక తెలుగులో బాలకృష్ణ ఎన్‌బీకే 109లో హీరోయిన్‌గా నటిస్తున్నా.. ఆయనకు నాకు ఎంత ఏజ్ గ్యాపో నాకు తెలీదు, ఇండస్ట్రీలో ఇంత ఏజ్ గ్యాప్ క్యారెక్టర్లు చేస్తూ.. స్టీరియో టైప్స్ బ్రేక్ చేస్తున్నా" అంది. అయితే బాబీ ఏజ్ 67, బాలయ్య ఏజ్ 64 అండ్ ఊర్వశి ఏజ్ 30. కానీ.. బాబీ కంటే బాలయ్య ఏజ్ ఎక్కువ అనే తరహాలో ఆమె మాట్లాడటం బాలయ్య అభిమానులకు చిరాకు తెప్పిస్తోంది. మరోవైపు సంక్రాంతి కానుకగా రిలీజ్ కానున్న ఈ సినిమాకు టైటిల్ ఇంకా ఫిక్స్ కాలేదు. గతంలో ఈ చిత్రం కోసం రెండు టైటిళ్లు పరిశీలిస్తున్నట్లు వార్తలొచ్చాయి. 'డాకూ మహారాజా' 'సర్కార్ సీతారామ్' ఈ రెండింటిలో ఒకటి ఫిక్స్ చేసే అవకాశాలున్నాయని సన్నిహితుల సమాచారం అన్నారు. ఈ చిత్రంలో బాలయ్య బందిపోటు తరహా పాత్ర పోషిస్తున్నారు. అందుకే డాకూ మహారాజా టైటిల్‌ను ఫైనల్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆ టైటిల్ క్లాస్‌కి కనెక్ట్ కాదనుకుంటే సర్కార్ సీతారామ్'కి సై అనే ఛాన్స్ ఉంది. ఈ రెండింటిలో ఏ టైటిల్ ఫిక్స్ చేశారన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ టాక్ బయటకు వచ్చినప్పటి నుంచి అభిమానులు అయితే డాకూ మహారాజానే బాగుందని ఫీడ్ బ్యాక్ ఇస్తున్నారు.

# సాయి ధరమ్ తేజ్ కెరీర్‌లోనే బిగ్ ప్రాజెక్ట్



విరూపాక్ష వంటి బ్లాక్‌బస్టర్ చిత్రం తర్వాత మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ నటిస్తోన్న కొత్త చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాను హనుమాన్ వంటి భారీ చిత్రాన్ని అందించిన నిర్మాతలు కె నిరంజన్ రెడ్డి , చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పై ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా.. ప్రపంచ రికార్డులను బద్దలుకొట్టిన ఓ హాలీవుడ్ సినిమాకు రీమేక్ అని తెలుస్తోంది. ఇంతకీ ఆ మూవీ ఏంటి.. తేజ్ ఏమన్నాడంటే.. ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు 'జాక్ సిండర్' దర్శకత్వం వహించిన సినిమా '300'. యుద్ధం నేపథ్యంలో యుద్ధవీరుల సాహసాల కథ ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచ సినిమా చరిత్రలో సరికొత్త అధ్యాయం. 2006లో రిలీజైన ఈ సినిమాను ఇండియాలోని అన్ని భాషల్లో ఫ్రీమేక్ చేశారు. తాజాగా తెరకెక్కనున్న సాయి ధరమ్ తేజ్ సినిమా కూడా అదే అని వార్తల్లొచ్చాయి. దీనిపై హీరో తేజ్ స్పందిస్తూ.. 300 సినిమా నుండి ఇన్‌స్పైర్ చెందే ఈ సినిమాని రూపొందిస్తున్నామన్నారు. తేజ్ కెరీర్‌లోనే ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమాని 120-130 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నట్లు సమాచారం. అలాగే.. రాజకీయాల్లోకి అడుగుపెట్టడంపై తన అభిప్రాయాన్ని తెలియజేశారు తేజ్. హైదరాబాద్‌లో జరిగిన ఓ సెషన్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం చూస్తున్న రాజకీయాల్లోకి అడుగుపెట్టాంటే ఎన్నో విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. ''నాకు తెలిసింది సినిమా మాత్రమే ప్రస్తుతం నా ఫోకస్ అంతా సినిమాలపైనే ఉంది. మరెన్నో విభిన్నమైన చిత్రాలు, వైవిధ్యమైన పాత్రలు చేయాలి, ప్రేక్షకుల్ని అలరించాలి. రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన ప్రస్తుతానికి లేదు. అటువైపు అడుగేయాలంటే ఎన్నో విషయాలు నేర్చుకోవాలి. ప్రజా సమస్యలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి'' అని తేజ్ అన్నారు.

# 'బఘీర'సెకండ్ సింగిల్ రిలీజ్



రోరింగ్ స్టార్ శ్రీమురళి, రుక్మిణి వసంత్ 'బఘీర' సెకండ్ సింగిల్ లవ్ మెలోడీ 'పరిచయములే' సాంగ్ రిలీజ్ అయింది. ఉగ్రమ్ ఫేమ్ రోరింగ్ స్టార్ శ్రీమురళి ఎక్సయిటింగ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బఘీర'తో అలరించబోతున్నారు. ప్రశాంత్ నీల్ ఈ చిత్రానికి కథ అందించారు. డాక్టర్ సూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలింస్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ మూవీ అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఫస్ట్ సింగిల్, ట్రైలర్ ఇప్పటికే సంచలనాన్ని సృష్టించాయి. ఇప్పుడు సెకండ్ సింగిల్- పరిచయమేలే రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాట శ్రీమురళి, రుక్మిణి వసంత్ ప్రేమకథని ప్రజెంట్ చేసింది. బి అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన ఈ హార్ట్ టచ్చింగ్ నెంబర్, రెండు పాత్రల మధ్య కెమిస్ట్రీని అందంగా చూపించింది. శ్రీమురళి టఫ్ పోలీసు ఆఫీసర్, స్త్రీలకు హాని కలిగించే వారిని కఠినంగా శిక్షిస్తుంటాడు, రుక్మిణి సున్నితమైన ప్రవర్తన కలిగిన డాక్టర్. రెండు డిఫరెంట్. వ్యక్తిత్వాలు పాటలో బ్యూటీఫుల్ అండ్ డైనమిక్ గా ప్రజెంట్ చేశారు. రాంబాబు గోసాల లవ్లీ లిరిక్స్ ఆకట్టుకున్నాయి. రితేష్ జి రావు తన వోకల్స్ తో మెస్మరైజ్ చేశారు. ఈ పాట లీడ్ పెయిర్ మధ్య డాజ్లింగ్ కెమిస్ట్రీని హైలైట్ చేస్తుంది. ఈ చిత్రాన్ని ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది.నటి నటులు : శ్రీమురళి, రుక్మిణి వసంత్, ప్రకాష్ రాజ్, రంగాయణ రఘు, అచ్యుత్ కుమార్, గరుడ రామ్, తదితరులు

# నా శరీరం ... నా ఇష్టం



బాలీవుడ్ హీరోయిన్ అలియా భట్ అందం కోసం కాస్మోటిక్ సర్జరీ చేయించుకుందని సోషల్ మీడియాలో వీడియోలు, ఆర్టికల్స్ రావడంపై ఆమె ఎక్స్ ట్విటర్ ద్వారా తీవ్రంగా అసహనం వ్యక్తం చేసింది. "సెలబ్రెటీలను ఎందుకు టార్గెట్ చేస్తున్నారు. నేను సర్జరీ చేయించుకున్నాను చేయించుకోలేదు అనేది పూర్తిగా నా వ్యక్తిగతం. నా బాడీ, నా పర్సనల్. ఈ విషయం మీకు చెప్పాల్సిన అవసరం లేదు. అయినా వ్యక్తిగత జీవితంలో అందం గురించి తీసుకునే ప్రికాషన్స్ గురించి మీకేం అవసరం. సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న నా వీడియోలు చూస్తే హాస్యాస్పదంగా అనిపిస్తున్నాయి. ఆ వీడియో క్రియేట్ చేసిన వారి దృష్టిలో నా నవ్వు వంకరగా ఉంటుంది. నేను మాట్లాడే విధానం మరోలా ఉంటుంది. నేను అందం కోసం సర్జరీలు చేయించుకున్నాను. అలాగే వారి దృష్టిలో నాకు పక్షవాతం కూడా వచ్చింది. ఎలాంటి ప్రూఫ్‌లు లేకుండా ఇలాంటి రూమర్స్ సృష్టించి మీరంతా తమాషాలు చేస్తున్నారా? ఎలాంటి ప్రూఫ్ లేకుండా ఎదుటి వారి ఇలాంటి అసభ్య కామెంట్స్ చేయడం నేరమని మీకు తెలీదా? కేవలం వ్యూస్ కోసం ఇలా చేయడం కరెక్ట్ కాదు. ఇలా కామెంట్స్ చేసే వారిలో మహిళలు కూడా ఉండడం సిగ్గుచేటు అని చెప్పాలి. ఈ పద్ధతి ఎప్పటికైనా హానికరమే" అని పేర్కొన్నారు. కాగా, అలియా పెట్టిన ఈ పోస్ట్‌కు పలువురు సెలబ్రిటీలు మద్దతు తెలుపుతున్నారు. ఇకపోతే గతంలోనూ చాలా మంది హీరోయిన్లు అందంగా కనిపించడానికి లిప్స్, ఇతర భాగాల్లో సర్జరీలు చేయించుకున్నారని వార్తలు వచ్చాయి. అలియా భట్ కూడా ఇలాగే కాస్మోటిక్ సర్జరీ చేయించుకుందని తరచుగా వార్తలు రావడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. కాగా, అలియా భట్ ప్రస్తుతం అల్ఫా సినిమా షూటింగ్‌లో బిజీ బిజీగా గడుపుతోంది. కశ్మీర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో తనతో పాటు షార్వారీ కూడా నటిస్తున్నారు. యశ్ రాజ్ ఫిల్మ్ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఈ మూవీకి శివ దర్శత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. రీసెంట్‌గానే అలియా భట్ నటించిన జాగ్రా మూవీ అక్టోబర్ 11న థియేటర్లలో విడుదలై మిక్స్‌డ్ టాక్ అందుకుంది.

# రెండో పెళ్లి గురించి ఆలోచించడంలేదు



టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకుంది. 'ఏమాయ చేశావే' చిత్రంతో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన సామ్.. తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక తొలి చిత్రంలో స్క్రీన్ షేర్ చేసుకున్న అక్కినేని నాగచైతన్యతో ప్రేమలో పడి వివాహం కూడా చేసుకుంది. అయితే, క్యూట్ కపుల్‌స్‌గా పేరు తెచ్చుకున్న ఈ జంట నాలుగేళ్లకే తమ వివాహ బంధానికి స్వస్తి చెప్పేశారు. ప్రస్తుతం ఎవరి లైఫ్‌లో వారు బిజీ అయిపోయారు. అయితే, నాగచైతన్య మాత్రం సామ్‌తో విడిపోయిన తర్వాత రెండో పెళ్లికి సిద్ధమయ్యారు. మరో నటి శోభితతో ఎంగేజ్మెంట్ కూడా చేసుకున్నాడు. మరికొన్ని రోజుల్లో వివాహం కూడా చేసుకోబోతున్నారు. సమంత మాత్రం చైతూతో విడాకుల తర్వాత ఒంటరిగానే ఉంటోంది. ఇక పలు అనారోగ్య సమస్యల కారణంగా ఏడాదికాలంగా సినిమాలకు బ్రేక్ తీసుకుంది. ప్రస్తుతం మళ్లీ ప్రొఫెషనల్ లైఫ్‌లో బిజీ అవుతోంది. తాను నటించిన 'సిటాడెల్: హనీ బన్నీ' సిరీస్‌తో ప్రేక్షకులన పలకరించేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్ ప్రొమోషన్స్‌లో పాల్గొంటోంది. ఈ సందర్భంగా సామ్‌కు ఓ విచిత్ర ప్రశ్న ఎదురైంది. రెండో పెళ్లి గురించి ఓ విలేకరు సామ్‌ను ప్రశ్నించారు. దీనికి సమంత ఆసక్తికరంగా సమాధానం ఇచ్చారు. 'నేను ప్రేమించి వివాహం చేసుకున్నాను. కానీ ఇప్పుడు విడిపోయాను. ఇక జీవితంలో రెండో వివాహం గురించి నేను ఆలోచించడం లేదు. నాకు మరో వ్యక్తి తోడు అవసరం లేదు. ప్రస్తుతం లైఫ్‌లో హ్యాపీగానే ఉన్నాను' అంటూ చెప్పుకొచ్చింది. సామ్ కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్‌గా మారాయి. ఇవి చూసిన నెటిజన్లు సమంతను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

బీట్‌రూట్‌లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అందుకే.. మంచి ఆరోగ్యం కోసం బీట్‌రూట్ తప్పనిసరిగా తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తుంటారు.. దుంప జాతికి చెందిన బీట్‌రూట్ చాలా పోషకమైన ఆహారం.. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి.. ఇవి మన ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. రోగాలు దగ్గరకు రానివ్వని బీటాలైన్లు కూడా ఇందులో ఉంటాయి. బీట్‌రూట్‌లో విటమిన్ సి, ఐరన్, పొటాషియం, ఫోలేట్, డైటరీ ఫైబర్ ఉంటాయి.. ఇది రక్తపోటును తగ్గించడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, మధుమేహ ప్రమాదాన్ని తగ్గించడం వంటి అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దీనిని జ్యూస్, సలాడ్, చట్నీ, సూప్, కూర.. ఇలా అనేక రకాలుగా తీసుకోవచ్చు.. ప్రతిరోజూ ఉదయం బీట్‌రూట్ జ్యూస్ తాగితే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

# ఇదేం చేస్తుందిలే అనుకునేరు.. బ్రహ్మాస్త్రం లాంటిది



**రోగనిరోధక శక్తి పెరుగుతుంది**

మారుతున్న వాతావరణంలో జలుబు, దగ్గు మరియు జ్వరం వచ్చే ప్రమాదం పెరుగుతుంది.. అటువంటి పరిస్థితిలో.. మీ రోగనిరోధక శక్తి మెరుగ్గా ఉంటే అలాంటి వైరల్ వ్యాధులను నివారించగలుగుతారు. ఉదయాన్నే ఒక గ్లాసు బీట్‌రూట్ జ్యూస్ తాగే వ్యక్తుల్లో రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది. ఇది ఇన్‌ఫెక్షన్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే అందులో విటమిన్ సి – యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.

**కడుపు – జీర్ణసమస్యలు దూరం**

మీరు తరచుగా గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం, గుండెల్లో మంట లేదా అసిడిటీని ఎదుర్కొంటున్నట్లయితే, బీట్‌రూట్ రసం మీకు ఔషధంలా పని చేస్తుంది. మెరుగైన జీర్ణక్రియ బరువును నియంత్రించడంలో చాలా సహాయపడుతుంది.. ఇది పెద్దప్రేగు క్యాన్సర్ నుండి కూడా మనలను కాపాడుతుంది.

**కడుపు – జీర్ణసమస్యలు దూరం**

మీరు తరచుగా గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం, గుండెల్లో మంట లేదా అసిడిటీని ఎదుర్కొంటున్నట్లయితే, బీట్‌రూట్ రసం మీకు ఔషధంలా పని చేస్తుంది. మెరుగైన జీర్ణక్రియ బరువును నియంత్రించడంలో చాలా సహాయపడుతుంది.. ఇది పెద్దప్రేగు క్యాన్సర్ నుండి కూడా మనలను కాపాడుతుంది.

**రక్తపోటు తగ్గుతుంది**

మీరు అధిక రక్తపోటు బాధితులైతే.. బీట్‌రూట్ జ్యూస్‌ను మీ మార్నింగ్ డైట్‌లో చేర్చుకోవచ్చు. ఇందులో నైట్రిక్ ఆక్సైడ్ పుష్కలంగా లభిస్తుంది. దీని ద్వారా, రక్త నాళాలు విస్తరించవచ్చు.. తద్వారా పెరుగుతున్న రక్తపోటును తగ్గిస్తుంది. గుండె జబ్బులకు హైపర్‌టెన్షన్ ప్రధాన కారణమం.. అందుకే బీట్‌రూట్ జ్యూస్‌ని క్రమం తప్పకుండా తాగితే గుండెపోటు వచ్చే ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది.

**చర్మానికి మేలు చేస్తుంది**

మనలో చాలా మంది చర్మ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు.. అటువంటి పరిస్థితిలో, బీట్‌రూట్ జ్యూస్ మీకు పరిష్కారం చూపుతుంది. నిజానికి, బీట్‌రూట్‌లో పుష్కలంగా విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.. ఇవి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.



# రాత్రి పెరుగు తింటే ఏం జరుగుతుంది?

పెరుగు అంటే చాలా మందికి ఇష్టం. భోజనం చివరిలో పెరుగు తినకపోతే.. తిన్నట్టు అనిపించదు. పెరుగు తినడం కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో శరీరానికి అవసరం అయ్యే పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. పెరుగు తింటే శరీర ఆరోగ్యం, చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటాయి. ప్రతి రోజూ ఓ కప్పు పెరుగు తింటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులో ఉండే ప్రోబయోటిక్స్.. శరీరంలో ఉండే మలినాలు, విష పదార్థాలను బయటకు పంపుతాయి. శరీరాన్ని కూడా చల్లబరుస్తుంది. పెరుగు తింటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. డయాబెటీస్, బీపీ కూడా అదుపులో ఉంటాయి. అయితే రాత్రి పూట పెరుగు తినొచ్చా? తింటే ఏం జరుగుతుంది? అని చాలా మంది సందేహిస్తూ ఉంటారు. ఆ సందేహానికి జవాబు ఇప్పుడు తెలుసుకుందాం. కఫం, జలుబు, దగ్గు వంటి సమస్యలతో బాధ పడేవారు రాత్రి పూట పెరుగు తినకపోవడమే మంచిది. దీని వల్ల సమస్య మరింత పెరగొచ్చు. ఈ సమస్యలు లేని వారు మాత్రం ఎలాంటి సందేహం లేకుండా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అదే విధంగా శ్వాస కోస సమస్యలు, వాతవ చేసే గుణం ఉన్నవారు కూడా రాత్రి పూట పెరుగు తినకపోవడం మంచిది. ఈ సమస్యలతో పెరుగు తినడం వల్ల నిద్రించే సమయంలో శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com